బైబై.. గణేశా..

- ఘనంగా వినాయక నిమజ్జనాలు
- తీరప్రాంతానికి తరలిన వందలాది విగ్రహాలు
- భక్తులతో కోలాహలం


కొత్తపట్నం తీరంలో భారీ గణేషుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా ఆదివారం వినాయక నిమజ్జనాలు ఉత్సాహంగా జరిగాయి. పండుగ తొమ్మిదో రోజు కావడంతో భక్తులు గణనాథులకు పూజలు చేసిన అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడికి చేర్చారు. ఈ సందర్భంగా యువత గణపతి బప్పా మోరియా అంటూ గులాములు చల్లుకున్నారు. డీజే సౌండ్ పాటలకు, డప్పు వాయిద్యాలకు అనుగుణంగా చిందులు వేస్తూ సందడి చేశారు. వందలాది విగ్రహాలు, వాటితో తరలివచ్చిన భక్తులతో తీరప్రాంతాలైన కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల, పాకల తదితర చోట్ల కోలాహలం నెలకొంది. కొత్తపట్నం పల్లెపాలెం వద్ద పండుగ వాతావరణం కనిపించింది. అక్కడ వందల సంఖ్యలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

\- ఒంగోలు, కల్చరల్


గంగమ్మ ఒడికి గణపయ్య


వినాయక విగ్రహాలతో చిన్నారుల కేరింతలు




కోలాహలం మధ్య కమ్మపాలెంలోని వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న నిర్వాహకులు


నిమజ్జనం సందర్భంగా తీరంలో గణేషుడి విగ్రహాల వద్ద యువత సందడి


కొత్తపట్నం తీరంలో నిమజ్జనం కోసం బారులు తీరిన గణనాథుల విగ్రహాలు

కొనసాగుతున్న వైద్యుల ఆందోళన

- నేడూ పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 15 : పీజీ వైద్యవిద్యలో ఇన్ సర్వీసు కోటాను 15శాతానికి తగ్గించడాన్ని నిరసిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీల) వైద్యాధికారులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. సోమవారం కూడా ఓపీలను బహిష్కరించాలని వారు నిర్ణయించుకున్నారు. వైద్యారోగ్యశాఖ ముఖ్య అధికారులతో జరిగిన చర్చలు విఫలం కావడంతో పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ నేతలు ఆదివారం విజయవాడలో సమావేశమయ్యారు. సోమవారం సాయంత్రం లోపు ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోతే తదుపరి కార్యాచరణకు దిగాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గిస్తూ జారీ చేసిన జీవో నంబరు 85ను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ తెలిపారు.

ఇద్దరు డీఎస్పీల నియామకం

- మార్కాపురానికి నాగరాజు, కనిగిరికి మహేశ్వరరావు


డీఎస్పీ నాగరాజు

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 15 : మార్కాపురం డీఎస్పీగా యు.నాగరాజు, కనిగిరి డీఎస్పీగా ఎం.మహేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. మార్కాపురం డీఎస్పీ పోస్టు రెండు నెలల నుంచి ఖాళీగా ఉంది. కనిగిరి డీఎస్పీగా పనిచేసిన రామరాజు గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో అక్కడ ఖాళీ ఏర్పడింది. ఈ రెండు పోస్టులను ఇప్పుడు భర్తీ చేశారు.

అలా వదిలేశారు!

జిల్లా వైద్యారోగ్యశాఖలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఉద్యోగ నియామకాల్లో అప్పటి అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. ఒక్కో పోస్టుకు రేటు నిర్ణయించి అమ్ముకున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. అందులో విస్తుపోయే అనేక వాస్తవాలు వెలుగు చూశాయి. స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలు 41 మంది అనర్హులకు కట్టబెట్టినట్లు తేలింది. వారి పేర్లను కూడా విచారణ కమిటీ నివేదికలో పొందుపరిచి ఉన్నతాధికారులకు సమర్పించింది. కానీ ఇప్పటి వరకూ చర్యలు కరువయ్యాయి. ఉన్నత స్థాయిలో ఈ ఫైల్‌ను తొక్కిపెట్టినట్లు తెలుస్తోంది. అందుకోసం భారీ మొత్తంలోనే డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



వైద్యారోగ్యశాఖ ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు

వైసీపీ హయాంలో 41 మందికి నిబంధనలకు విరుద్ధంగా కొలువులు

రెండు నెలలపాటు విచారించి నివేదిక సమర్పించిన అధికారుల కమిటీ

బుట్టదాఖలు చేసిన ఉన్నతాధికారులు

అందుకు ప్రతిగా భారీ మొత్తంలో ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 15 : వైద్యారోగ్యశాఖ అధికారులు గత వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ఉద్యోగాలను సైతం అమ్ముకున్నారు. ముఖ్యంగా 2020 కరోనా సమయంలో చేపట్టిన అత్యవసర నియామకాల్లో చేతివాటం చూపించారు. 300 పోస్టులకు పైగా భర్తీ చేసిన వారు అందులో కొన్ని పోస్టులను అనర్హులకు కట్టబెట్టారు. దీనిపై అటు కలెక్టర్‌కు, ఇటు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

విచారణకు నలుగురు అధికారులతో కమిటీ

వైద్యారోగ్యశాఖలో ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై గత ఏడాది అక్టోబర్‌లో విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. అప్పటి జడ్పీ సీఈవో జాలిరెడ్డి నేతృత్వంలో నలుగురు అధికారులతో అప్పటి కలెక్టర్ కమిటీని ఏర్పాటు చేశారు. దీంతో రంగంలోకి దిగిన వారు జిల్లా వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాల నోటిఫికేషన్ నాటి నుంచి నియామక పత్రాలు ఇచ్చేంత వరకూ జరిగిన నోట్ ఫైళ్లతోపాటు ఉద్యోగాల కోసం చేసిన దరఖాస్తులను కూడా పరిశీలించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారికి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉద్యోగాల కోసం వచ్చిన దరఖాస్తులు కనిపించని పరిస్థితుల నుంచి నివేదిక ఇచ్చేంత వరకూ ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు గతేడాది డిసెంబరులో అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్‌కు విచారణ నివేదికను అందజేశారు. స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ నియామకాల్లో 41 మంది అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు పేర్లతో సహా నివేదికలో పొందుపర్చారు. విచారణ నివేదికను పరిశీలించిన అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ చర్యలు తీసుకోవాలని కోరుతూ వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు పంపారు. కానీ ఇప్పటి వరకూ స్పందన కరువైంది. అయితే ఈ విచారణ నివేదికను వైద్యారోగ్యశాఖ రాష్ట్ర కార్యాలయంలో పనిచేసే ఒక అధికారి తొక్కిపెట్టినట్లు సమాచారం.

భారీగా చేతులు మారినట్లు ఆరోపణలు

విచారణ నివేదిక ఫైల్‌ను తొక్కిపెట్టడం వెనుక భారీగా చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. తమపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు అప్పట్లో పనిచేసిన అధికారులతోపాటు, ఉద్యోగులు కూడా ఉన్నతాధికారులకు పెద్ద మొత్తంలో మామూళ్లను సమర్పించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఉద్యోగ నియామకాల్లో ముగ్గురు డీఎంహెచ్‌వోలతోపాటు ఆరుగురు కార్యాలయ ఉద్యోగుల పాత్ర ఉంది. వీరితోపాటు ఉద్యోగాలు పొందిన 41 మంది అనర్హులు కూడా కలిసికట్టుగా రాష్ట్రస్థాయిలోనే ఫైల్ నిలిచిపోయేలా పావులు కదిపినట్లు ప్రచారం జరుగుతోంది.

కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకొనేనా?

గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగ నియామకాల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై కూటమి ప్రభుత్వంలోనైనా చర్యలు ఉంటాయా? లేదా? అన్న చర్చ నడుస్తోంది. ఇటీవల ఈ విషయం అధికార పార్టీ ముఖ్యనేత వద్ద చర్చకు వచ్చినట్లు తెలిసింది. దీనిపై కూటమి నేతలు దృష్టి సారించి వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతోపాటు సంబంధిత మంత్రితో చర్చించి తదుపరి చర్యలు తీసుకొనేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పొన్నలూరు సొసైటీలో భారీ అక్రమాలు


పొన్నలూరులోని సొసైటీ కార్యాలయం (ఫైల్)

ఆడిట్‌లో వెలుగు చూసిన ఆర్థిక అవకతవకలు

మూడు దశాబ్దాలుగా పెండింగ్ బకాయిలు

అధికారుల నిర్వాకంతో కుదేలు

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 15 : పొన్నలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో భారీగా అక్రమాలు, ఆర్థిక అవకతవకలు, పరిపాలనా పరమైన లోపాలు చోటుచేసుకున్నాయి. సొసైటీలో లావాదేవీలపై 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఆడిట్‌లో అవి వెలుగు చూశాయి. ప్రారంభ నిల్వ, అంత్య నిల్వల్లో తేడాలు చూపించి లక్షలాది రూపాయలు గోల్‌మాల్ చేశారు. పాలకవర్గాలు, పర్సన్ ఇన్‌చార్జిలు, సహకారశాఖ అధికారులు, సీఈవోల నిర్వాకంతో సొసైటీ ఆర్థికంగా కుదేలైంది. మూడు దశాబ్దాల క్రితం సొసైటీ నుంచి తీసుకున్న రుణాలు ఇప్పటికీ వసూలు కాకుండా వాయిదా మీరిన బకాయిలుగా మిగిలిపోయాయి. ఈ రుణాలకు సంబంధించి బాండ్ల కాలపరిమితి కూడా ముగియడంతో అవి ఇక వసూలయ్యే అవకాశం లేకుండా పోయింది. దీంతో సొసైటీ నష్టాల ఊబిలో కూరుకుపోయింది.

ఆర్థిక అక్రమాలు ఇవే

- సొసైటీ నగదు పుస్తకాల్లో ప్రారంభ, అంత్య నిల్వలు, ఖర్చుల మొత్తాల్లో వ్యత్యాసంతో రూ.2.35 లక్షలు గల్లంతయ్యాయి.
- సీఈవో జీతాన్ని ఏఎస్‌సీఎఫ్ ఖాతా నుంచి డ్రా చేయాల్సి ఉండగా సొసైటీ నగదు పుస్తకం నుంచి నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్నారు. ఈ ఏడాది జనవరి 29న రూ.65వేలు, ఫిబ్రవరి 28న రూ.62,680 డ్రా చేశారు.
- సొసైటీ షేర్ ధనంలో రూ.3.71 లక్షల వ్యత్యాసం ఉంది. షేర్ క్యాపిటల్ లిస్టుకు, సొసైటీ చిట్టా పుస్తకంలో జమల వైపు నమోదు చేసిన దానికి వ్యత్యాసం ఉంది. జాబితాలో సభ్యుల జనరల్ నంబర్ లేకుండానే షేర్ క్యాపిటల్ నమోదు చేశారు.
- డీసీసీ బ్యాంకు కందుకూరు శాఖకు చెల్లించాల్సిన షేర్ ధనం, చిట్టా పుస్తకంలో ఖర్చులు చూపించిన మొత్తానికి రూ.59,600 తేడా ఉంది. ఈమొత్తం గల్లంతైంది.
- బ్యాంకు కందుకూరు బ్రాంచిలో చెల్లించిన రుణానికి సంబంధించి అసలు, వడ్డీకి.. సొసైటీ నగదు పుస్తకంలో బ్యాంకుకు చెల్లించిన మొత్తానికి రూ.1.70 లక్షలు తేడా ఉంది.
- సొసైటీలో బినామీ రుణాలున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రైతులకు ఇచ్చిన రూ.8.15 లక్షల స్వల్పకాలిక రుణాలకు సంబంధించి రసీదు పుస్తకాల్లో ఉన్న పేర్లకు, సంఘ చిట్టా పుస్తకంలో నమోదైన పేర్లకు తేడా ఉంది.

మూడు దశాబ్దాలుగా మొండి బకాయిలు

సొసైటీలో మూడు దశాబ్దాలుగా వసూలు కాకుండా నిలిచిపోయిన బకాయిలు అనేకం ఉన్నాయి. 1992లో బట్వాడా చేసిన రుణాలు కూడా ఇప్పటికీ వసూలు కాకుండా మిగిలిపోయాయి. వీటికి సంబంధించిన బాండ్లకు కూడా కాలపరిమితి ముగిసింది. నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక, వ్యవసాయేతర రుణాలకు సంబంధించి బాండు కాలపరిమితి 12 సంవత్సరాలు. అప్పటికి ఆ బకాయిలు వసూలు కాకపోతే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకొనేందుకు ఒక సంవత్సరం గ్రేస్ పీరియడ్ ఇస్తారు. అనంతరం ఆ బకాయిలు వసూలు చేసేందుకు సొసైటీకి అధికారం ఉండదు. దీంతో ఆ మొత్తాలను రాని బాకీల పద్దు కింద చేరుస్తారు. స్వల్పకాలిక వ్యవసాయ రుణాలకు అయితే మూడు, నాలుగేళ్లలోపే బాండు కాలపరిమితి ముగుస్తుంది. నిర్దీత గడువులోపే ఆ రుణాలపై లీగల్ చర్యలు చేపట్టి బకాయిలు రాబట్టాలి. అలా చేయని పక్షంలో ఆ బకాయిలను బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్, సంబంధిత క్లర్క్, సొసైటీల పాలకవర్గం, సీఈవోలను బాధ్యులుగా చేసి వారినుంచి రాబడతారు. సొసైటీ సీఈవో, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వసూలు కాని బకాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉండగా నకిలీ పాసుపుస్తకాలు, బినామీ రుణాలు, బాండ్లలో అర్హతకు మించి రుణాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. గడువు లోపు చెల్లించని బకాయిలపై లీగల్ చర్యలు చేపడితే ఈ బాగోతాలు బయటపడతాయన్న భయంతోనే మిన్నకుండిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఏటా ఆడిట్ సమయంలో ఈ అవకతవకలన్నింటినీ గుర్తించి నివేదికలు ఇవ్వాల్సి ఉంది. కానీ అది కూడా జరగలేదు. ఇందులో సహకార శాఖ అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. సహకార సంఘాల చట్టం సెక్షన్ 51 ప్రకారం సమగ్ర విచారణ నిర్వహిస్తే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రాణం తీసిన కంచె



బావిలో నుంచి తీసున్న రైతు మృత దేహం (ఇన్‌సెట్లో) మన్నెం వెంకటేశ్వర్లు (ఫైల్)

విద్యుదాఘాతానికి రైతు మృతి

అడవి పందుల కోసం కంచె వేసిన వేటగాళ్లు

భయపడి శవాన్ని బావిలో పడేసిన వైనం

కొండపి, సెప్టెంబరు 15: అడవి పందుల కోసం వేసిన కంచె ఓ రైతు పాలిట మృత్యుపాశమైంది. మండలంలోని మూగచింతల గ్రామానికి చెందిన వేటగాళ్లు అడవి పందుల కోసం విద్యుత్ కంచెను గ్రామ సమీప పొలాల్లో ఏర్పాటు చేశారు. అది గమనించని రైతు మన్నెం వెంకటేశ్వర్లు (40) శనివారం రాత్రి పొలానికి వెళ్లి విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మరణించాడు. కంచెలో ఓ అడవి పంది, జింక కూడా పడింది. ఎర వేసిన వేటగాళ్లు గమనించి భయపడి రైతు శవాన్ని సూదూరంగా ఉన్న పొలాల్లోని బావిలో పడేశారు. తర్వాత ఏమీ ఎరగనట్లు గ్రామంలోకి వచ్చారు. ఎంతకూ వెంకటేశ్వర్లు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం రాత్రి, ఆదివారం ఉదయం వెతుకులాడి ఆచూకీ దొరక్కపోవడంతో కొండపి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు.

సమస్య జటిలం అవుతుండటంతో వేటగాళ్లు విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేశారు. తాము భయపడి అలా చేశామని చెప్పారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంకటేశ్వర్లును పడేసిన బావిలో నుంచి శవాన్ని వెలుపలకు తీసి ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణబాజీబాబు తెలిపారు.



గణేషుడికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



సముద్రతీరంలో తమ వినాయకులను నిమజ్జనం చేస్తున్న చిన్నారులు



స్వామివారికి నమస్కరిస్తున్న చిన్నారి



తీరంలో సందడి చేస్తున్న యువతీ, యువకులు

గణపయ్యా..వెళ్లి రావయ్యా..!

ముగిసిన వినాయక చవితి నవరాత్రులు ● నిమజ్జనానికి భారీగా తరలిన వినాయక విగ్రహాలు

డీజే వాయిద్యాలు, ఆటపాటలతో యువత సందడి ● సముద్రతీర ప్రాంతాలకు తరలిని గణేషుడి ప్రతిమలు ● జనసంద్రమైన తీరాలు



సముద్రతీరానికి భారీగా తరలివచ్చిన భక్తులు



విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న నిర్వాహకులు



గణేషుడి విగ్రహాలతో బాలలు



నిమజ్జనానికి కదులుతున్న గాంధీరోడ్డు విగ్రహం



లంబోదరా.. ఇక సెలవా మరి.. స్వామివారికి చివరిగా హారతి ఇస్తున్న భక్తురాలు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 15: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం 9వ రోజు కావడంతో గణేషుడి విగ్రహాలు నిమజ్జనానికి తరలించారు. యువత గణపతిబప్పా మోరియా అంటూ గులాము చల్లుకుని, డీజే సౌండ్ పాటలకు, డప్పు వాయిద్యాలకు అనుగుణంగా చిందులు వేస్తూ సందడి చేశారు. ఇక భారీ సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలి రావడంతో సముద్రతీర ప్రాంతాలు జనసంద్రంతో నిండిపోయాయి. ఇక ఒంగోలు నగరంలోని రాజాపానగల్ రోడ్, గద్దలగుంట, కమ్మపాలెం, రాజీవ్‌నగర్, సంతపేట, కర్నూల్ రోడ్, లాయర్‌పేట, మంగమూరు రోడ్ వంటి ప్రధాన ప్రదేశాలతోపాటు వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులతో నగరం ఉదయం నుంచి కిటకిటలాడింది.

తీరంలో భక్తుల కోలాహలం

కొత్తపట్నం(ఒంగోలు నగరం) : సముద్ర తీరం భక్త సంద్రంగా మారింది. వందల సంఖ్యలో గణేషుని విగ్రహాలతో భక్తులు కొత్తపట్నం సముద్ర తీరానికి తరలివచ్చారు. తొమ్మిది రోజుల పాటు గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించిన భక్తులు తొమ్మిదో రోజు నిమజ్జనం కోసం సముద్రతీరానికి తీసుకువచ్చారు. దీంతో కొత్తపట్నం సముద్ర తీరం భక్తులతో కిటకిటలాడిపోయింది. ఒంగోలు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో తీరానికి తరలివచ్చారు. ఉదయం నుంచే విగ్రహాలు తీరానికి రాక మొదలయ్యింది. తీరం వద్ద గణనాథులను రోడ్డు నుంచి సముద్రం వరకు తరలించేందుకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. రాత్రివరకు నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి. రాత్రి సమయంలో తీరానికి వచ్చిన విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భక్తులు అవస్థలు పడాల్సి వచ్చింది. నిమజ్జనం కోసం తగిన ఏర్పాట్లు చేయకపోవటంతో భక్తులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గణనాథుల విగ్రహాల రాకతో కొత్తపట్నం రహదారి వాహనాలతో నిండిపోయింది. జైగణేష జై కొడుతా గణేషా అంటూ భక్తులు నినదించారు. తీరం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు గట్టి చర్యలు చేపట్టారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు : మండలంలో వినాయకచవితి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులు గత ఎనిమిది రోజులుగా పూజలందుకొని తొమ్మిదవ రోజైన ఆదివారం పెద్ద ఎత్తున నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఎం.ముప్పాళ్లలో నందమూరి తారకరామారావు యూత్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన గణేషుడి వద్ద సర్పంచ్ వైకుంట పద్మశ్రీ, వీరాంజనేయులు దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, డప్పు నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. యువత, గ్రామస్థులు కోలాహలంగా తరలివెళ్లి మోటుపల్లి సముద్రతీరంలో లంబోదరుని నిమజ్జనం చేశారు. ఉప్పుగుండూరు ఉత్తరం బజారులో తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లంబోదరునికి పూజలు నిర్వహించి బాణాసంచా, డప్పు మోతలతో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారి లడ్డూను వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన సామినేని కృష్ణ రూ.60వేలకు పాడి దక్కించుకొన్నారు. అనంతరం పెదగంజాం సముద్రతీరంలో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు కనపర్తి సముద్రతీరంలో ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాలగణేష్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో..

సంతనూతలపాడు: సంతనూతలపాడులో ఆర్యవైశ్యకళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బాలగణేష్‌యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో యువత అంతా సంప్రదాయ దుస్తులు ధరించగా అర్చకులు నేలబట్ల శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జనం పురస్కరించుకుని ఆర్యవైశ్య కళ్యాణమండపం కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: మండలంలో గణేష్ నిమజ్జనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శివరామయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.



నగరంలో గులాములు చల్లుకుని మహిళలు ఆనందోత్సాహాలు



తీన్మార్ డప్పుల మధ్య ఊరేగింపు



గాంధీరోడ్డులో సందడి చేస్తున్న నిర్వాహకులు



నిమజ్జనానికి తీసుకెళుతున్న భక్తులు



సంతనూతలపాడు వినాయకుని పూజల్లో పాల్గొన్న యువత



ఒంగోలులోని ఓ సెంటరులో కోలాహలం





గణేష్ ప్రతిమలతో చిన్నారుల సందడి



తీరంలో నిమజ్జనం కోసం బారులు తీరిన విగ్రహాలు

'స్వామి' కోసం చెప్పులు లేకుండా..

కొండపి, సెప్టెంబరు15: కొండపి శాసనసభ్యుడిగా డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ కొర్రపాటి ప్రసాద్ సంవత్సరకాలం చెప్పులు లేకుండా తిరుగుతానని సంకల్పించాడు. అలాగే కొనసాగాడు. ఆదివారం కొండపికి వచ్చిన స్వామిని కలిసి విషయం చెప్పి కొత్త చెప్పులు స్వామి సమక్షంలో వేసుకున్నాడు. దీనికి ఆనందం వ్యక్తం చేసిన మంత్రి స్వామి ప్రసాద్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభిమానిని సన్మానిస్తున్న మంత్రి స్వామి

గణనాథుడి పూజలో మంత్రి స్వామి

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడులో పంచాయతీ కార్యాలయం ఎదుట బలరామకృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి పూజల్లో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఆదివారం రాత్రి పాల్గొన్నారు. కమిటీ సభ్యులు మేళతాళాలతో మంత్రి స్వామిని సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సంఘ మండల నూతన కమిటీ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 15: గ్రామ సహాయకుల సంఘం ఒంగోలు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు యాదాల ఎలీషా ఆధ్వర్యంలో కమిటీ మండల అధ్యక్షుడుగా డెర బాబురావు, ప్రధానకార్యదర్శిగా బాల కోటేశ్వరరావు, సహాధ్యక్షులుగా ఎ.వెంకట్రావు, కోశాధికారిగా సుజాతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యుల చేత రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.



కమిటీ సభ్యులను సత్కరిస్తున్న నేతలు

బీజేపీతోనే దేశ అభివృద్ధి, సంక్షేమం

● పార్టీ కోస్తా జోనల్ ఇన్‌చార్జి జయప్రకాష్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 15 : భారతీయ జనతా పార్టీతోనే దేశ అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ కోస్తా జోనల్ ఇన్‌చార్జి జయప్రకాష్ పేర్కొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సభలో జయప్రకాష్ మాట్లాడుతూ గత పదేళ్ళ కాలంలో నరేంద్రమోదీ నాయకత్వంలో దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగ్రామిగా నిలిపేందుకు పాటుపడుతున్నారని చెప్పారు. ఒక వైపు పేద, బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమ ఫలాలను అందిస్తూనే మరో వైపు దేశ అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. గత పదేళ్ళ కాలంలో బీజేపీ ప్రభుత్వంలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించి ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకునే విధంగా పాటుపడాలని చెప్పారు. అందుకోసం శ్రేణులు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదుకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పీవీ.కృష్ణారెడ్డి, శెగ్గం శ్రీనివాసులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయప్రకాష్

ఆర్టీసీని పరిరక్షించుకోవాలి : ఎస్‌డబ్ల్యూఎఫ్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 15: ఆర్టీసీని రక్షించుకునేందుకు కార్మికులందరూ సమన్వయంతో పనిచేయాలని అఖిల భారత కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జిల్లా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్ ఏర్పడక ముందు ఆర్టీసీ పరిస్థితులు మరింత దారుణంగా ఉండేవన్నారు. అలాంటి నేపథ్యంలో సమస్యలపై ఉద్యమాలు చేసే సంఘం అవసరమని భావించి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌ను స్థాపించడం జరిగిందన్నారు. 1979 నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీని రక్షించుకోవడంలో అనేక మంది కార్యకర్తలు పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టీసీ ప్రైవేటీకరణ వేగవంతం అవుతుందన్నారు. ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వారికి అప్పజెప్పడం, అనేక విభాగాలను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విభాగాలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఇంకొకవైపు రిక్రూట్‌మెంట్ లేకపోవడం, పాత బస్సులను కొనసాగించడం, కొత్త బస్సుల కొనుగోలుకు అంగీకారం తెలపకవడం లాంటి సమస్యలు ఉద్యోగులను, కార్మికులను ఇబ్బందులు పెడుతున్నాయని తెలిపారు ఈ నేపథ్యంలో ఆర్టీసీని పరిరక్షించుకునేందుకు సమన్వయంతో ముందుకు పోవాల్సిన అవసరం వచ్చిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రతినిధులు మాదాల వెంకట్రావు, ఎం.అయ్యపరెడ్డి, ఎస్‌కే.జిలాని, కట్టా సుబ్రహ్మణ్యం, దివాకర్, గంగాధర్ తిరుపతిరెడ్డి, అల్లాడి సుబ్బారావు, పి.శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు జి.శ్రీనివాసులు, హరిబాబు, వెంకటేశ్వర్లు, మీరావలి, రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఘనంగా నివాళుల ర్పించారు.



మాట్లాడుతున్న లక్ష్మయ్య

రైజ్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 15: ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో కాలుష్య రహిత వినాయక నిమజ్జన ఉత్సవాలు జరిగినట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. గత తొమ్మిది రోజులుగా రైజ్ విద్యార్థులు గణపతి పూజలను కళాశాలలో నిర్వహించి ఆదివారం నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారన్నారు. విద్యార్థినుల కోలాటం, నృత్యాలతో వినాయకుడిని కళాశాల ఆవరణలో ఊరేగింపు నిర్వహించి అనంతరం విగ్రహాన్ని నిమజ్జనం చేసినట్లు ట్రెజరర్ శిద్దా భరత్ తెలిపారు. కార్యక్రమంలో రాగ చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వీరాంజనేయులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 15: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఒంగోలులో ఆదివారం ఉపాధ్యాయులకు ఆటపోటీలను అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి పోటీలను యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు ప్రారంభించారు. ముందుగా క్రికెట్ పోటీలు హెచ్‌ఎంపాడు, పొదిలి జట్ల మధ్య ఉత్కంఠ భరితంగా జరిగింది. క్రికెట్ పోటీలకు 12జట్లు వచ్చాయి. వాలీబాల్ పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొనగా టంగుటూరు జట్టు ఫైనల్‌కు అర్హత సాధించింది. షటిల్ పోటీలకు 20 జట్లు హాజరయ్యాయి. ఈ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ అబ్దుల్‌హై, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి, కోశాధికారి చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు బాలవెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, జేవీవీ రాష్ట్ర నాయకులు కె.సుబ్రహ్మణ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి నివాళి

సంతనూతలపాడు, సెప్టెంబరు 15: మైనంపాడులో ఆదివారం సీపీఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరికి ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ మాబు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బి.సుబ్బారావు, కె.హనుమంతరావు, నాయబ్, సుబ్బారావు, పెద్దబ్బాయ్, భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో విజిలెన్స్ కలకలం

● ఏఈ, ఏఎల్ఎంలపై సస్పెన్షన్ వేటు

మర్రిపూడి, సెప్టెంబరు 15 : మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో జరిగిన అవకతవకలపై ఇటీవల ఆశాఖ విజిలెన్స్ అధికారులు నిర్వహించిన విచారణ కలకలం రేపింది. గుళ్ళసముద్రం గ్రామానికి చెందిన చంద్రమౌళి అనే వినియోగదారుడు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో ఏఈ రామకృష్ణారెడ్డి పలు అవకతవకలకు పాల్పడుతున్నారంటూ ఆశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో ఒంగోలు విజిలెన్స్ డీఈ, దర్శి డీఈలు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. పలువురు గ్రామాల రైతుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో పెద్దఎత్తున ముడుపులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని వినియోగదారులు కొంతమంది లిఖితపూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఉన్నతాధికారులు ఏఈ రామకృష్ణారెడ్డి, ఏఎల్ఎం బాలకృష్ణారెడ్డిలపై సస్పెన్షన్ వేటు వేశారు. పూర్తిస్థాయి విచారణ జరిగితే మరికొంత మంది క్షేత్రస్థాయి సిబ్బందిపై కూడా చర్యలు ఉంటాయని తెలుస్తోంది. పొదిలి ఏడీఏ శ్రీనివాసులుకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు దర్శి డీఈ కరీం తెలిపారు.

వరద బాధితులకు అండగా నిలవాలి



సమావేశంలో పాల్గొన్న మాజీ సైనికులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 15 : విజయవాడలోని వరద బాధితులకు అండగా నిలవాలని మాజీ సైనికులు నిర్ణయించారు. అందుకోసం సభ్యుల నుంచి విరాళాలను సేకరించి సీఎం సహాయనిధికి ఇవ్వాలని తీర్మానించారు. ఒంగోలులోని మిలటరీ క్యాంటీన్ ఆవరణలో ఆదివారం మాజీసైనికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఒంగోలులో ఈసీహెచ్‌ఎస్ ఏర్పాటు చేయాలని, మాజీ సైనికుల సమస్యల పరిష్కారం కోసం సంఘం తీసుకోవాల్సిన పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో సభ్యులు పి.దశరథరామయ్య, ఆలపాటి వెంకటేశ్వర్లు, పాశం వెంకటరెడ్డి, టి.సుబ్బారావు, జి.కోటేశ్వరరావు, మండవ వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

19లోపు పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 15: ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులో చేరేందుకు ఈనెల 19వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీపీజీసెట్-24 రెండు, తుదిశ దశ వెబ్ ఆధారిత నమోదు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్, బీసీఏ డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వెబ్ ఆప్షన్లు ఈనెల 23 నుంచి 25లోపు చేసుకోవాలని, వెబ్‌ఆప్షన్ల మార్పు ఈనెల 26న, సీట్ల కేటాయింపు 28న జరుగుతుందని, 30వ తేదీలోపు కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

టీడీపీ నాయకుల విరాళాల సేకరణ



విరాళాలను సేకరిస్తున్న నాయకులు

టంగుటూరు, సెప్టెంబరు 15 : మండలంలోని ఎం నిడమలూరులో తెలుగుదేశం పార్టీ నాయకులు వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రజల నుంచి సేకరించిన విరాళాలు రూ.2లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. విరాళాల సేకరణలో ఎం నిడమలూరు టీడీపీ సీనియర్ నాయకుడు బోడపాటి అంజిబాబు, గ్రామ టీడీపీ ఉపాధ్యక్షుడు కాకుమాని సుబ్బారావు, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పిడుగురాళ్ల సురేష్‌బాబు నాయకత్వంలో జరిగినఈ సేకరణలో జనసేన నాయకులు మేశం శ్రీను, టీడీపీ సీనియర్ నాయకుడు కుక్కపల్లి రమణయ్య, మన్నం ఆదినారాయణ, తెలుగు యువత నాయకుడు బాలవిష్ణు, జయప్రకాష్ ఉన్నారు.

22న జాబ్‌మేళా

టంగుటూరు, సెప్టెంబరు 15 : కొండపి నియోజకవర్గం, పరిసర ప్రాంతాలలోని నిరుద్యోగ యువతకు కొండపి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శుభవార్త ప్రకటించింది. ఈనెల 22న మాజీ మంత్రి స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు వర్థంతి సందర్భంగా జాబ్‌మేళా, మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య ఆదివారం ప్రకటించారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలో జాబ్‌మేళా, మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరం నిర్వహిస్తారన్నారు. ఈజాబ్‌మేళాలో ఐటీ, నాన్ ఐటీకి సంబంధించి 60 కంపెనీలు పాల్గొంటాయన్నారు. జాబ్‌మేళా ఈఅవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని స్వామి, సత్య కోరారు.

ఆదర్శ నాయకుడు ఏచూరి

కొండపి, సెప్టెంబరు15: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నేటి తరానికి ఆదర్శ నాయకుడని వామపక్ష పార్టీల నాయకులు కొనియాడారు. ఏచూరి సంస్మరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం కొండపిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి కేజీ మస్తాన్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకుడు వై. చంద్రశేఖర్, తాటాకులపాలెం సర్పంచ్ షేక్ వన్నూరు, వామపక్ష నాయకులు కోవూరు శంకర్, ముప్పరాజు బ్రహ్మయ్య, గడ్డం వందనం, రాజబాబు, దగ్గుమాటి జయరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం చేయూత

మంత్రి స్వామికి కనుమళ్ల టీడీపీ నాయకులు రూ. 2లక్షల విరాళం అందజేత ● ఎమ్మెల్యే బీఎన్‌కు నగదు అందజేసిన దాతలు



మంత్రి స్వామికి నగదును అందజేస్తున్న కనుమళ్ల నాయకులు



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు విరాళం అందజేస్తున్న టీ.అగ్రహారం నాయకులు

సింగరాయకొండ, సెప్టెంబరు 15 : విజయవాడ వరద బాధితులను కోసం సింగరాయకొండ మండలంలోని కనుమళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ముందుకు వచ్చారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామికి రూ.2లక్షలు విరాళాన్ని అందజేశారు. ఆదివారం రాత్రి టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి స్వగృహంలో ఆయన్ను కలిసి టీడీపీ నేతలు మలినేని సింగయ్య రూ. 1 లక్ష, బైరపనేని మోహన్‌రావు రూ. 50 వేలు, తన్నీరు యానాదిరావు రూ. 50 వేలు నగదును అందజేశారు. కష్టకాలంలో బాధితులను ఆదుకోవడానికి తమవంతు ఆర్థిక సహాయం చేసిన నాయకులను మంత్రి స్వామి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కూనపరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలం నుంచి..

నాగులుప్పల పాడు: వరద బాధితులను ఆదుకునేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు విరాళాలను సమకూర్చి అండగా నిలబడుతున్నారు. ఒమ్మెవరం టీడీపీ నాయకులు కొమ్మాలపాటి సురేష్, సర్పంచ్ బాలకోటి ఆధ్వర్యంలో గ్రామంలో సేకరించిన రూ.52,116 నగదును ఆదివారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్‌కు అందజేశారు. అలాగే తక్కెళ్లపాడుకు చెందిన మండల పార్టీ కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్ రూ.50వేలు, బి.నిడమానూరుకు చెందిన ఢాకా శ్రీనివాసరెడ్డి రూ.20వేలు, ఇక అంబేద్కర్‌కాలనీ, జగజ్జీవన్‌రామ్‌నగర్ నాయకులు రూ.20వేలు, హనుమాపురం నాయకులు నిమ్మల వెంకట్రావు రూ.10వేలు అందించగా ఆ మొత్తం రూ.లక్ష నగదును క్లస్టర్ ఇన్‌చార్జి కాకర్ల లక్ష్మీవరప్రసాద్ ఎమ్మెల్యే బీఎన్‌కు అందజేశారు. వరద బాధితుల కోసం టీ.అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పదం మురళి రూ. 1,00,000, జాగర్లమూడి వేణు రూ.25వేలు, పోలవరపు శ్రీకాంత్ రూ.25వేలు ఆదివారం ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో తేళ్ళ మనోజ్ కుమార్, గుమ్మడి సాయిబాబా, ఆళ్ళ నాగార్జున, మేడికొండ మురళి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బీఎన్‌కు నగదు అందిస్తున్న ఒమ్మెవరం నాయకులు

రూ.20వేల విరాళం

మద్దిపాడు: విజయవాడ వరద బాధితుల కోసం వెల్లంపల్లికి చెందిన టీడీపీ గ్రామ అధ్యక్షుడు ముచ్చు సుబ్బారావు ఆదివారం మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్‌కు రూ.20వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాయకుడు రవిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేసీఐ సేవా కార్యక్రమాలు అభినందనీయం

మంత్రి స్వామి

ముగిసిన వారోత్సవాలు



మాట్లాడుతున్న మంత్రి స్వామి

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 15: జేసీఐ నిర్వహిస్తున్న వివిధ సామాజిక, సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ముగింపు సభకు ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం, విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అనంతరం కమలపత్ర పురస్కారాన్ని దాది ఆంజనేయులు, అవుట్ స్టాండింగ్ యంగ్‌పర్సన్ అవార్డును అనంతపురం ట్రైనింగ్ కలెక్టర్ బి.వినూత్నకు, న్యాయమూర్తి చివుకుల భరత్‌కమల్‌కు, టో టీప్ అవార్డు ఎయిమ్స్ వైద్య సంస్థల చైర్మన్ బొమ్మల రామలింగేశ్వరరావు, సూపర్‌కిడ్ అవార్డును పల్లెపు ధనుశ్రీకి మంత్రి స్వామి చేతులమీదుగా ప్రదానం చేశారు. జేసీఐ అధ్యక్ష, కార్యదర్శులు కె.వరుణ్‌కుమార్, బి.శ్రీకాంత్, నరేంద్రల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్ బాబు, ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, వారోత్సవాల చైర్మన్ శబరి పి.నాయర్, సాత్విక్‌రాజ్, కె.శివకోటిరెడ్డి, శేఖర్‌బాబు, డాక్టర్ టీ.రవి, గోరంట్ల రవికుమార్, డి.రమణారెడ్డి, బొమ్మల శ్రీనివాస్, వీవీ.రమణ, కసిబిసి నాగేశ్వరరావు, జేసీఐ సభ్యులు పాల్గొన్నారు.

మంగమూరులో విడిది స్థలంపై వివాదం

● బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



వివాదాస్పద స్థలం వద్ద స్థానికులు

సంతనూతలపాడు, సెప్టెంబరు 15: సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామంలోని క్రిస్టియన్‌పాలెంలో గల విడిది స్థలం వివాదాస్పదంగా మారింది. దీంతో ఆదివారం క్రిస్టియన్‌పాలెంవాసులు ఆ స్థలంలో రేకులషెడ్డు నిర్మిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్థానికులు పెద్దఎత్తున ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్రమత్తమైన రూరల్ సీఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు, మద్దిపాడు ఎస్సైలు దేవకుమార్, శివరామయ్య, పోలీసు సిబ్బందితో గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గత 50 ఏళ్లగా తమ పరిధిలో ఉన్న క్రిస్టియన్‌పాలెంలోని విడిది స్థలంలో వివాహాల నిమిత్తం దిగేవారమని, అయితే స్థానిక మరో వర్గం ఆ స్థలంలో ఉన్న చెట్లను తొలగించి తమదంటూ దౌర్జన్యం చేసి కులంపేరుతో దూషించారని క్రిస్టియన్ పాలెం వాసులైన టి.యోహాన్, సాంబయ్య, ఎ.మత్తయ్య పరిశుద్ధం ఐదు రోజుల క్రితం జిల్లా పోలీసుఅధికారులకు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం విడిది స్థలంలో రేకుల షెడ్డు నిర్మిస్తుండగా పోలీసులు ఆ నిర్మాణం చేపట్టవద్దని అడ్డుకున్నారు. దీంతో క్రిస్టియన్‌పాలెం వాసులు తమకు న్యాయం చేయకుండా అడ్డుకోవడం ఏమిటని పోలీసులపై నిరసన వ్యక్తం చేశారు. తమను కులంపేరుతో దూషించిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఈక్రమంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.



పహరా కాస్తున్న పోలీసులు

ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి

కొండపి, సెప్టెంబరు 15: కొండపిలోని మద్దులూరు రోడ్డులో ఏర్పాటు చేసిన శారద ఆసుపత్రిని మంత్రి స్వామి ఆదివారం ప్రారంభించారు. ఒంగోలు ఎపిక్ హాస్పటల్ డాక్టర్ కల్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ వడ్లమూడి అపర్ణలు ఏర్పాటు చేసిన వైద్యశాలను మంత్రి స్వామి ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గొర్రెపాటి రామయ్యచౌదరి, పోకూరి రవీంద్రబాబు, పోటు పద్మావతి, కొండ్రగుంట శ్రీనివాసరావు, పోటు శ్రీనివాసమురళి, కంచర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

వినాయకుని లడ్డూ వేలం



లడ్డూను దక్కించుకున్న రామ్మోహన్

సంతనూతలపాడు, సెప్టెంబరు 15: సంతనూతలపాడులోని కమ్మపాలెంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద తొమ్మిది రోజుల పూజల అనంతరం ఏర్పాటు చేసిన వేలంపాటలో టీడీపీ నాయకుడు ఆళ్ల రామ్మోహన్ స్వామివారి లడ్డూను రూ.35వేలకు దక్కించుకున్నారు. కలశంను పాశం బుజ్జి రూ.20వేలకు పాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.శ్రీరామ్మూర్తి, ఎన్.మాధవి, చౌదరి, ఎస్.హనుమంతరావు, ఎన్.భాస్కరరావు, ఎమ్.సుధీర్, సుబ్రహ్మణ్యం, సాయి, శ్రీనివాసరావు, సుందర్, మహేశ్వర్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌ను మార్చాలి

● పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్యనేతల డిమాండ్



మాట్లాడుతున్న నేతలు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 15 : జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌ను వెంటనే మార్చాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులు కోరారు. ఆయన కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, పార్టీ ఆశయాలకు భిన్నంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. స్థానిక లాయర్‌పేటలోని డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిద్దలూరు, మార్కాపురం, సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు బెల్లంకొండ సాయిబాబు, ఇమ్మడి కాశీనాథ్, కందుకూరి వెంకటేశ్వరరావు(బాబు), బటుకు రమేష్, జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ చీకటి వంశీదీప్, జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ జడా బాలనాగేంద్రయాదవ్‌లు మాట్లాడారు. అన్ని నియోజకవర్గాల్లోని పార్టీ కేడర్ జిల్లా అధ్యక్షుడి మార్పును కోరుకుంటున్నదని, త్వరలోనే అధినేత పవన్‌కల్యాణ్‌ను కలుస్తామని తెలిపారు.

శిద్దా సుధీర్‌కు సన్మానం

ఒంగోలు (కల్చరల్), సెప్టెంబరు 15: యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్ కుమార్‌ను వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (వామ్) ఘనంగా సత్కరించింది. యుఏఈలోని అబుదాబి నేషనల్ థియేటర్‌లో జరిగిన వామ్ గ్లోబల్ కన్వెన్షన్‌లో వామ్ గ్లోబల్ ప్రెసిడెంట్ తంగుటూరి రామకృష్ణ, ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు సుధీర్‌కుమార్‌ను దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు, వామ్ గ్లోబల్ చైర్మన్ టీజీ.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



తర్లుపాడులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

గంగమ్మ చెంతకు గణనాథులు

• నిమజ్జనం సందర్భంగా గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు • పలు మండపాల వద్ద అన్నదానాలు

తర్లుపాడు, సెప్టెంబరు 15: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను 9వ రోజు నిమజ్జనాలకు తరలించారు. తర్లుపాడులో యాదవ్ యూత్ ఆధ్వర్యంలో, ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని, సూరేపల్లి, నాగెళ్లముడుపు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి డప్పు వాయిద్యాలతో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటం చూపరులను ఆకట్టుకుంది. తర్లుపాడు పురవీధుల్లో గ్రామత్సోవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై పూజలు చేశారు. యువకులు కేరింతలు కొడుతూ జై బోలో గణేష్ మాహరాజ్ అంటూ నృత్య ప్రదర్శనలు చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి తనయుడు కందుల విఘ్నేష్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ విగ్రహాలను బొడిచర్ల వద్దనున్న గుండ్లకమ్మవాగులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రాజ్‌కుమార్ పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలో వినాయక నిమజ్జన ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మండపాల వద్ద అన్నప్రసాద వినియోగం కల్పించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఇంటివద్ద అన్నదాన కార్యక్రమం చేశారు. దీనిలో భాగంగా ఆదివారం మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పీవీ.కృష్ణారెడ్డి అన్న ప్రసాద వితరణ చేశారు. మార్కెట్ సెంటర్‌లో గొలమారి ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక మండపం వద్ద అన్నదానాన్ని టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, సీఐ సుబ్బారావులు ప్రారంభించారు. పేరం బజార్‌లోని గణేష్ మండపం వద్ద నుంచి వినాయకుని భక్తిశ్రద్ధలతో తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మహిళల కోలాటాలు ఆకట్టుకున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలు మేళ తాళాలు డీజేల సందడి మధ్య నిమజ్జనానికి తరలాయి.



మార్కాపురంలో భక్తుల కోలాటం



దోర్నాలలో వినాయకునికి భక్తుల పూజలు

భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకలు

పెద్దదోర్నాల : దోర్నాలలో గణేశుని నిమజ్జన వేడుకలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న నవరాత్రుల్లో భాగంగా దేవాలయాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రధానంగా స్థానిక శ్రీవిజయ గణపతి దేవాలయంలో, రజకవీధిలో ఏర్పాటు చేసిన గణేశునికి ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజున ఆలయ అర్చకులు మూర్తి ఆధ్వర్యంలో పలువురు దంపతులు హోమాలు తదితర క్రతువులు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్సవ రథంపై స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గణేశున్ని నిమజ్జనం కోసం శ్రీశైలం తరలించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు బీవీఎల్.ప్రసాద్, మొగిలి సుబ్బారావు, వెచ్చా హర గోపాల్, పీ.రామారావు, సంకా ప్రసన్న, పోలిరెడ్డి తదితులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కంభం (ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 14 : కంభం పట్టణంలోని స్థానిక పంట పొలాల్లో పేకాట ఆడుతున్న శిబిరంపై పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.14,130 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 15 : మండలంలోని గుమ్మళ్లపల్లి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న ఏడుగురిని గిద్దలూరు సీఐ కె.సురేష్ అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3750 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దారవీడు, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో తోకపల్లి సమీపంలో అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మార్కాపురానికి చెందిన ముంగమూరి బ్రహ్మయ్య(50) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం యధావిధిగా మార్కాపురం నుంచి హనుమాన్‌జంక్షన్(కుంట)కు ఆటో నడుపుతూ వెళుతున్నాడు. వాహనం అదుపుతప్పి పొలంలో బోల్తా పడింది. దీంతో బ్రహ్మయ్య తలకు తీవ్రగాయం కావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఎస్సై అనిల్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కంభం, సెప్టెంబరు 15 : రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కంభం- జేబీక్రిష్ణాపురం మధ్య రైల్వేలైన్‌పై చోటుచేసుకొంది. మార్కాపురం రైల్వే ఏఎస్సై కథనం ప్రకారం 40 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున కంభం-జగ్గంబొట్ల కృష్ణాపురం మధ్య రైలు కిందపడడంతో అతని శరీరం గుర్తు పట్టని విధంగా ఛిద్రమైంది. మృతుడు ఎరుపు రంగు టీషర్టు ధరించి ఉన్నాడని, ఎటువంటి గుర్తింపు కార్డులు లేవని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు, సెప్టెంబరు 15 : గిద్దలూరులోని ప్రజాసంకల్ప వేదిక కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు మదిరె రంగసాయిరెడ్డి అధ్యక్షతన నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కమిటీ అధ్యక్షులుగా ఒ.వెంకటయ్యయాదవ్, మహిళ విభాగం అధ్యక్షురాలిగా ఏ.నాగమణి, ఉపాధ్యక్షులుగా రాజయ్య, కోటిలింగాచారి, ప్రధాన కార్యదర్శిగా కాదర్‌బాబు, ఉపాధ్యక్షులుగా పఠాన్ మాబున్నీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

గిద్దలూరు టౌన్, సెప్టెం బరు 15 : అన్నా క్యాంటీన్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రూ.10,116 ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి అందజేశారు. 8వ వార్డు కౌన్సిలర్ గడ్డం భాస్కర్‌రెడ్డి కుమార్తె గడ్డం.అపర్ణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తూ తనవంతుగా 10,116 రూపాయలుగా సమకూర్చగా ఆ మొత్తాన్ని తండ్రి గడ్డం భాస్కర్‌రెడ్డి, సోదరుడు బాలంకిరెడ్డి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి అందచేశారు.

హిందీ దినోత్సవ వేడుకలు

గిద్దలూరు, సెప్టెంబరు 15 : పట్టణంలోని సూర్య విద్యానికేతన్‌లో దేశ జాతీయ భాష హిందీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. హిందీ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈసందర్భంగా వ్యాసరచన పోటీలు, టాలెంట్ టెస్టులు, పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బ్రహ్మానందరెడ్డి, డైరెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

పొలం వివాదంలో ఘర్షణ

• పలువురికి గాయాలు

మార్కాపురం, సెప్టెంబరు 15: పొలం వివాదంలో ఇరువర్గాలు ఘర్షణపడి కొట్టుకోవడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దారవీడు మండలంలోని రాజంపల్లిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పెద్దారవీడు ఎస్సై అనిల్‌కుమార్ కథనం మేరకు చట్లమిట్ల గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి సత్యనారాయణరెడ్డికి రాజంపల్లి గ్రామానికి చెందిన కంచర్ల చెన్నకేశవులు కుటుంబాల మధ్య ఓ పొలం వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం పొలం వద్దకు వెళ్లిన కంచర్ల చెన్నకేశవులు కుటుంబ సభ్యులను తిరుమలరెడ్డి సత్యనారాయణరెడ్డి వర్గీయులు కర్రలతో అత్యంత పాశవికంగా దాడి చేసి కొట్టారు. దీంతో చెన్నకేశవులు కుమారులు చరణ్, రామాంజనేయులు, అమ్మ రాములమ్మ, అన్న భార్య అంజమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. కొట్లాట అనంతరం ఇరువర్గాలు మార్కాపురం ప్రాంతీయ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరాయి. దాడికి ప్రధాన కారణమైన సత్యనారాయణరెడ్డిని మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌ను మార్చాలి

• పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్లులు, ముఖ్యనేతల డిమాండ్



మాట్లాడుతున్న జనసేన నాయకులు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 15 : జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌ను వెంటనే మార్చాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు కోరారు. ఆయన కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, పార్టీ ఆశయాలకు భిన్నంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. స్థానిక లాయర్ పేటలోని డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిద్దలూరు, మార్కాపురం, సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు బెల్లంకొండ సాయిబాబు, ఇమ్మడి కాశీనాథ్, కందుకూరి వెంకటేశ్వరరావు(బాబు), బటుకు రమేష్, జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ చీకటి వంశీదీప్, జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ జడా బాలనాగేంద్రయాదవ్‌లు మాట్లాడారు. అన్ని నియోజకవర్గాల్లోని పార్టీ కేడర్ జిల్లా అధ్యక్షుడి మార్పును కోరుకుంటున్నదన్నారు. ఈ విషయంపై త్వరలోనే అధినేత పవన్ కల్యాణ్‌ను కలుస్తామని వారు తెలిపారు.

రైతులకు విద్యుత్ అధికారుల షాక్

• మామూళ్ల కోసం అన్నదాతలను పీడిస్తున్న వైనం

పొదిలి, సెప్టెంబరు 15 : ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాతలకు విద్యుత్‌శాఖ అధికారులు చుక్కల చూపిస్తున్నారు. పట్టెడు అన్నం పెట్టే రైతులపై జులుం ప్రదర్శిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రైతులను నెలలు తరబడి కాళ్లు అరిగేలా తిప్పుకుంటున్నారు. అడినంత లంచం ఇవ్వనిదే ట్రాన్స్‌ఫార్మర్ కాదుకదా వైరు ముక్కకూడ ఇవ్వబోమని ఆ శాఖ అధికారులు తెగేసి చెబుతున్నారు. అసలే కరువు కాటకాలతో వర్షాల లేమితో తల్లడిల్లుతున్న రైతులకు విద్యుత్ కనెక్షన్ పొందడం తలకు మించిన భారంగా మారింది.

ఒక విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు కోసం 5హెచ్‌పీ మోటారుకు రూ.6200ల రుసుం చెల్లించాలి. కాని అధికారులు ఇష్టారాజ్యంగా రూ.20వేలకు ముక్కపిండి వసూలు చేస్తున్నారు. అదేమని నిలదీసిన రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. వారి దరఖాస్తులను ఏకంగా ఆటకెక్కిస్తున్నారు. వారిని ముప్ప తిప్పలు పెడుతున్నా రు. అదనపు డబ్బులు చెల్లిస్తే వారంలో అంచనాలు వేసి అప్పటికప్పుడు విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు. నిబంధనల ప్రకారం మూడు 5హెచ్‌పీ మోటార్లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి. అయితే ఒక్కొకరి నుంచి రూ.20 వేల చొప్పున ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.60 వేలు వసూలు చేసి అప్పటికప్పుడు ట్రాన్స్‌ఫారాలను మంజూరు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం లేదు. వ్యవసాయ సీజన్ మారుతుందనే భయంతో అధికారులు అడిగిన కాడికి కొంతమంది రైతులు డబ్బులు ఇచ్చి తమ అవసరం గడుపుకుంటున్నారు. లంచం ఇవ్వలేని నిస్సహాయ రైతులు ఆ శాఖ కార్యాల యం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాతైనా పరిస్థితులు మారుతామోనని అన్నదాతలు ఎదురు చూసినప్పటికీ వారి నిరీక్షణ ఫలించడం లేదు.

రూ.6200లు చెల్లిస్తే చాలు

వ్యవసాయ విద్యుత్ మీటర్ కనెక్షన్‌కు 5హెచ్‌పీ మోటార్‌కు రూ.6200లు మాత్రమే చెల్లించాలి. అదనంగా ఒక్కరూపాయ కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. అలా ఎవరైనా విద్యుత్ అధికారులు డిమాండ్ చేస్తే నేరుగా నాకు కాల్‌చేసి చెప్పవచ్చు. అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. రైతులు ఎలాంటి సమస్య ఉన్నా ఫిర్యాదు చేయవచ్చు.

కరీం, డీఈ దర్శి

స్విమ్మింగ్ పోటీల విజేతకు సత్కారం

పొదిలి, సెప్టెంబరు 15 : నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో మూడు బంగారు పతకాలను సాధించిన విజేతను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాధవితో పాటు ఆర్యవైశ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. అనంతరం గునుపూడి మాట్లాడుతూ మండలంలోని గోగినేనిపాలెం గ్రామానికి చెందిన గోపనబోయిన శ్రీనివాసులు నేపాల్‌లో 9 దేశాలకు చెందిన 400ల మంది స్విమ్మర్లతో పోటీపడి మూడు బంగారు పతకాలు సాధించడం మన రాష్ట్రానికి, జిల్లాకు, మన మండలానికి ఎంతో శుభపరిణామమన్నారు. ఇదే విధంగా రానున్నరోజుల్లో మరెన్నో పతకాలు సాధించి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరుతెచ్చి పెట్టాలని ఆకాక్షించారు. అనంతరం నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా అధ్యక్షురాలు సోమిశెట్టి శ్రీదేవి, రాజ, జిలాని, కమర్, సలీం, నగేష్ తదితరులు ఉన్నారు.



నగదు బహుమతి అందజేస్తున్న భాస్కర్, ఆర్యవైశ్యులు

దేశం గర్వించదగ్గ ఇంజనీర్ విశ్వేశ్వరయ్య



ఇందిర కళాశాలలో నివాళ్లు అర్పిస్తున్న విద్యార్థులు



జార్జ్ కళాశాలలో నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ రాజాబాబు

మార్కాపురం, సెప్టెంబరు 15: దేశం గర్వించదగిన ఇంజనీర్ భారతరత్న, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇంజనీర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆయా కళాశాల్లో ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విశ్వేశ్వరయ్య ఆశయ సాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని వక్తలు కోరారు. ఇంజనీర్ల మేధో సంపత్తికి దర్పణంగా రూపుదిద్దుకున్న నిర్మాణాలు దేశప్రగతికి ప్రతీకల న్నారు. అటువంటి ఎన్నో నిర్మాణాలను జాతికి అందించిన మహనీయుడు విశ్వేశ్వరయ్య అని తెలిపారు. స్థానిక కిట్స్, డాక్టర్ శామ్యూల్ జార్జి, ఏ1 గ్లోబల్, ఇందిర ఇంజనీరింగ్ కాలేజీల్లో జరిగిన కార్యక్రమాల్లో యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఏర్పాటు

బేస్తవారపేట, సెప్టెంబరు15: గిద్దలూరు నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం నూతన కమిటిని ఆదివారం బేస్తవారపేటలోని శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత రైల్వేస్టేషన్ మాస్టర్ వారణాసి సుధాకర్ శర్మ పాల్గొని నియోజకవర్గ సమన్వయ సేవాసమితికి చెందిన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. గిద్దలూరుకు చెందిన వారణాసి గిరిధరశర్మ, బేస్తవారపేట రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు నంబూరి నరసింహారావు హాజరై కమిటీని ఏకగ్రీవంగా నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా అగ్రహారం రామ కృష్ణ శర్మ, సమితి సమన్వయకర్త యద్దనపూడి ఉమహేశ్వరరావు, గౌరవ సలహాదారుడు మేడవరం రంగమనోహర్ వర్మ, అనపర్తి ఆంజనేయులు శర్మ, రాయప్రోలు సుబ్బారావు శర్మలును కమిటీలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యులు మాట్లాడుతూ బ్రాహ్మణుల సాధక బాధలను గురించి,సమైఖ్యత గురించి, బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి ప్రణాళిక రూపకల్పన గురించి చర్చించారు.



మాట్లాడుతున్న విశ్రాంత హెచ్‌ఎం నరసింహారావు

గ్రామీణ ప్రాంతాలకు పీఎంపీల సేవలు విస్తరించాలి

టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 15: పీఎంపీల సేవలు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తరించాలని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ప్రైమరీ మెడికల్ ప్రోవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ మౌలాలి ఆధ్వర్యంలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని పురస్కరించుకొని పీఎంపీలకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ, పేద ప్రజలకు పల్లెల్లో ఇప్పటికే పీఎంపీల సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. వాటిని సేవాధృక్పథంతో కొనసాగించాలన్నారు. గుంటూరుకు చెందిన ఆర్థోకేర్ డాక్టర్ పీఆర్ఎస్ శ్రీరామ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెన్నుపూసకు వచ్చే వ్యాధుల గురించి ప్రొజెక్టర్ ద్వారా వివరిం చారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి ప్రథమ చికిత్స నిర్వహించే విధానం తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మక్బూల్ బాషా, పీఎంపీల నాయకులు రసూల్, అబ్దుల్ గనీ, రషీద్‌ఖాన్, షేక్ యాసిన్, షేక్ రహీం, షేక్ నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్కలగడ్డ మల్లికార్జున

అవీ..ఇవీ..

అన్న క్యాంటీన్‌కు విరాళం



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి నగదు అందజేస్తున్న రామచంద్రారెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 15 : రాచర్ల మండలం గంగంపల్లి గ్రామానికి చెందిన మీనిగ రామచంద్రారెడ్డి అన్నా క్యాంటీన్‌కు రూ.10వేల విరాళాన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిజ్జం వెంకటరామిరెడ్డి, టీడీపీ నాయకులు రవీంద్రరెడ్డి, వీరశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

కంభం, సెప్టెంబరు 15 : కంభం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ రెండవ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావిపూడి లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక వాసవి పాఠశాలలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షులుగా డాక్టర్ బైసాని వెంకటరామకృష్ణ, కార్యదర్శిగా పేర్లి వెంకట కొండయ్య, కోశాధికారిగా శిరిగిరి వెంకట్రావు, ఉపాధ్యక్షులుగా తన్నీరు బాలరంగారావు, సర్వీస్ ప్రోగ్రామ్స్ కమిటీ చైర్మన్‌గా సయ్యద్ జాకీర్ హుస్సేన్, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ మొగల్ మహబూబ్‌బేగ్, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్‌గా పార్వ శంకర్, మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా జలపాటి తులసీప్రసాద్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా మొగల్ చిన్నహుస్సేన్‌బేగ్, మీనిగ ప్రసాద్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు (ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 15 : మాజీ సైనికుల పిల్లలు 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.రజనీకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రీయ సైనిక్‌బోర్డు ప్రధానమంత్రి ఉపకార వేతనాలను అందిస్తుందని పేర్కొన్నారు. బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, బీఈడీ, బీపీఏ బీసీఏ, బిఫార్మసీ, బీఏ, ఎల్ఎల్‌బీ వంటి వృత్తివిద్యా కోర్సులలో చేరిన మాజీ సైనికుల పిల్లలు ప్రధానమంత్రి ఉపకారవేతనం పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌లో 60శాతం పైబడి మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. బాలురకు నెలకు రూ.2500, బాలికలకు నెలకు రూ.3వేల రూపాయల చొప్పున ఉపకార వేతనం లభిస్తుందన్నారు. అర్హత ఉన్న వారు కేంద్రీయ సైనిక్‌బోర్డు న్యూఢిల్లీ వెబ్‌సైట్‌లో నవంబరు 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ ప్రకటనలో సూచించారు.

కమలా పాఠశాలలో నాలెడ్జ్ సింపోజియం



ప్రత్యేక శిక్షణ పొందుతున్న విద్యార్థిని

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 15: స్థానిక కమలా హైస్కూల్‌లో ఆదివారం నాలెడ్జ్ సింపోజియం నిర్వహించారు. సీబీఎస్ఈ పాఠశాలలో విద్యార్థులు నేర్చుకున్న వివిధ అంశాలను వారి తల్లిదండ్రుల సమక్షంలో డిజిటల్ ప్యానెల్‌పై విద్యార్థులు ప్రెజెంట్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాం డెంట్ పి.పవన్‌కుమార్ మాట్లాడుతూ.. సీబీఎస్ఈ విశిష్టత, ప్రయోజనాలు, పాఠ్యప్రణాళిక ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజయం కోసం ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొని మెళకువలు నేర్చుకోవాలన్నారు. అకడమిక్ డైరెక్టర్ సింధూజ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

గిద్దలూరు, సెప్టెంబరు 15 : గిద్దలూరులోని విశ్వభారతి పాఠశాల ఆవరణలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు కిమ్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగావైద్యశిబిరం నిర్వహించారు. వివిధ నిపుణులైన వైద్యులు శిబిరానికి హాజరై రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్, ఈసీజీ, పరీక్షలను ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులను కూడా పంపిణీ చేశారు. 400 మందికి పైగా రోగులు శిబిరానికి హాజరైనట్లు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

గిద్దలూరు, సెప్టెంబరు 15 : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ మంచాల బ్రహ్మేశ్వరప్రసాద్ ప్రారంభించారు. ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు బూత్‌స్థాయి నుంచి ప్రతి ఇంటికి వెళ్లి మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి వారి నుంచి సభ్యత్వాలు స్వీకరించాలని కోరారు. మండలంలోని కొమ్మునూరుకు చెందిన తొండమల్ల రమేష్, కొత్తపల్లికి చెందిన కొర్రపాటి సుధాకర్‌లు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీమోర్చ ప్రధాన కార్యదర్శి మట్టిమళ్ల పుల్లయ్య, పార్టీ ఇన్‌చార్జ్ నరాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదిలిలో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

పొదిలి, సెప్టెంబరు 15 : ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని టీడీపీ పట్టణ నాయకులు ప్రారంభించారు. మొత్తం 107 మంది రోగులు ఈ ఉచిత వైద్యశిబిరానికి వచ్చారు. వారికి బీపీ, షుగర్, గుండె సబంధిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మండల, పట్టణాధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, ముల్లా ఖుద్దూస్, కాటూరి చినబాబు, కల్లం సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ జిలాని, బొద్దు సుబ్బయ్య, రబ్బాని, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 15: స్థానిక గుండ్లకమ్మ నదీతీరాన వెలసిన లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు ఏవీకే నరసింహాచార్యులు మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరుని ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం జాతర వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. నాగులపుట్టలో పాలుపోసి నాగేంద్రులకు పూజలు చేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పామూరు, సెప్టెంబరు 15: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని అంకభూపాలపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, మంజుల, అన్నపూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, సెప్టెంబరు 15: మండలంలోని జమ్మలమడక గ్రామానికి సమీపంలో ఉన్న పువ్వాడమ్మ అమ్మవారికి ఆదివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాదరెడ్డి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ జమ్మలమడక గ్రామస్థులపై పువ్వాడమ్మ అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని, పాడి పంటలతో రైతులు సంతోషంగా జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ రత్నరాజు, సూదిదేవర అంజయ్య, బంకా నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ రామిరెడ్డికి నివాళి

తాళ్లూరు, సెప్టెంబరు 15: తాళ్లూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కోట రామిరెడ్డికి ఆదివారం ఘనంగా అంతిమ యాత్ర నిర్వహించారు. రామిరెడ్డి మృతదేహాన్ని ప్రత్యేక వాహనంతో గ్రామ వీధుల్లో గుండా శ్మశానవాటికకు తీసుకెళ్లారు. అంతిమయాత్రలో మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త ఐ.వెంకట్రామిరెడ్డి, మారం ఇంద్రసేనారెడ్డి, బీజేపీ నాయకులు చందోలు రామారావు, వెంకటేశ్వరరెడ్డి, అధికసంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు. రామిరెడ్డి మృతదేహానికి జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, మానం రమేష్‌బాబు, పి.రమేష్ నివాళులర్పించారు.

శిశుమందిర్ అభివృద్ధికి విరాళం

పామూరు, సెప్టెంబరు 15: శ్రీసరస్వతి శిశుమందిర్ స్కూల్ అభివృద్ధికి టీడీపీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు పందిటి హరీష్ రూ.50 వేల నగదును ఆదివారం అందజేశారు. పూర్వపు విద్యార్థి హరీష్ విరాళం అందజేయడం పట్ల పాఠశాల కార్యదర్శి వరదా ఓబులేసు, సభ్యుడు శేగు కృష్ణయ్య అభినందించారు. కార్యక్రమంలో సోమిశెట్టి లక్ష్మీనారాయణ, దొరబాబు, శ్రీనివాసులు, చలపతి పాల్గొన్నారు.

కొండయ్యకు సాహితీ పురస్కారం

కురిచేడు, సెప్టెంబరు 15: మండలంలోని ఆవులమంద గ్రామానికి చెందిన దేవినేని కొండయ్య తిరుపతమ్మ నాటకాన్ని 206 సార్లు ప్రదర్శించారు. గ్రామస్థులు ఒక బృందంగా ఏర్పడి తిరుపతమ్మ నాటకాన్ని రాష్ట్రంలో ప్రదర్శించారు. ఈ బృందంలో కొండయ్య ఒక ముఖ్యమైన వ్యక్తి. విజయవాడకు చెందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక వారు కొండయ్యకు పురస్కారం ప్రకటించారు. తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల మహోత్సవంలో కొండయ్యను ఆదివారం ఘనంగా సన్మానించారు.

చింతలపాలెం వాసికి 'తెలుగు వెలుగు' పురస్కారం

తాళ్లూరు, సెప్టెంబరు 15: మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన బూదాల టైగర్ రామనామ సంకీర్తన డప్పు కళారంగంలో విశిష్ట సేవలందించారు. ఈక్రమంలో తెలుగు వెలుగు జాతీయ నంది పురస్కారం అందుకున్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బూదాల టైగర్‌ను అభినందిస్తూ ఘనంగా సత్కరించారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 15: సీఎస్‌పురంలో వినాయక చవితి సందర్భంగా వంగవీటి మోహన రంగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎస్ఐ బి.ప్రేమ్ కుమార్ ఆదివారం బహుమతులు అందజేశారు. స్థానిక వీఎంఆర్ యూత్ ఫోర్స్ జట్టు విజేతగా నిలిచింది. రెడ్‌బుల్ జట్టు ద్వితీయ స్థానం, జాతిరత్నాలు జట్టు మూడవ స్థానంలో నిలిచాయి.

ప్రజారవాణాలో కనిగిరి డిపో ముందుండాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- 11 నూతన బస్సులు ప్రారంభం



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 15: ప్రజారవాణాలో కనిగిరి ఆర్టీసీ డిపో ముందుండాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో నూతనంగా 11 బస్సులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంతం నుంచి ఎంతోమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బెంగుళూరు, హైద్రాబాద్ నగరాలకు వారంతపు రోజుల్లో ఎక్కువగా వెళ్తుంటారన్నారు. అలాగే, కనిగిరి ప్రజలు గత పదేళ్ళుగా బెంగుళూరు, హైద్రాబాద్, విజయవాడలాంటి నగరాలకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. ఈతరుణంలో కనిగిరి డిపో నుంచి చాలినన్ని బస్సులు లేకపోవటంతో ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తూ అధికంగా నగదు వెచ్చించాల్సి వస్తుందన్నారు. ఇటీవల కనిగిరి ప్రాంతంలో ప్రైవేట్ బస్సుల తాకిడి పెరిగిందన్నారు. ఎమ్మెల్యేగా తాను గెలిచిన తర్వాత ఈవిషయంపై దృష్టి సారించినట్లు చెప్పారు. సీఎం దృష్టికి తీసుకెళ్ళటంతో ఆయన సానుకూలంగా స్పందించి నూతన బస్సులను మంజూరు చేశారన్నారు. 5 సూపర్‌లగ్జరీ, 5 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, ఒక ఆర్డినరీ బస్సు సర్వీసులు నూతనంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కనిగిరి ప్రజలు ప్రైవేటు బస్సులను ఆశ్రయించకుండా సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసి డీఎం శ్రీమన్నారాయణ, మున్సిపల్ చైర్మన్ గఫార్, సీఐ ఖాజావలి, ఎస్ఐ త్యాగరాజు, టీడీపీ నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు యాదవ్, నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, సిద్దాంతి బారాయిమాం, షరీఫ్, నజీముద్దీన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాగా, కనిగిరి డిపో నుంచి 11 బస్సులు ఒకేరోజు ప్రారంభం కావటంతో పండగ వాతావరణం నెలకొంది. ఈబస్సులను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ప్రారంభించారు. ఆర్టీసి డిపో నుంచి మొదటగా ఎమ్మెల్యే డ్రైవింగ్ చేసే బస్సు బయలుదేరగా, మిగతా బస్సులు కూడా ర్యాలీగా పామూరు బస్టాండు సెంటర్ మీదుగా కొత్తూరు ఎమ్మెస్సార్ విగ్రహం వద్దకు చేరాయి. తిరిగి టర్నింగ్ తీసుకుని బస్సును నేరుగా అమరావతి గ్రౌండ్ వద్ద ఆపి ఎమ్మెల్యే దిగారు. ఆవెనుకనే మిగతా పది బస్సులు ర్యాలీగా వెళ్ళటంతో పుర ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

ఆస్పత్రి అభివృద్ధే లక్ష్యం

కనిగిరి, సెప్టెంబరు 15: కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం వైద్యశాలలోని ప్రసూతి, చిన్నపిల్లల సంరక్షణ విభాగాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరిలో ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరగక గత దశాబ్దకాలంగా పేదలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇకనుంచి ఆ సమస్య లేకుండా చూడటమే తన సంకల్పమన్నారు. కనిగిరి ప్రాంతంలో చాలామంది పేద కుటుంబాలవారు విధిలేని పరిస్థితిలో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వైద్యశాలలో తల్లీ బిడ్డ సంరక్షణ విభాగాన్ని ఆధునికీకరణ చేస్తున్నట్లు చెప్పారు. అతిత్వరలో ప్రభుత్వాసుపత్రికి మత్తు డాక్టర్‌తో పాటు గైనకాలజిస్టును, ఇతర సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఆసుపత్రిలో అన్నివిభాగాలు సేవలు అందించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

'ప్రలోభాలకు లొంగవద్దు'

తాళ్లూరు, సెప్టెంబరు 15: విద్యార్థి దశ నుంచే బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువకుల మాయ మాటలకు, ప్రలోభాలకు లొంగ వద్దన్నారు. సమాజంలో జరుగుతున్న మంచి చెడులపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. యువకుల వల్ల ఏదైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

బాలికలకు రక్షణ కల్పిస్తూ ప్రభుత్వాలు అనేక చట్టాలను రూపొందించాయని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు చెప్పారు. బాలికలకు అన్ని విధాల పోలీస్ శాఖ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కేజీబీవీ టీచర్లు, బాలికలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 15: సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వార్లకు అర్చకులు మంకాల సత్యనారాయణ శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో మహా నివేదన, గోపూజ వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూల విగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. ఆలయం చుట్టు మహానైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగళిని స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

అనంతరం గోశాలలోని గోవులను పసుపు కుంకమలతో పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎస్సై, ఎంపీపీ

తాళ్లూరు, సెప్టెంబరు 15 :పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న సోమవరప్పాడు పరిధిలోని గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో గుంటిగంగ ప్రాంగణం తిరునాళ్లను తలపించింది. భక్తులు గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కాగా, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ఎస్సై ఎస్.మల్లికార్జునరావు ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు .గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయశాఖ తరుపున ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం ఎస్సై, ఎంపీపీలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

రేణిమడుగుకు బస్సు పునఃప్రారంభం

పామూరు, సెప్టెంబరు 15:పామూరు మండలంలోని రేణిమడుగుకు ఆర్టీసీ బస్సును పునఃప్రారంభించారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి సహకా రంతో కనిగిరి - రేణిమడుగు ఆర్టీసీ బస్సు సర్వీసును ఆదివారం డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ కనిగిరిలో గ్రామస్థుల సమక్షంలో పునఃప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం పేరుతో చప్టాలను తొలగించి, ఉన్న రోడ్డును యంత్రాలతో గోతులు తీసి వదిలివేశారు. దాంతో రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో బస్సు సర్వీసును నిలిపివేశారు. దీంతో అటు ప్రజలు, ఇటు విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. విద్యార్థులను ఆటోలను ఆశ్రయిస్తూ సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలోఉన్న కంభాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళుతున్నారు. బస్సును పునరుద్ధరించాలని పలుమార్లు నాయకులను, అధికారు లను కోరిన పట్టించుకోలేదు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధి కారంలోకి రావడంతో ఈసమస్యను ఎమ్మెల్యే ఉగ్ర దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. గతుకులమయమైన రోడ్డును గ్రామస్థులే స్వచ్ఛందంగా మరమ్మతులు చేశారు. దాంతో ఉగ్ర ఆదేశాలతో బస్సును పునఃప్రారం భించారు. కనిగిరి నుంచి పామూరు, బొట్లగూడూరు, కంభాలదిన్నె మీదు గా రేణిమడుగు, అక్కంపేటకు బస్సును నడుపుతున్నట్లు డీఎం తెలిపారు.



ఘనంగా గణనాథుల నిమజ్జనం



తాళ్లూరు: నిమజ్జనానికి తరలివెళుతున్న కొత్తపాలెంలోని గణనాథుడు

తాళ్లూరు సెప్టెంబరు 15: వినాయక చవితి సందర్భంగా గత తొమ్మిది రోజులుగా పూజలందుకున్న గణనాథులు ఆదివారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరునితో పాటు తాళ్లూరులో, తూర్పుగంగవరం, మాధవరంలో, లక్కవరం, తురకపాలెంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గ్రామ వీధుల్లో ఊరేగించి సమీపానగల దోర్నపువాగు, గుండ్లకమ్మ తదితర వాగుల్లో నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఎస్సై ఎస్.మల్లికార్జునరావు నేతృత్వంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, సెప్టెంబరు 15: వినాయక చవితి సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. పసుపుగల్లు గ్రామంలోని కొత్తూరులో మాజీ సర్పంచ్ ఇందూరి పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఊరేగింపుగా వెళ్లి గుండ్లకమ్మలో నిమజ్జనం చేశారు. మారెళ్ళలో టీడీపీ నేత సుంకర రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. ముండ్లమూరు, పెదఉల్లగల్లు, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలనూ వైభవంగా నిమజ్జనానికి తరలించారు. పెద్దఎత్తున భక్తులు నిమజ్జన కార్యక్ర మంలో పాల్గొన్నారు.

పసుపుగల్లు కొత్తూరులో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 15 కేజీల లడ్డుకు ఆదివారం సాయంత్రం వేలం పాట నిర్వహించారు. కానాల అంక్కిరెడ్డి అనే భక్తుడు రూ.1.10 లక్షలకు పాట పాడి స్వామి వారి లడ్డును దక్కించుకున్నారు. వినాయకుని విగ్రహం వద్ద ఉంచిన రూ5,100 నోట్ల కట్టకు పాట నిర్వహించగా వీరంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి రూ.7,100కి పాడి స్వామి దండను దక్కించుకున్నారు.

దొనకొండలో.. దొనకొండ, సెప్టెంబరు 15: మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన గణనాథుని విగ్రహానికి గత తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం కోలాహలంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

సీఎస్‌పురంలో.. సీఎస్‌పురం (పామూరు) సెప్టెంబరు 15: సీఎస్‌పురం మండలం రెడ్డిగారి కొత్తపల్లి గ్రామంలో గల వినాయకుని మండపంలో ఆదివారం టీడీపీ నాయకులు పూజలు నిర్వహించారు. 9వ రోజు నిమజ్జనం సందర్భంగా టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్యలు ప్రత్యేక పూజలు చేశారు.

కార్యక్రమంలో ఎన్‌సీ మాలకొండయ్య, చావా సుబ్బయ్య, నాగరాజు, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలతో నిండిన చెరువులు

తాళ్లూరు, సెప్టెంబరు 15: మండలంలోని పలుగ్రామాల చెరువులు ఎండిపోయాయి. ఈక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చొరవతో చెరువులను సాగర్ జలాలతో నింపారు. మండలంలోని లక్కవరం, మన్నేపల్లి, విఠలాపురం చెరువులు ఎండిపోయాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయ మోటార్లు ఆడక పంటలు ఎండుముఖం పట్టాయి. టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలుగ్రామాల రైతులు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్‌ను కలిసి డ్యాముల్లో పుష్కలంగా నీరున్నందున మన్నేపల్లి, విఠలాపురం చెరువులు, కుంటలు, వాగులకు నీరు వదిలి ఆదుకోవాలని కోరారు. రైతుల కష్టాలపై స్పందించిన డాక్టర్ లక్ష్మి సంబంధిత అధికారులతో మాట్లాడి సాగర్ జలాలతో మన్నేపల్లి,విఠలాపురం, లక్కవరం చెరువులను నింపారు. దోర్నపు వాగుకు నీటిని వదిలారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సాగర్ జలాలతో నిండిన మన్నేపల్లి చెరువు

భైరవకోనలో పూజలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 15: సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన భైరవకోన దేవస్థానంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముప్పాళ్ల శ్యామ్ సుందర్‌రాజు, మాజీ చైర్మన్ గుంటి మడుగు వెంకటరామరాజు, ఎం.మస్తయ్య, మోహన్‌రాజులు ఆలయంలో పూజలు చేశారు.





● కోటప్పకొండ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు



ఈమని సమీపంలో ప్రమాదానికి గురైన వల్లభాపురం-గుంటూరు ఆర్టీసీ బస్సు

● రీజియన్‌లో సగానికిపైగా మరమ్మతుల్లోనే..

● గత ప్రభుత్వంలో బస్సుల నిర్వహణపై నిర్లక్ష్యం

● మార్గమధ్యలో తరచూ మొరాయిస్తున్న పలు బస్సులు

● 15 లక్షల కిమీ తిరిగిన 20 శాతం బస్సులు ఇంకా రోడ్లపైనే

● కమాన్ కట్ట విరగడంతో ఈమని వద్ద కాల్వలోకి దూసుకెళ్లిన బస్సు

డొక్కు బస్సులతో.. డేంజర్



గుంటూరు, సెప్టెంబరు 15: నిర్వహణ లేదు.. మరమ్మతులు మరిచారు.. స్ర్కాబ్‌కు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు ఇంకా రోడ్లపైనే.. డొక్కు బస్సుల్లో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఆదివారం కొల్లిపర మండలం మున్నంగి నుంచి గుంటూరు వస్తున్న బస్సు కమాన్‌కట్టలు విరిగిపోయి దుగ్గిరాల సమీపంలోని ఈమని వద్ద పొలాల్లోకి దూసుకెళ్ళిన సంఘటన ఆర్టీసీ బస్సుల తీరును తెలియజేస్తుంది. 30 మంది ప్రయాణికులు ఉన్న బస్సు ప్రమాదానికి గురికావడంతో గుంటూరు డిపో అధికారులను ఉలికిపాటుకు గురిచేసింది. గుంటూరు నుంచి వయా దుగ్గిరాల, ఈమని, వల్లభాపురం మున్నంగికి రాకపోకలు సాగించే బస్సు సాంకేతిక లోపంతో పొలాల్లోకి దూసుకెళ్లడంతో ప్రయాణికులు భయాందోళనలకు లోనయ్యారు. బస్సు కింది భాగంలో కమాన్ కట్టకు ఉండే షాకిల్ పిన్ అరిగిపోవడంతో ఊడి బస్సు ఒక పక్కకు లాగిందని ప్రాథమిక విచారణలో తేలినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. డొక్కు బస్సులతోనే ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఆర్టీసీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 980కు పైగా బస్సులు ఉంటే వాటిలో సగంపైన డొక్కువే. నిర్వహణా లోపం, సరైన మరమ్మతులు లేకపోవడంతో రీజియన్ పరిధిలో ఎక్కడోఒక దగ్గర బస్సులు మొరాయిస్తుండటం పరిపాటిగా మారింది. కొన్ని ఆర్డినరీ బస్సుల్లో కనీసం కిటికీలకు అద్దాలు కూడా లేవంటే ఆశ్చర్యం కాదు. పైగా కిటికీలు, డోర్‌లు, రేకుల శబ్దాలతో తలనొప్పి, ఒళ్ళు నొప్పులతో అస్వస్థతకు గురవ్వాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. పంక్చర్లు పడితే టైరు మార్చాలన్నా టూల్స్ ఉండటం లేదని సిబ్బంది వాపోతున్నారు. దూర ప్రాంత బస్సులకు మాత్రమే టూల్స్ అందుబాటులో ఉంచుతున్నారు. నిబంధనల మేరకు 12 లక్షల కిలో మీటర్లు తిరిగిన బస్సులను స్ర్కాబ్ చేయాలి. అయితే ఈ నిబంధనలు గుంటూరు రీజియన్ పరిధిలోని ఏ డిపోలోనూ పాటించడం లేదు. రీజియన్‌లో 20 శాతంపైన బస్సులు 15 లక్షల కిలో మీటర్లు తిరిగినవే ఉన్నాయన్న విమర్శలున్నాయి. ఇటీవల తరచూ మెట్రో బస్సులు కూడా మరమ్మతులకు గురవుతున్నా కనీసం వాటికి కావాల్సిన స్పేర్స్ అందించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని సమాచారం. దాదాపు 100 బస్సులను గతంలో స్ర్కాబ్ చేసినట్లు చెబుతున్నారు. కానీ వాటి స్థానంలో ఒక్క కొత్త బస్సు వచ్చిన పరిస్థితి లేదు. గతంలో గుంటూరు నుంచి సచివాలయ సిబ్బందిని తీసుకెళుతున్న ఓ బస్సు మందడం సమీపంలో అర్ధాంతరంగా నిలిచిపోయింది. దాంతో చేసేది లేక సచివాలయ సిబ్బంది మరో బస్సు ఎక్కి విధులకు వెళ్లాల్సి వచ్చింది. ఉదయం సంఘటన జరిగితే సాయంత్రం వరకు ఆ బస్సును పట్టించుకున్న నాథుడే లేడు. ఇటీవల రీజియన్‌లో పరిధిలో తరచూ రిపేర్లతో బస్సులు మార్గమధ్యలో నిలిచిపోతున్న సంఘటనలున్నాయి. ఈమని దుర్ఘటనతో గ్యారేజ్ సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందన్న విమర్శలున్నాయి. నిర్వహణలో షెడ్యూల్ 3లో కమాన్ కట్టలు, బ్రేక్ డ్రమ్ములు, టైర్లు, స్టీరింగ్ జాయింట్లు, విద్యుత్ వైరింగ్ రిపేర్లు వంటివి చేయాలి. అయితే వీటి గురించి పట్టించుకునే వారే లేకపోవడంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈమని వద్ద బస్సు పొలం వైపునకు ఒరిగిపోయి ఘటనలో ఎవ్వరికీ ప్రమాదం జరగలేదని అయినా దీనిపై విచారణ చేయిస్తామని గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు.

● సీనరేజ బిల్లు ఉంటేనే లారీ కదిలేది

● ఉమ్మడి గుంటూరు జిల్లాలో మాఫియాకు చెక్

● ప్రభుత్వ నిర్ణయంపై కోటప్పకొండలో క్రషర్ల నిర్వాహకుల నిరసన

● లారీ కంకర రూ.2500 నుంచి రూ.3 వేల పెరుగుదల

● అమాంతం పెరిగిన ధరలతో నిర్మాణదారులపై ఆర్థిక భారం

మళ్లీ చెక్‌పోస్టులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం ప్రైవేట్ చెక్‌పోస్టులు నిలిచిపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు నెలలుగా మట్టి మాఫియా బరి తెగించింది. అక్రమ మైనింగ్ పెద్దఎత్తున జరుగుతోంది. ఎటువంటి అనుమతులు లేకుండానే కొండలు, గుట్టలను కొల్లకొడుతున్నారు. దీనిని కట్టడి చేసేందుకు ప్రైవేటు చెక్‌పోస్టులను తిరిగి కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అక్రమార్కుల గొంతులో వెలక్కాయపడింది. ఈ పరిస్థితుల్లో సీనరేజి వసూలు ప్రైవేటీకరణను కొనసాగించాలని కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని, చెక్‌పోస్టుల ఏర్పాటును నిరసిస్తూ వివిధ ప్రాంతాల్లో క్రషర్ల నిర్వహకులు కంకర సరఫరాను నిలిపివేశారు. కోటప్పకొండలో క్రషర్ల నిర్వహకులు సమ్మె చేపట్టారు. వీరు ప్రైవేట్ చెక్‌పోస్టులను వ్యతిరేకిస్తున్నారు. చెక్‌పోస్టుల నిర్వహణతో భవన నిర్మాణ మెటీరియల్ ధరలు అమాంతం పెరిగాయి. లారీ కంకర ధర రూ.2500 నుంచి రూ.3 వేలకు పెరిగింది. లారీ గ్రావెల్ ధర కూడా రూ.2 వేల వరకు పెరిగింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మైనింగ్ లీజు టెండర్‌ను ఓ సంస్థ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో సుమారు రూ.250 కోట్లకు దక్కించుకుంది. లీజు పొందిన సంస్థ ఉమ్మడి గుంటూరు జిల్లా అంతటా విస్తృతంగా సీనరేజి తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎన్నికల ఫలితాల అనంతరం సీనరేజి వసూళ్లను ఆపేసింది. దీంతో ప్రభుత్వ భూముల్లో, చెరువుల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. మూడు నెలలుగా రూపాయి కూడా చెల్లించకుండా అధికార పార్టీ అండతో మట్టి అక్రమ వ్యాపారాన్ని సాగించారు. ఈ పరిస్థితుల్లో అక్టోబరు వరకు మైనింగ్ సీనరేజి టెండర్ కాల వ్యవధి ఉన్నట్లు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పరిస్థితుల్లో అక్రమార్కులకు చెక్ పెట్టడంతో పాటు తవ్వకాల ను కట్టడి చేసేందుకు మైనింగ్ శాఖకు ప్రభుత్వం అనుమతించింది. దీంతో మైనింగ్ చేసినా సీనరేజి చెల్లించకుండా రవాణా చేసే పరిస్థితి లేకుండా మైనింగ్‌శాఖ పాత విధానాన్ని కొనసాగించింది. దీంతో మళ్లీ ఎక్కడికక్కడ ప్రైవేట్ చెక్‌పోస్టుల నిర్వహణ అమల్లోకి వచ్చింది. పాత పద్ధతిలోనే కాంట్రాక్టర్ సీనరేజిని వసూలు చేపట్టారు. దీంతో మూడు నెలలుగా యథేచ్ఛగా మట్టి వ్యాపారం చేపట్టిన అధికార పార్టీకి చెందిన కొంద రు అక్రమార్కులు కంగుతిన్నారు. తనిఖీ కేంద్రాల ఏర్పా టును జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభు త్వానికి చెల్లించే సొమ్మును వినియోగదారుల నుంచి వసూలు చేస్తు న్నారు. సీనరేజి తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయగానే మట్టి ధరలను పెంచేశారు. గతంలో లారీ మట్టి ధర రూ.6 వేల వరకు ఉండేది దీనిని రూ.8 వేలకు పెంచి నట్లు కొనుగోలు దారులు తెలిపారు. కంకర కొంత జీరోపైనే విక్రయించే వారు. కంకరకు కూడా సీనరేజి తప్పని సరి కావడంతో ట్రాక్టర్ కంకర ధరను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచారు. గతంలో కోట ప్పకొండ ప్రాంతంలో లారీ కంకర ధర రూ.8 వేలు ఉం డేది చెక్‌పోస్టుల నిర్వహణతో ఈ ధర రూ.3 వేల వ ర కు పెరిగింది. ఈ భారం నిర్మాణ రంగంపై పడుతున్నది.

నెలకు రూ.20 కోట్ల ఆదాయం

ఉమ్మడి గుంటూరు జిల్లా లోని మైనింగ్‌కు సంబంధించిన సీనరేజిని పూర్తిగా ప్రైవేటీకరించారు. దీని వల్ల అక్రమాలను కొంత మేర నిరోధించడంతో పాటు ప్రభుత్వానికి నెలకు దాదాపు రూ.20 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా. సిమెంట్ కంపెనీలకు సర ఫరా అయ్యే రాయికి, ఇసుకకు నూతన సీనరేజి విధానంలో మి నహాయింపు ఇచ్చారు. సున్నపురాయి, మట్టి, కంకర, కంకర డస్ట్, రోబో ఇసుక, గ్రానైట్‌కు సంబంధించి సీనరేజిని వసూలు చేసుకునే హక్కును కాంట్రాక్టర్‌కు కల్పించారు. ఒక్క దాచేపల్లి ప్రాంతంలోనే ఆరు తనిఖీ కేంద్రాలను సదరు సంస్థ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మైనింగ్ జరిగే ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ విధానాన్ని అడ్డుకునేందుకు అక్రమార్కులు అధి కార పార్టీలోని కొందరు పెద్దలతో లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం.

ప్రైవేటీకరణ కొనసాగింపు

ఇష్టం వచ్చినట్లు తవ్వుకుంటాం.. తరలిస్తాం.. అంటే వీలుకాదు. అనుమతులు అవసరం లేదు.. అధికారం మాదే అంటే ఇక కుదరదు. సీనరేజి బిల్లు ఉంటేనే లారీ కదులుతుంది.. లేదంటే కష్టమే. మైనింగ్ మాఫియాకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం రంగంలోకి దిగింది. సీనరేజి వసూలు బాధ్యతను మళ్లీ ప్రైవేటీకరించింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ మళ్లీ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకునేం దుకు మైనింగ్‌శాఖ అనుమతి ఇచ్చింది. సీనరేజి వసూలు ప్రైవేటుకు అప్పగించడంతో అక్రమార్కులు కంగుతిన్నారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టుల ఏర్పాటుతో అక్రమ మైనింగ్‌కు కట్టడి పడిం ది. మట్టి, గ్రావెల్, కంకర అక్రమ తవ్వకాలు ఆగాయి. చెక్‌పోస్టుల కొనసా గింపును నిరసిస్తూ కంకర సరఫరాను క్రషర్ల నిర్వహకులు నిలిపివేశారు. దీంతో కంకర, గ్రావెల్ ధరలకు రెక్కలు వచ్చాయి.

పొరుగు జిల్లాలో వసూలు లేదు..

పొరుగున ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సీనరేజి వసూలు ప్రైవేటీకరించలేదు. వైసీపీ ప్రభుత్వ హయంలో మాజీ ఎమ్మెల్యే బాలినేని ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సీనరేజ్ ప్రైవేటీకరించకుండా అడ్డుకున్నారు. దీని వల్ల ఆ జిల్లాలోని స్టోన్‌క్రషర్లు, గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీనరేజి ప్రైవేటీకరించడంతో పూర్తి స్థాయిలో వసూలు జరుగుతోంది. ఉదాహరణకు యేల్చూరు ప్రాంతంలోని స్టోన్‌క్రషర్ల నిర్వాహకులు కంకర సీనరేజ్ లేకుండా విక్రయిస్తున్నారు. ఇక్కడి నిర్మాణదారులు అక్కడ కంకర కొనుగోలు చేసి చెక్ పోస్టులు లేని రహదారుల గుండా తరలిస్తున్నారు. తక్కువ ధరకు లభిస్తుండటంతో అక్కడ కంకర కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వ్యాపారులు నష్టపోతున్నారు. పొరుగు జిల్లా సరిహద్దులోని మార్టూరు, యేల్చూరు ప్రాంతాల్లో కంకర కొనుగోలు చేస్తే లారీకి రూ.3నుంచి రూ.4 వేల వరకు ధర తగ్గుతుందని కొనుగోలుదారులు చెప్తున్నారు. ఈ విధానాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాపారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



సూర్యలంక తీరంలో పర్యాటలకుల సందడి

సూర్యలంకకు.. మహర్దశ

● బీచ్‌లో వసతుల కల్పనకు పెద్దపీట

● తీరంలో అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు

● పర్యాటక రంగ పురోగమనంపై రాష్ట్ర ప్రభుత్వం చూపు

బాపట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా గోవాగా ప్రసిద్ధి చెంది.. విశాలమైన తీరం.. మడ అడవుల అందాలతో అలరారే సూర్యలంక బీచ్‌కు మహర్దశ పట్టనున్నది. పర్యాటకులతో కళకళలాడే బీచ్‌ల్లో ఒకటిగా ఉన్న సూర్యలంక అభివృద్ధిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. టూరిజం అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉన్న ప్రాంతాలు గుర్తించే క్రమంలో జిల్లాలోని సూర్యలంక తీరాన్ని కూడా పర్యాటకరంగానికి అనుకూలమైన ప్రాజెక్టుగా గుర్తించారు. పర్యాటక రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంచుకున్న అతి కొద్ది ప్రాజెక్టుల్లో సూర్యలంక బీచ్‌కు కూడా స్థానం దక్కింది. ఈ క్రమంలో రూ.వంద కోట్ల వరకు ఖర్చు చేసి సూర్యలంక బీచ్‌ను పర్యాటక రంగ పరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయానికి వచ్చారు. నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం సైతం పచ్చజెండా ఊపింది. ఇందుకు సంబంధించి త్వరలోనే విధివిధానాలు విడుదల కానున్నాయని సమాచారం. పర్యాటక రంగం అభివృద్ధికి విరివిగా అవకాశాలు ఉన్న దృష్ట్యా సూర్యలంక బీచ్‌కు సంబంధించి అధికారులు ప్రభుత్వానికి ప్రాథమికంగా నివేదికలను పంపించారు. సూర్యలంక తీరానికి పెట్టని కోటగా ఉన్న మడ అడవులు సహజసిద్ధమైన ప్రకృతి అందాలకు నెలవుగా ఉన్నాయి. పర్యాటకరంగ అభివృద్ధిలో భాగంగా ఈ అందాలకు మెరుగులు దిద్దితే పర్యాటకులు పోటెత్తుతారు. సూర్యలంక తీరానికి ఆటవిడుపు కోసం పెద్ద ఎత్తున వచ్చే పర్యాటకులకు వసతుల విషయంలో పెద్దపీట వేసే దిశగా నిధులు వెచ్చించనున్నారు. వాటర్ గేమ్స్‌తో పాటు స్పీడ్‌బోటింగ్ సౌకర్యాలను కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. డార్మిటరీ తరహాలో బీచ్‌లో విశ్రాంతి గృహాలతో పాటు తాగునీరు, మరుగుదొడ్ల కల్పనకు ప్రాధాన్యమిచ్చేలా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. వీటితో పాటు భద్రతను అత్యంత ప్రధానంగా భావించి ప్రమాదాలను అరికట్టి పర్యాటకులను కాపాడడానికి అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకునే దిశగా అడుగులు పడనున్నాయి. ఇందులోభాగంగా మానవరహితంగా రిమోట్ ద్వారా నియంత్రించే బోట్లను వినియోగించడానికి కసరత్తు చేస్తున్నారు. సూర్యలంక బీచ్‌కు బ్లూఫ్లాగ్ హోదా కల్పించడంతో పాటు బీచ్‌లో ఉన్న సౌకర్యాలపై విస్తృత ప్రచారం కల్పిస్తే పర్యాటకుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రైవేటు రిసార్టులు పెద్దసంఖ్యలో ఉన్నాయి. అయితే వాటి అద్దెలపై నియంత్రణ లేకపోవడంతో పర్యాటకుల జేబులకు చిల్లు పడుతుంది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న రిసార్టులలో ఒక్కటి మాత్రమే సూర్యలంక తీరంలో ఉంది. పర్యాటక శాఖ వైపునుంచి మరిన్ని రిసార్టులు రావాల్సిన అవసరం ఉంది. తీర ప్రాంతాలకు అనుసంధానిస్తూ రోడ్ల నిర్మాణం మీద దృష్టిపెడితే బీచ్‌కు ఆదరణ ఇంకా పెరిగే అవకాశం ఉంది. బీచ్‌లో రక్షణతో పాటు పర్యాటకులు దోపిడీకి గురికాకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉంది.

గతంలో హామీలతో సరి..

సూర్యలంక తీర ప్రాంత అభివృద్ధిపై గత ప్రభుత్వం దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క రూపాయి విదిల్చిన దాఖలాలు లేవు. అప్పటి పర్యాటక శాఖ మంత్రి రోజా తీరానికి వచ్చి హామీలు అయితే ఇచ్చి వెళ్లారు తప్పితే అడుగు ముందుకు పడలేదు. వైసీపీ హయాంలో దాదాపు కోటిన్నర రూపాయల ప్రతిపాదనలతో సూర్యలంక బీచ్ అభివృద్ధికి అప్పటి కలెక్టర్ విజయకృష్ణన్ డీపీఆర్‌లను పంపించారు. కానీ వాటిపై కదలికే కరువైంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి పెట్టడం, అధికారులు పంపిన నివేదికలకు ప్రా ముఖ్యత ఇస్తూ అభివృద్ధికి సూర్యలంకను ఎంపిక చేసుకోవడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంగులూరులో.. ఖోఖో కేక

ఉత్సాహపూరిత వాతావరణంలో పోటీలు ● జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక



ఖోఖో ఆడుతున్న బాలుర జట్టు

పంగులూరు, సెప్టెంబరు 15: జార్ఖండ్‌లో ఈ నెల 28 నుంచి అక్టోబరు 2 వరకు జరిగే అండర్-14 సబ్ జూనియర్ బాల బాలికల జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్ల ఎంపిక ఆదివారం పంగులూరులో జరిగింది. ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ ఎంపికకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 100 మంది బాలురు, 70 మంది బాలికలు పాల్గొన్నారు. పోటీల అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ గరటయ్య మాట్లాడుతూ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలలో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో రాష్ర ఖోఖో అసోషియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి, రిఫరీస్ బోర్డు కన్వీనర్ కేఎస్‌కే ప్రసాద్, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, భవనం కాశీవిశ్వనాథరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, ఆర్‌వీ సుబ్బారావు, రోటరీ ప్రతినిధి వీరరాఘవయ్య, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, రామారావు, జాగర్లమూడి సుబ్బారావు పాల్గొన్నారు.

బాలుర జట్టు : జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీకి ఎంపికైన బాలుర జట్టును అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి ఆదివారం ప్రకటించారు. ఎ.శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్లు, డి.బాజీవలి, వి.సాగర్, సి.హెచ్.నారాయనరెడ్డి, వెంకటసాయి (ప్రకాశం), ఎన్.భవానీశంకర్, ఎస్.శ్యామ్ కుమార్(కృష్ణ), టి.మిట్టు (విశాఖ), డి.రవి(శ్రీకాకుళం), ఎస్.వీరేంద్ర (తూ.గో), ఆర్.బాలజీ (కర్నూలి), ఎం.పవన్(విజయనగరం), పి.జ్యోతిరామ్(అనంతపురం), బద్రీనాథ్, టి.సూర్యనారాయణ (చిత్తూరు), బి.ర్యాన్‌పాల్(గుంటూరు), గౌతమ్(నెల్లూరు)ఎంపికయ్యారు.

బాలికల జట్టు : బాలికల జట్టుకు ఆర్.సరస్వతి, వై.భవాని (శ్రీకాకుళం). ఎస్.భానుప్రియ, కె.వైశాలి, పి.ఐశ్వర్య(ప్రకాశం), యం.ధనలక్ష్మి(విజయనగరం), కె.భవాని, పి.రూప(నెల్లూరు), జి.లక్ష్మి, యం.యువశ్రీ(చిత్తూరు), ఆర్.లలితాదేవి(విశాఖ), డి.యోదిత, యం.హర్షిత్రశ్రీ, కె.రెష్మశ్రీ(కృష్ణ), స్వప్న(అనంతపురం), యు.శిరీష(కర్నూల్), టి.ప్రియ (తూ.గో), కె.రేణుక(ప.గో), పి.శివమణి(గుంటూరు) ఎంపికయ్యారు.



ఖోఖో పోటీలో పాల్గొనే రాష్ట్ర బాలికల జట్టు

అద్దంకిలో దొంగల హల్‌చల్

● ఆరు ఇళ్లలో చోరీలకు యత్నం

● ఓ ఇంట్లో బిర్యాని తిని వెళ్లిన దొంగలు

అద్దంకి, సెప్టెంబరు 15: అద్దంకిలో శనివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఒకే ప్రాంతంలో ఆరు ఇళ్లలో చోరీలు, ప్రయత్నాలు చేసిన దొంగలు పోలీసులకు సవాల్ విసిరారు. ఓ ఇంట్లో రూ.10 వేలు మినహా మిగిలిన ఇళ్లలో ఎలాంటి సొత్తు అపహరణకు గురికాకపోవడంతో అటు పోలీసులు, ఇటు బాధితులు ఊపిరిపీల్చుకున్నారు. కుటుంబసభ్యులు నిద్రిస్తుండగానే కిటికీ తలుపులు పగలగొట్టి, ప్రధాన ద్వారాల గడియలు తీసి ఇళ్లలోకి ప్రవేశించారు. అద్దంకి మండలం ధర్మవరంలో గొడవల నేపథ్యంలో అద్దంకిలో పోలీస్ బీట్‌లు ఉండవని గ్రహించి దొంగలు చోరీలకు ప్రయత్నించి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. పట్టణంలోని ఆయిల్‌మిల్ రోడ్డులో ఎన్‌టీఆర్ డిగ్రీ కళాశాల వెనుక శివసాయినగర్, బ్రహ్మానందం కాలనీలో 4వ వార్డు కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మగోపి ఇంట్లో వెనుక వైపు నిచ్చెన సహాయంతో ప్రవేశించిన దొంగలు చోరీకి ప్రయత్నించారు. అయితే వీలు కాకపోవడంతో వెనుక వైపు గోపి సోదరుడు రామాంజనేయులు ఇంట్లో అద్దెకు ఉంటున్న ఉపాధ్యాయుడు అంకమ్మరావు ఇంట్లో వెనుక వైపు నుంచి తలుపుతీసుకుని ప్రవేశించారు. బీరువాలో ఏమీ దొరకకపోవడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. పక్కనే ఉన్న నీలం సుబ్బయ్య ఇంట్లో కూడా చోరీకి ప్రయత్నించారు. అనంతరం ఎదురుగా ఉన్న ఉపాధ్యాయుడు కోవి శ్రీనివాసరావు ఇంట్లో అద్దెకు ఉంటున్న ఓ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ శబరి మల్లేశ్వరరెడ్డి ఇంట్లోకి కిటికీ తలుపును రాడ్‌తో తీసి ప్రధాన ద్వారం గడియను లోపల నుంచి తీశారు. ఇంట్లో మాస్టర్ బెడ్ రూమ్‌లో మల్లేశ్వరరెడ్డి కుటుంబసభ్యులు నిద్రిస్తుండగా పక్కన ఉన్న చిన్న బెడ్‌రూమ్‌లోకి ప్రవేశించి బీరువా తెరిచి వెంకటేశ్వరస్వామి మొక్కుబడికి ఉంచిన సుమారు రూ.10 వేలను తీసుకుపోయారు. వెనుక బజారులో ఎన్టీఆర్ కళాశాల కరస్పాండెంట్ మలాది పెద రత్తయ్య ఇంట్లో ప్రధాన ద్వారం పక్కన ఉన్న కిటికీని రాడ్‌తో పగలగొట్టి ప్రధాన ద్వారం తెరిచే ప్రయత్నం చేసినా ఫలించలేదు. ఆ తర్వాత సమీపంలోనే బ్రహ్మానందం కాలనీ రోడ్డులో ఉన్న మేదరమెట్ల సీతారామయ్య ఇంట్లో గేటు తాళం పగలగొట్టి చోరీకి ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో ఇంటి పైకి వెళ్లి తమతో తెచ్చుకున్న రెండు బిర్యానీ ప్యాకెట్లు తిని వ్యర్థాలు అక్కడే పడవేసి వెళ్లారు. కనీసం ముగ్గురు, నలుగురు దొంగలు సుమారు రెండు, మూడు గంటల పాటు ఆ ప్రాంతంలోనే చోరీలు, ప్రయత్నాలు చేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. పట్టణంలో గస్తీ పెంచుతామని, దొంగలను త్వరలో పట్టుకుంటామని సీఐ కృష్ణయ్య తెలిపారు.



పగలగొట్టిన కిటికీని పరిశీలిస్తున్న రత్తయ్య, గోపి

మరో 30.3 కిమీ రైల్వేట్రాక్

నడికుడి-శ్రీకాళహస్తి మార్గంలో నిర్మాణం

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నడికుడి - శ్రీకాళహస్తి కొత్త రైలు మార్గంలో మరో సెక్షన్ నిర్మించేందుకు మార్గం సుగమమైంది. ఇప్పటికే ఈ మార్గంలో న్యూ పిడుగురాళ్ల నుంచి గుండ్లకమ్మ వరకు పనులు పూర్తి అయిన విషయం తెలిసిందే. గుండ్లకమ్మ - కనిగిరి మధ్య వేగవంతంగా పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కనిగిరి నుంచి పామూరు వరకు 30.3 కిలోమీటర్ల పొడవునా మరో సెక్షన్ పూర్తికి రైల్వే సంకల్పించింది. కాగా 2022లో దీనిపై కేంద్ర ప్రభుత్వం సమీక్ష జరిపి సొంత నిధులతోనే ఈ రైలుమార్గం నిర్మాణం పూర్తి చేయాలని సంకల్పించింది. ప్రస్తుతం అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు పరిపాలన సాగిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై సమీక్ష జరిపి తాజాగా రూ.391.44 కోట్లు మంజూరు చేసింది. ఇందుకోసం అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్ నుంచి కేటాయించింది. దీంతో జోనల్ అధికారులు టెండర్ ప్రక్రియ ప్రారంభించారు.

కొనసాగుతున్న వైద్యుల ఆందోళన

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 15 : పీజీ వైద్యవిద్యలో ఇన్ సర్వీసు కోటాను 15శాతానికి తగ్గించడాన్ని నిరసిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీల) వైద్యాధికారులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. సోమవారం కూడా ఓపీలను బహిష్కరించాలని వారు నిర్ణయించుకున్నారు. వైద్యారోగ్యశాఖ ముఖ్య అధికారులతో జరిగిన చర్చలు విఫలం కావడంతో పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ నేతలు ఆదివారం విజయవాడలో సమావేశమయ్యారు. సోమవారం సాయంత్రం లోపు ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోతే తదుపరి కార్యాచరణకు దిగాలని నిర్ణయించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గిస్తూ జారీ చేసిన జీవో నంబరు 85ను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ తెలిపారు.

ఇద్దరు డీఎస్పీల నియామకం

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 15 : మార్కాపురం డీఎస్పీగా యు.నాగరాజు, కనిగిరి డీఎస్పీగా ఎం. మహేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. మార్కాపురం డీఎస్పీ పోస్టు రెండు నెలల నుంచి ఖాళీగా ఉంది. కనిగిరి డీఎస్పీగా పనిచేసిన రామరాజు గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో అక్కడ ఖాళీ ఏర్పడింది. ఈ రెండు పోస్టులను ఇప్పుడు భర్తీ చేశారు.

'స్వామి' కోసం చెప్పులు లేకుండా..


అభిమానిని సన్మానిస్తున్న మంత్రి స్వామి

కొండపి, సెప్టెంబరు15: కొండపి శాసనసభ్యుడిగా డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ కొర్రపాటి ప్రసాద్ సంవత్సరకాలం చెప్పులు లేకుండా తిరుగుతానని సంకల్పించాడు. అలాగే కొనసాగాడు. ఆదివారం కొండపికి వచ్చిన స్వామిని కలిసి విషయం చెప్పి కొత్త చెప్పులు స్వామి సమక్షంలో వేసుకున్నాడు. దీనికి ఆనందం వ్యక్తం చేసిన మంత్రి స్వామి ప్రసాద్‌ను శాలువాతో సన్మానించా రు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ అభివృద్ధి, సంక్షేమం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 15: భారతీయ జనతా పార్టీతోనే దేశ అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ కోస్తా జోనల్ ఇన్‌చార్జి జయప్రకాష్ పేర్కొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పీవీ.శివా రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సభలో జయప్రకాష్ మాట్లాడు తూ గత పదేళ్ళ కాలంలో నరేంద్రమోదీ నాయక త్వంలో దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగ్రామిగా నిలిపేందుకు పాటుపడుతున్నారని చెప్పారు. ఒక వైపు పేద, బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమ ఫలాలను అందిస్తూనే మరో వైపు దేశ అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. గత పదేళ్ళ కాలంలో బీజేపీ ప్రభుత్వంలో సాధించిన విజయా లను ప్రజలకు వివ రించి ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకునే విధంగా పాటు పడాలని చెప్పారు. అందుకోసం శ్రేణులు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదుకు చేపడు తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పీవీ.కృష్ణారెడ్డి, శెగ్గం శ్రీనివాసులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీని పరిరక్షించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 15: ఆర్టీసీని రక్షించుకునేందుకు కార్మికులందరూ సమన్వయంతో పనిచేయాలని అఖిలభారత కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జిల్లా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరన ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్ ఏర్పడక ముందు ఆర్టీసీ పరిస్థితులు మరింత దారుణంగా ఉండేవన్నారు. అలాంటి నేపథ్యంలో సమస్యలపై ఉద్య మాలు చేసే సంఘం అవసరమని భావించి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌ను స్థాపించడం జరిగిం దన్నారు. 1979 నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీని రక్షించుకోవడంలో అనేకమంది కార్యకర్తలు పనిచే సిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టీసీ ప్రైవేటీకరణ వేగవంతం అవుతుందన్నారు. ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వారికి అప్పజె ప్పడం, అనేక విభాగాలను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విభాగాలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఇంకొక వైపు రిక్రూట్‌మెంట్ లేకపోవడం, పాత బస్సులను కొనసాగించడం, కొత్త బస్సుల కొనుగోలుకు అంగీకారం తెలపకవడం లాంటి సమస్యలు ఉద్యోగులను, కార్మికులను ఇబ్బందులు పెడుతు న్నాయని తెలిపారు ఈ నేపథ్యంలో ఆర్టీసీని పరిరక్షించుకునేందుకు సమన్వయంతో ముందుకు పోవాల్సిన అవసరం వచ్చిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రతినిధులు మా దాల వెంకట్రావు, ఎం.అయ్యపరెడ్డి, ఎస్‌కే.జిలాని, కట్టా సుబ్రహ్మణ్యం, దివాకర్, గంగాధర్ తిరుప తిరెడ్డి, అల్లాడి సుబ్బారావు, పి.శ్రీనివాస్, సీఐటీ యూ నాయకులు జి.శ్రీనివాసులు, హరిబాబు, వెంకటేశ్వర్లు, మీరావలి, రవి తదితరులు పాల్గొ న్నారు. అనంతరం సీపీఎం జాతీయ ప్రధాన కా ర్యదర్శి సీతారాం ఏచూరికి ఘనంగా నివాళుల ర్పి ంచారు.

అట్టహాసంగా క్రీడాపోటీలు ప్రారంభం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 15: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఒంగోలులో ఆదివారం ఉపాధ్యాయులకు ఆటపోటీలను అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి పోటీలను యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు ప్రారంభించారు. ముందుగా క్రికెట్ పోటీలు హెచ్ఎంపాడు, పొదిలి జట్ల మధ్య ఉత్కంఠ భరితంగా జరిగింది. క్రికెట్ పోటీలకు 12జట్లు వచ్చాయి. వాలీబాల్ పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొనగా టంగుటూరు జట్టు ఫైనల్‌కు అర్హత సాధించింది. షటిల్ పోటీలకు 20 జట్లు హాజరయ్యాయి. ఈ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ అబ్దుల్‌హై, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి, కోశాధికారి చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు బాలవెంకటేశ్వర్లు, వెంకటేశ్వర రెడ్డి, జేవీవీ రాష్ట్ర నాయకులు కె.సుబ్రహ్మణ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో విజిలెన్స్ కలకలం

మద్దిపాడు, సెప్టెంబరు 15 : మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో జరిగిన అవకతవకలపై ఇటీవల ఆశాఖ విజిలెన్స్ అధికారులు నిర్వహించిన విచారణ కలకలం రేపింది. గుళ్ళసముద్రం గ్రామానికి చెందిన చంద్రమౌళి అనే వినియోగదారుడు ట్రా న్స్‌ఫార్మర్ ఏర్పాటులో ఏఈ రామకృష్ణారెడ్డి పలు అవకతవకలకు పాల్పడుతున్నారంటూ ఆశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో ఒంగోలు విజిలెన్స్ డీఈ, దర్శి డీఈలు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. పలువురు గ్రామాల రైతుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో పెద్దఎత్తున ము డుపులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని వినియోగదారులు కొంతమంది లిఖితపూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఉన్నతాధికారులు ఏఈ రామకృష్ణారెడ్డి, ఏఎల్ఎం బాలకృష్ణారెడ్డిలపై సస్పెన్షన్ వేటు వేశారు. పూర్తిస్థాయి విచారణ జరిగితే మరికొంత మంది క్షేత్రస్థాయి సిబ్బందిపై కూడా చర్య లు ఉంటాయని తెలుస్తోంది. పొదిలి ఏడీఏ శ్రీనివాసులుకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు దర్శి డీఈ కరీం తెలిపారు.

జేసీఐ సేవా కార్యక్రమాలు అభినందనీయం

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 15: జేసీఐ నిర్వహిస్తున్న వివిధ సామాజిక, సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ముగింపు సభకు ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం, విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

అనంతరం కమలపత్ర పురస్కారాన్ని దాది అంజనేయులు, అవుట్ స్టాండింగ్ యంగ్‌పర్సన్ అవార్డును అనంతపురం ట్రైనింగ్ కలెక్టర్ బి.వినూత్నకు, న్యాయమూర్తి చివ కుల భరత్‌కమల్‌కు, టోబీప్ అవార్డు ఎయిమ్స్ వైద్య సంస్థల చైర్మన్ బొమ్మల రామలింగేశ్వరరావు, సూపర్‌కిడ్ అవార్డును పల్లెపు ధనుశ్రీకి మంత్రి స్వామి చేతులమీదుగా ప్రదానం చేశారు.

జేసీఐ అధ్యక్ష, కార్య దర్శులు కె.వరుణ్‌కుమార్, బి.శ్రీకాంత్, నరేంద్రల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్ బాబు, ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, వారోత్సవాల చైర్మన్ శబరి పి.నాయర్, సాత్విక్‌రాజ్, కె.శివకోటిరెడ్డి, శేఖర్‌బాబు, డాక్టర్ టి.రవి, గోరంట్ల రవికు మార్, డి.రమణారెడ్డి, బొమ్మల శ్రీనివాస్, వీవీ.రమణ, కసిబిసి నాగేశ్వరరావు, జేసీఐ సభ్యులు పాల్గొన్నారు.

అలా వదిలేశారు!



- వైద్యారోగ్యశాఖ ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు
- వైసీపీ హయాంలో 41 మందికి నిబంధనలకు విరుద్ధంగా కొలువులు
- రెండు నెలలపాటు విచారించి నివేదిక సమర్పించిన అధికారుల కమిటీ
- బుట్టదాఖలు చేసిన ఉన్నతాధికారులు
- అందుకు ప్రతిగా భారీ మొత్తంలో ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు

జిల్లా వైద్యారోగ్యశాఖలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఉద్యోగ నియామకాల్లో అప్పటి అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. ఒక్కో పోస్టుకు రేటు నిర్ణయించి అమ్ముకున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. అందులో విస్తుపోయే అనేక నిజాలు వెలుగు చూశాయి. స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలు 41 మంది అనర్హులకు కట్టబెట్టినట్లు తేలింది. వారి పేర్లను కూడా విచారణ కమిటీ నివేదికలో పొందుపరిచి ఉన్నతాధికారులకు సమర్పించింది. కానీ ఇప్పటి వరకూ చర్యలు కరువయ్యాయి. ఉన్నత స్థాయిలో ఈ ఫైల్‌ను తొక్కిపెట్టినట్లు తెలుస్తోంది. అందుకోసం భారీ మొత్తంలోనే డబ్బులు చేతులుమారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 15 : వైద్యారోగ్యశాఖ అధికారులు గత వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ఉద్యోగాలను సైతం అమ్ముకున్నారు. ముఖ్యంగా 2020లో కరోనా సమయంలో చేపట్టిన అత్యవసర నియామకాల్లో చేతివాటం చూపించారు. 300 పోస్టులకు పైగా భర్తీ చేసిన వారు అందులో కొన్ని పోస్టులను అనర్హులకు కట్టబెట్టారు. దీనిపై అటు కలెక్టర్‌కు, ఇటు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

విచారణకు నలుగురు అధికారులతో కమిటీ

వైద్యారోగ్యశాఖలో ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై గత ఏడాది అక్టోబర్‌లో విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. అప్పటి జడ్పీ సీఈవో జాలిరెడ్డి నేతృత్వంలో నలుగురు అధికారులతో అప్పటి కలెక్టర్ కమిటీని ఏర్పాటు చేశారు. దీంతో రంగంలోకి దిగిన వారు జిల్లా వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాల నోటిఫికేషన్ నాటి నుంచి నియామక పత్రాలు ఇచ్చేంత వరకూ జరిగిన నోట్ ఫైళ్లతోపాటు ఉద్యోగాల కోసం చేసిన దరఖాస్తులను కూడా పరిశీలించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారికి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉద్యోగాల కోసం చేసుకున్న దరఖాస్తులు కనిపించని పరిస్థితుల నుంచి నివేదిక ఇచ్చేంత వరకూ ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు గతేడాది డిసెంబరులో అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్‌కు విచారణ నివేదికను అందజేశారు. స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ నియామకాల్లో 41 మంది అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు పేర్లతో సహా నివేదికలో పొందుపర్చారు. విచారణ నివేదికను పరిశీలించిన అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ చర్యలు తీసుకోవాలని కోరుతూ వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు పంపారు. కానీ ఇప్పటి వరకూ చర్యలు కరువయ్యాయి. అయితే ఈ విచారణ నివేదికను వైద్యారోగ్యశాఖ రాష్ట్ర కార్యాలయంలో పనిచేసే ఒక అధికారి తొక్కిపెట్టినట్లు సమాచారం.

భారీగా చేతులు మారినట్లు ఆరోపణలు

విచారణ నివేదిక ఫైల్‌ను తొక్కిపెట్టడం వెనుక భారీగా చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. తమపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు అప్పట్లో పనిచేసిన అధికారులతోపాటు, ఉద్యోగులు కూడా ఉన్నతాధికారులకు పెద్దమొత్తంలో మామూళ్లను సమర్పించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఉద్యోగ నియామకాల్లో ముగ్గురు డీఎంహెచ్‌వోలతోపాటు ఆరుగురు కార్యాలయ ఉద్యోగుల పాత్ర ఉంది. వీరితోపాటు ఉద్యోగాలు పొందిన 41 మంది అనర్హులు కూడా కలిసికట్టుగా రాష్ట్రస్థాయిలోనే ఫైల్ నిలిచిపోయేలా చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకొనేనా?

గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగ నియామకాల్లో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై కూటమి ప్రభుత్వంలోనైనా చర్యలు ఉంటాయా? లేదా? అన్న చర్చ నడుస్తోంది. ఇటీవల ఈ విషయం అధికార పార్టీ ముఖ్యనేత వద్ద చర్చకు వచ్చినట్లు తెలిసింది. దీనిపై కూటమి నేతలు దృష్టి సారించి వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతోపాటు సంబంధిత మంత్రితో చర్చించి తదుపరి చర్యలు తీసుకొనేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పొన్నలూరు సొసైటీలో భారీ అక్రమాలు



- ఆడిట్‌లో వెలుగు చూసిన ఆర్థిక అవకతవకలు
- మూడు దశాబ్దాలుగా పెండింగ్ బకాయిలు
- అధికారుల నిర్వాకంతో కుదేలు

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 15 : పొన్నలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో భారీగా అక్రమాలు, ఆర్థిక అవకతవకలు, పరిపాలనా పరమైన లోపాలు జరిగాయి. సొసైటీలో లావాదేవీలపై 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఆడిట్‌లో అవి వెలుగుచూశాయి. ప్రారంభ నిల్వ, అంత్య నిల్వల్లో తేడాలు చూపించి లక్షలాది రూపాయాలు గోల్‌మాల్ చేశారు. పాలకవర్గాలు, పర్సన్ ఇన్‌చార్జిలు, సహకారశాఖ అధికారులు, సీఈవోల నిర్వాహకంతో సొసైటీ ఆర్థికంగా కుదేలైంది. మూడు దశాబ్దాల క్రితం సొసైటీ నుంచి తీసుకున్న రుణాలు ఇప్పటికీ వసూలు కాకుండా వాయిదా మీరిన బకాయిలుగా మిగిలిపోయాయి. ఈ రుణాలకు సంబంధించి బాండ్ల కాల పరిమితి కూడా ముగియడంతో అవి ఇక వసూలయ్యే అవకాశం కనిపించడం లేదు. దీంతో సొసైటీ నష్టాల ఊబిలో కూరుకుపోయింది.

ఆర్థిక అక్రమాలు ఇవే..

- సొసైటీ నగదు పుస్తకాల్లో ప్రారంభ, అంత్య నిల్వలు, ఖర్చుల మొత్తాల్లో వ్యాత్యాసంతో రూ.2.35 లక్షలు గల్లంతయ్యాయి.
- సీఈవో జీతాన్ని ఏఎస్‌సీఎఫ్ ఖాతా నుంచి డ్రా చేయాల్సి ఉండగా సొసైటీ నగదు పుస్తకం నుంచి నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్నారు. ఈ ఏడాది జనవరి 29న రూ.65వేలు, ఫిబ్రవరి 28న రూ.62,680 డ్రా చేశారు.
- సొసైటీ షేర్ ధనంలో రూ.3.71 లక్షలు వ్యత్యాసం ఉంది. షేర్ క్యాపిటల్ లిస్టుకు, సొసైటీ చిట్టా పుస్తకంలో జమల వైపు నమోదు చేసిన దానికి వ్యత్యాసం ఉంది. షేర్ క్యాపిటల్ జాబితాలో సభ్యుల జనరల్ నంబర్ లేకుండానే షేర్ క్యాపిటల్ నమోదు చేశారు.
- పీడీసీసీ బ్యాంకు కందుకూరు శాఖకు చెల్లించాల్సిన షేర్ ధనం, చిట్టా పుస్తకంలో ఖర్చులు చూపించిన మొత్తానికి రూ.59,600 తేడా ఉంది. ఈమొత్తం గల్లంతైంది.
- బ్యాంకు కందుకూరు బ్రాంచిలో చెల్లించిన రుణానికి సంబంధించి అసలు, వడ్డీకి సొసైటీ నగదు పుస్తకంలో బ్యాంకుకు చెల్లించిన మొత్తంకు రూ.1.70 లక్షలు తేడా ఉంది.
- సొసైటీలో బినామీ రుణాలున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రైతులకు ఇచ్చిన రూ.8.15 లక్షల స్వల్పకాలిక రుణాలకు సంబంధించి రశీదు పుస్తకాల్లో ఉన్న పేర్లకు, సంఘ చిట్టా పుస్తకంలో నమోదైన పేర్లకు తేడా ఉంది.

మూడు దశాబ్దాలుగా మొండి బకాయిలు

సొసైటీలో మూడు దశాబ్దాలుగా వసూలు కాకుండా నిలిచిపోయిన బకాయిలు అనేకం ఉన్నాయి. 1992లో బట్వాడా చేసిన రుణాలు కూడా ఇప్పటికీ వసూలు కాకుండా మిగిలిపోయాయి. వీటికి సంబంధించిన బాండ్లకు కూడా కాల పరిమితి ముగిసింది. నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక, వ్యవసాయేతర రుణాలకు సంబంధించి బాండు కాల పరిమితి 12 సంవత్సరాలు. అప్పటికి ఆ బకాయిలు వసూలు కాకపోతే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకొనేందుకు ఒక సంవత్సరం గ్రేస్ పీరియడ్ ఇస్తారు ఆతర్వాత ఆ బకాయిలు వసూలు చేసేందుకు సొసైటీకి అధికారం ఉండదు. దీంతో ఆ మొత్తాలను రాని బాకీల పద్దు కింద చే రుస్తారు. స్వల్పకాలిక వ్యవసాయ రుణాలకు అయితే మూడు, నాలుగేళ్లలోపే బాండు కాలపరిమితి ముగుస్తుంది. నిర్ణీత గడువులోపే ఆ రుణాలపై లీగల్ చర్యలు చేపట్టి బకాయిలు రాబట్టాలి. ఆలా చేయని పక్షంలో ఆ బకాయిలను బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్, సంబంధిత క్లర్క్, సొసైటీల పాలకవర్గం, సీఈవోలను బాధ్యులుగా చేసి వారినుంచి రాబడతారు. సొసైటీ సీఈవో, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వసూలు కాని బకాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉండగా నకిలీ పాసుపుస్తకాలు, బినామీ రుణాలు, బాండ్లలో అర్హతకు మించి రుణాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. గడువు లోపు చెల్లించని బకాయిలపై లీగల్ చర్యలు చేపడితే ఈ బాగోతాలు బయటపడతాయన్న భయంతోనే మిన్నకుండిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఏటా ఆడిట్ సమయంలో ఈ అవకతవకలన్నింటిని గుర్తించి నివేదికలు ఇవ్వాల్సి ఉంది. కానీ అది కూడా జరగలేదు. ఇందులో సహకార శాఖ అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.. సహకార సంఘాల చట్టం సెక్షన్ 51 ప్రకారం స మగ్ర విచారణ నిర్వహిస్తే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయి.

ప్రాణం తీసిన వేటగాళ్ల ఎర


మన్నెం వెంకటేశ్వర్లు (ఫైల్)

- విద్యుదాఘాతానికి రైతు మృతి
- అడవి పందుల కోసం కంచె వేసిన వేటగాళ్లు
- భయపడి శవాన్ని బావిలో పడేసిన వైనం

కొండపి, సెప్టెంబరు15: అడవి పందులకోసం వేసిన కంచె ఓ రైతు పాలిటి మృత్యు పాశమైంది. మండలంలోని మూగచింతల గ్రామానికి చెందిన అడవి పందుల వేటగాళ్లు విద్యుత్ కంచెను గ్రామ సమీప పొలాల్లో ఏర్పాటు చేశారు. అది గమనించని రైతు మన్నెం వెంకటేశ్వర్లు (40) శనివారం రాత్రి పొలానికి వెళ్లి విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మరణించాడు. కంచెలో ఓ అడవి పంది, జింక కూడా పడింది. ఎర వేసిన వేటగాళ్లు గమనించి భయపడి రైతు శవాన్ని సుదూరంగా ఉన్న పొలాల్లోని బావిలో పడేశారు. తర్వాత ఏమీ ఎరగనట్టు వారు గ్రామంలోకి వచ్చారు. ఎంతకూ వెంకటేశ్వర్లు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం రాత్రి, ఆదివారం ఉదయం వెతుకులాడి ఆచూకీ దొరక్కపోవడంతో కొండపి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు.

సమస్య జటిలం అవుతుండటంతో వేటగాళ్లు విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేశారు. తాము భయపడి అలా చేశామని వాపోయారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంకటేశ్వర్లును పడేసిన బావిలో నుంచి శవాన్ని వెలుపలకు తీసి ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణబాజీబాబు తెలిపారు.

ధర్మవరంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్


ధర్మవరంలో పరిశీలిస్తున్న సిఐ కృష్ణయ్య

- ఆగని వైసీపీ ఆగడాలు
- టీడీపీ నాయకునికి ఫోన్ చేసి బెదిరింపు
- పార్టీ మండల మాజీ అధ్యక్షుడి కారు అద్దాలు ధ్వంసం

అద్దంకి, సెప్టెంబరు 15 : మండలంలోని ధర్మవరంలో ఆదివారం కూడా పోలీస్ పికెట్ కొనసాగుతుంది. ధర్మవరంలో శుక్రవారం రాత్రి టీడీపీ వర్గీయుల వినాయక విగ్రహం నిమజ్జన ఊరేగింపు సందర్భంగా వైసీపీ వర్గీయులు రెచ్చిపోయి విద్యుత్ సరఫరా నిలిపి వేసి రాళ్ళు, కర్రలతో దాడి చేయడంతో 12 మంది టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. అనంతరం టీడీపీ వర్గీయులు కోపంతో వైసీపీ వర్గీయుల ఆస్తులను ధ్వంసం చేశారు. అయితే అప్పటికే పోలీస్ లు ధర్మవరం చేరుకోవడంతో భారీ ఆస్తి నష్టం జరగకుండా నివారించగలిగారు. ఎలాంటి గొడవలు జరుగకుండా ఉండేందుకు పోలీస్ పికెట్‌ను కొనసాగిస్తున్నట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. ధర్మవరంలో ఆదివారం సీఐ పరిశీలించారు.

వైసీపీ వర్గీయుల ఆగడాలు

ఒక వైపు వైసీపీ వర్గీయుల దాడులతో టీడీపీ కార్యకర్తలు 12 మంది గాయపడి వైద్యశాలలలో చికిత్స పొందుతుండగా, పోలీస్ పికెట్ కొనసాగుతున్నప్పటికీ ధర్మవరం వైసీపీ నాయకులకు మద్దతుగా శంఖవరప్పాడుకు చెందిన వైసీపీ శ్రేణులు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ధర్మవరానికి చెందిన టీడీపీ నేత చాగంటి రాజేంద్రకు శంఖవరప్పాడు(రెడ్డిపాలెం)కు చెందిన పలువురు వైసీపీ శ్రేణులు శనివారం రాత్రి ఫోన్ చేసి బెదిరించడం, తమ గ్రామంలో గుండా ఎలా వెళ్తావో చూస్తామని, చంపుతామని కూడా హెచ్చరించినట్లు తెలుస్తుంది. ఈ విషయాలను రాజేంద్ర పోలీస్ అధికారుల దృష్టికి తీసుకు పోవటంతో ఒకింత అప్రమత్తమై పోలీస్‌లు శంఖవరప్పాడు వెళ్లి హెచ్చరికలు చేశారు. రాజేంద్రను బెదిరించిన విషయం తెలుసుకున్న పలు గ్రామాల టీడీపీ నాయకులు వెంటనే శంఖవరప్పాడు వెళ్లేందుకు సిద్ధం కాగా సీఐ కృష్ణయ్య వారించడంతో ఆగిపోయినట్లు తెలుస్తుంది. అదే సమయంలో శనివారం రాత్రి శంఖవరప్పాడుకు చెందిన టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డికి చెందిన కారు అద్దాలు కూడా ధ్వంసం కావడం కూడా చర్చనీయాంశంగా మారింది. వైసీపీ శ్రేణులే అద్దాలు పగుల గొట్టి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ అధికారులు మరింత కఠినంగా వ్యవహరించకపోతే ఫ్యాక్షన్ రాజకీయాలు పెరిగే అవకాశం కూడా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా


పోలీసుల అదుపులో ఉన్న అక్రమ ఇసుక ట్రాక్టర్లు

- అధికారులకు సవాల్‌గా మారుతున్న అక్రమార్కులు

చీరాల, సెప్టెంబరు 15 : ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. అక్రమార్కులు అధికారులకు సవాల్‌గా మారుతున్నారు. ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తున్నారు. చీరాల మండలం ఈపురుపాలెం పోలీసులు శనివారం అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. చీరాల మండలం గవినివారిపాలెంకు చెందిన బుర్ల సాంబశివరావు, పుల్లాయిపాలెంకు చెందిన నక్కల ఏసోబు రెండు ట్రాక్టర్లతో ఇసుమను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. నక్కల శ్రీను అనే వ్యక్తికి చెందిన పొలం నుంచి ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్న క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్లను, ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందురోజు కీర్తివారిపాలెంకు చెందిన నర్రా బ్రహ్మయ్యపై ఇసుక అక్రమ తవ్వకం, రవాణాపై కేసు నమోదైంది. ఒక వైపు అధికారులు నిఘా పెడుతున్నా వారి కళ్లుగప్పి అక్రమార్కులు తమపని చక్కపెట్టుకుంటున్నారు.

నామమాత్ర చర్యలే కారణం

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి పట్టుబడ్డ వారిపై తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉండడంతో ఒకరిని చూచి మరొకరు ఆ దందా సాగిస్తున్నారు. పట్టుబడ్డ వాహనాలు, డ్రైవర్లపై పటిష్టమైన చర్యలు చేపడితే మరొకరు అలాంటి చర్యలకు పాల్పడకుండా ఉంటారు. విధించే జరిమానాల మొత్తం కూడా భారీగా ఉండాల్సిన అవసరం ఉంది. అప్పుడే అక్రమార్కులు వెనకడుగు వేస్తారు.

పోలీస్, రెవెన్యూ సంయుక్త తనిఖీలు

ఇసుక అక్రమార్కులు అంతిమంగా స్ర్టయిట్‌కట్ కరకట్టలను కూడా వదలకుండా తవ్వకాలు సాగించడం పరాకాష్ట. ఈ క్రమంలో ఏఎస్పీ విఠలేశ్వర్, ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, చీరాల మండల తహసీల్దార్ గోపికృష్ణ, రూరల్ సీఐ సత్యనారాయణ ఇతర అధికారులు, సిబ్బంది కరకట్టలను తవ్విన ప్రదేశాలను ఒకటికి, రెండు పర్యాయాలు పరిశీలించారు. అక్రమార్కులకు హెచ్చరికలు జారీ చేశారు.

ఇప్పటికి కొందరిని గుర్తించారు. మరికొందరిని గుర్తించాల్సి ఉంది. బాధ్యులపై చర్యలు చేపడితేనే మరొకరికి భయం ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

19లోపు పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 15: ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభు త్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 19వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కళ్యాణి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీపీజీసెట్-24 రెండు, తుదిశ దశ వెబ్ ఆధారిత నమోదు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్, బీసీఏ డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వెబ్ ఆప్షన్లు ఈనెల 23 నుంచి 25లోపు చేసుకోవాలని, వెబ్‌ఆప్షన్ల మార్పు ఈనెల 26న, సీట్ల కేటాయింపు 28న జరుగుతుందని, 30వ తేదీలోపు కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గంగమ్మ ఒడికి గణపతి


మోటుపల్లి తీరంలో గంగమ్మ చెంతకు చేరిన కడవకుదురు గణనాథుడు

- కోలాహలంగా నిమజ్జన వేడుకలు
- విఘ్నాలు లేకుండా అందరికీ మంచి జరగాలి
- ఎమ్మెల్యే కొండయ్య

అన్ని మండలాల్లోని గ్రామాల్లో వినాయక చవితి నవరాత్రులు వైభవంగా ముగిశాయి. ఆదివారం పెద్ద సంఖ్యలో గణనాథులను భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడికి చేర్చారు.

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 15 : విఘ్నాలు లేకుండా ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య గణనాథుడిని వేడుకున్నారు. మండల పరిధిలోని కొత్తపేట శ్రీనివాసపురంలో ఏర్పాటు చేసిన వినాయకుని పందిరిలో ఆదివారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. స్వామివారికి హారతులు ఇచ్చి పూజలు చేశారు. అనంతరం రావూరిపేటలో జరుగుతున్న గణపతి నవరాత్రుల ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్ని అన్నదానంను ప్రారంభించారు. తదనంతరం శ్రీకనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రికి చీరాల పట్టణంలోని ఎంజీసీ మార్కెట్‌లోని వినాయక పందిరిలో, నల్లగాంధీ బొమ్మ సెంటర్లో ఏర్పాటు చేసిన వినాయక పందిరిలో తదితర చోట్ల పూజా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీల సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సందడే సందడి

అద్దంకి : వినాయక వి గ్రహాల నిమజ్జనోత్సవాల ఊరేగింపులతో ఆదివారం అద్దంకి పట్టణంలో సందడి గా మారింది. అద్దంకి పట్టణంలోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాల ఊరేగింపులు ఆదివారం పెద్ద ఎత్తున జరిగాయి. అద్దంకి పట్టణంలోని శ్రీనగర్, కాకానిపాలెం, రామ్‌నగర్, గాజులపాలెం, గాంధీబొమ్మసెంటర్, శ్రీరామ్‌నగర్ ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహాలను అద్దంకి పట్టణంలో ఊరేగింపు చేసి గుండ్లకమ్మ నదిలో నిమజ్జనం చేశారు. మహిళలు, యువకులు , చిన్నారులు గులాములు కొట్టుకుంటూ ఉత్సాహం గా పాల్గొన్నారు.

బల్లికురవ, సెప్టెంబరు 15 : మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం గణేష్ నిమజ్జన వేడుకలు కోలా హలంగా జరిగాయి. మండలంలోని ముక్తేశ్వరంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రమం వద్ద ఎస్ఐ జీవీ చౌదరి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నక్కబొక్కలపాడు, కొత్తపాలెం, కొణిదెనగ్రామాలలో గణేష్ నిమజ్జన వేడుకలు వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా ప్రత్యేక డప్పు వాయిద్యాలను ఏర్పాటు చేసి యువత నృత్యం చేశారు. అనంతరం సమీపంలో ఉన్న ఏబీసీ కాలువలో గణనాధుడిని నిమజ్జనం చేశారు.

బైబై గణేశా

చినగంజాం : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు ఆదివారం మోటుపల్లి, బాపయ్యనగర్, పెదగంజాం సముద్రతీర ప్రాంతాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు సందడిగా సాగాయి. కడవకుదురు గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద, తోటవారిసెంటర్‌లో పూజలు అందుకున్న గణనాథులు శనివారం రాత్రి నిమజ్జనానికి పయనమయ్యారు. నృత్యాలతో, బాణసంచా పేలుళ్లతో గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. కడవకుదురు, చినగంజాం, సంతరావూరు తదితర గ్రామాల్లో లంబోదరుడికి పూజలు నిర్వహించి, నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల్లో లడ్డుప్రసాదాలను వేలం వేశారు. మోటుపల్లి, బాపయ్యనగర్, పెదగంజాం సముద్ర తీరంలో మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులతో పాటు చుట్టుప్రక్కల మండలాలపరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. సముద్ర తీర ప్రాంతాలల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు

పంగులూరు : మండపాలలో కొలువుదీరిన గణనాధుని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందచేశారు. పంగులూరులోని బొబ్బగుంటలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద పూజా కార్యక్రమాలు చేపట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భగవాన్‌రాజుపాలెం, చందలూరు గ్రామాలలో గణనాధుని నిమజ్జన ఊరేగింపు ఉత్సవాలు మేళతాళాలతో, బాణసంచా కాల్చుతూ ఘనంగా నిర్వహించారు. పంగులూరులోని బొబ్బగుంట మండపం వద్ద ప్రసాదం లడ్డూ వేలం నిర్వహించారు.

ప్రత్యేక ఆకర్షణగా జాగర్లమూడి వినాయకుడు

పర్చూరు : జై జై గణేష అంటూ వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలు పర్చూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. డీజేలు, డప్పు వాయిద్యాలు, బాణసంచాలతో పర్చూరు బొమ్మల సెంటర్ కూడలి హోరెత్తింది. ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలు పర్చూరుకు చేరడంతో ప్రధాన రహదారుల కూడలి జనసంద్రంగా మారింది. స్వామివారి విగ్రహాలను అలంకరించి ప్రత్యేక వాహనాల్లో నిమజ్జనానికి చీరాల వాడరేవు తరలించారు. యద్దనపూడి మండలం పెద్ద జాగర్లమూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వాహనంపై ఎన్టీఆర్ కాంశ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూలతోరణాలతో సుందరంగా అలంకరించిన దృశ్యం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. పర్చూరులోని తూర్పువారి వీధి, పడమటి వీధి, రామాలయం, కొట్లబజారు, బోడవాడ తదితర ప్రాంతాల లోని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల భరతనాట్యం

అద్దంకి మాన్యంలో శ్రీ బాల గణేషుని విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ శాతవాహనా హైస్కూల్ సౌజన్యంతో నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన అందరినీ అలరించింది. అనంతరం చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా స్వామి లడ్డూ ప్రసాదాన్ని వేలంపాట పాడి పోట్రు శ్రీనాథ్ చౌదరి రూ.22,516కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న, సందీప్ తేజ, తోట మణి, సిగనం భాస్కర్, మాజీ వైస్ సర్పంచ్ తులసి రాజా పాల్గొన్నారు.

నోట్ల అలంకరణ

మార్టూరు : మండలంలోని వలపర్ల గ్రామంలో ఆర్య వైశ్యులు ఏర్పాటుచేసిన వినాయకుని బొమ్మకు ఆదివారం లక్షా20వేల రూపాయల కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. మండపంలో 500 నోట్లు, 100 నోట్లు తదితర నోట్లతో స్వామి వారిని అందంగా అలంకరణ చేశారు. భక్తులు ప్రత్యేకంగా పూజాకార్యక్రమాలను చేశారు. సాయంత్రం స్వామి వారిని గ్రామంలో ఊరేగింపుచేసి, సాగర్ కాలువకు తరలించి నిమజ్జనం చేశారు.





నిమజ్జనానికి తరలిన జాగర్లమూడి వినాయకుడు, అద్దంకిలో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, మార్టూరులో నోట్ల అలంకరణలో గణపతి, పర్చూరులో చిన్నారుల నృత్య ప్రదర్శన


ఎమ్మెల్యే కొండయ్యకు విరాళాలను అందజేస్తున్న దాతలు

వరద బాధితులకు సహాయం

ఎమ్మెల్యే కొండయ్యకు విరాళాలు అందజేసిన దాతలు

చీరాల, సెప్టెంబరు 15 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం పలువురు విరాళాలను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆదివారం అందజేశారు. మురళీకృష్ణమూర్తి రూ.15,116, జి.రమేష్ రూ.10,116 అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య వారికి కృతజ్ఞతలు తెలిపారు. బాధల్లో ఉన్నవారికి ఓదార్పు, మనవంతు సాయం అందించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహారం అందజేత

బల్లికురవ, సెప్టెంబరు 15 : విజయవాడ సింగునగర్ వరద బాధితులకు ఆదివారం బల్లికురవ మండలం కూకట్లపల్లి ఎస్సీ కాలనీవాసులు ఆహార ప్యాకెట్లను అందజేశారు. వారు మాట్లాడుతు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపు మేరకు బాధితులకు తమవంతు చేయుత ఇచ్చేందుకు విరాళాలు సేకరించి ఆ నగదుతో రెండు వేల బిర్యానీ ప్యాకెట్లను అందజేసినట్లు తెలిపారు.

20న జాబ్ మేళా

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మజీరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు మాస్టర్‌మైండ్స్, కళామ్ టెక్నిక్స్, కేఎల్ గ్రూప్ (అమెజాన్), కంపెనీలు హాజరవుతాయని, 90కి పైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. జీతం విద్యార్హతను బట్టి సుమారు 10వేల నుంచి 18 వేల వరకు ఉంటుందన్నారు. ఈ జాబ్ మేళాకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీఎస్‌సీ (కెమిస్ట్రీ), ఎంఎస్సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ పీజీ విభాగాలకు చెందిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతి, యువకులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్టు ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9440635677, 7989697996, టోల్ ఫ్రీ నెంబర్ 9988853335 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

బల్లికురవ, సెప్టెంబరు 15 : ఎలాంటి ఘర్షణలు జరగకుండా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా అయన వారితో మాట్లాడుతూ ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. రౌడీషీటర్ల బయటకు వెళితే సమాచారం ఇవ్వాలన్నారు. ఘర్షణలలో పాల్గొన్నా, ప్రోత్సహించినా నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పాల వ్యాన్ బోల్తా

బల్లికురవ, సెప్టెంబరు 15 : మండల పరిధిలోని బల్లికురవ - మార్టూరు అర్‌అండ్‌బీ రోడ్డులో ఆదివారం గోతులను తప్పించ బోయి పాల వ్యాను బోల్తా కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, వ్యాను వెల్లకిలా పడింది. అందిన సమాచారం మేరకు.. గుంటూరు జిల్లా నుంచి పాలు తీసుకుని బల్లికురవ మండల కేంద్రానికి వస్తున్న పాల వ్యాను నక్కబొక్కలపాడు వద్దకు వచ్చే సరికి గోతుల రోడ్డు వలన తప్పించే క్రమంలో మార్జిన్‌లోకి వాహనం పల్టి కొట్టింది. ప్రమాద సమయంలో వాహనం లోపల పాల ప్యాకెట్ల లోడ్ ఉంది. వెంటనే స్థానికులు గమనించి డ్రైవర్‌ను బయటకు తీశారు. అనంతరం మరో వాహనం తీసుకు వచ్చి పాల ప్యాకెట్లను గ్రామాలకు తీసుకు వెళ్లారు. గోతుల రోడ్డు వలనే ప్రమాదం జరిగిందని, రోజూ వాహనాలు ఇలానే బోల్తా కొడుతున్నాయని ప్రయాణికులు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు

చెరుకూరు(పర్చూరు), సెప్టెంబరు 15: మండలం చెరుకూరు గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో 8మందికి తీవ్ర గాయాలయ్యాయి. పిచ్చికుక్క మూకుమ్మడిగా దాడిచేసి గాయపరచడంతో ప్రజలు ఒకింత ఆందోళనకు గురి అయ్యారు. పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలతోపాటు బాపట్ల ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒకే రోజు కుక్కల దాడిలో పెద్ద ఎత్తున ప్రజలు గాయాలు పాలు కావటంతో ఇంటి నుంచి చిన్నారులు బయటకు రావాలంతే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో ప్రస్తుత పరిస్థితి నేపథ్యంలో ప్రజలు కుక్కల బెడదతో ఆందోళన చెందుతున్నారు.

టీడీపీ యువనేతపై వైసీపీ నాయకుడి దాడి


ఆసుపత్రిలో ఉన్న వినోద్

బల్లికురవ. సెప్టెంబరు 15 : పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని ఉప్పుమాగులూరు గ్రామ టీడీపీ నేత అమరనేని వినోద్‌పై అదే గ్రామానికి చెందిన దేవినేని కృష్ణ అను వైసీపీ నేత బీరు సీసాతో దాడి చేసిన ఘటన ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. ఉప్పుమాగులూరుకు చెందిన టీడీపీ యువనేత వినోద్ వేమవరం జంక్షన్‌లో దుకాణంలో ఉండగా, అక్కడికి వచ్చిన వైసీపీ నేత దేవినేని కృష్ణతో వాదన జరిగింది. దీంతో వినోద్‌ను సీసాతో దాడి చేయగా తలకు బలమైన గాయం కావడంతో వెంటనే గుంటుపల్లి వైద్యశాలకు తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఈపూరుపాలెంలో మూడు కేసులు నమోదు

చీరాలటౌన్, సెప్టెంబరు 15 : ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మూడు కేసులు నమోదు చేశారు. కావూరివారిపాలెంకు చెందిన పిట్టు రవీంద్రరెడ్డి తన భార్య అమ్మమ్మపై దాడికి పాల్పడడంతో ఆమె గాయపడింది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అలాగే పిట్టువారిపాలెంకు చెందిన ఓ వ్యక్తి అదే గ్రామంలోని ఓ ఇంట్లోకి అక్రమంగా రాత్రి సమయంలో చొరబడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అంతేకాకుండా వాడరేవులో భర్త వేదిస్తున్నాడని భార్య ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ యోగాకు చందలూరు విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో పీడీ

పంగులూరు, సెప్టెంబరు 15 : మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 14, 15 తేదీలలో ఏపీ యోగాసనం, స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో విశాఖ యోగా స్పోర్ట్స్ అసోషియేషన్ నిర్వహించిన 49వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు పా ల్గొన్నారు. 12 నుంచి 14 సంవత్సరాల విభాగంలో జరిగిన యోగాసన పోటీలలో పాల్గొన్న పాఠశాల ఏడవ తరగతి విద్యార్థిని శ్రుతి, మంగిశెట్టి వెంకటేష్ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఎంపికయ్యారు. ఈ ఇద్దరు విద్యార్థులు యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అక్టోబర్ 22న హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ కొండా ప్రతిమ తెలిపారు. ఈ సందర్భంగా శ్రుతి, వెంకటేష్, పీడీ ప్రతిమను ఎస్ఎంసీ చైర్మన్ గొట్టిపాటి హరికృష్ణ, హెచ్ఎం చందలూరి గిరిజ, అజిత్‌కుమార్, ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, గ్రామ పెద్దలు పెంట్యాల రామలింగస్వామి, అడ్డగడ సుబ్బయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.


ఏఈ బాలకోటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

ఘనంగా ఇంజనీర్స్ డే

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ వి.బాలకోటేశ్వరరావు నివాసంలో ఏఈవో కలిసి రోటరీ క్లబ్ సభ్యులు కేట్ కట్ చేశారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతికి చేసిన సేవలను కొనియారు. ఇంజనీర్స్‌గా ఆయా రంగాలలోని వ్యక్తులు అందిస్తున్న సేవలను సభ్యులు కొనియాడారు. గతంలో మానవుడికి రోటి, కపడా, మకాన్ అనేవి మూడు తప్పని అవసరాలు అయితే ప్రస్తుతం మానవుడికి విద్యుత్ కూడా నాల్గవ నిత్యసరమయిందని ఏఈ బాలకోటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా బాలకోటేశ్వరరావు దంపతులను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, కార్యదర్శి చుండూరి మురళిసుధాకరావు, కోశాధికారి మలాది శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చౌదరి సేవలు ఎనలేనివి

చీరాలటౌన్, సెప్టెంబరు 15 : ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి తనదైన సేవలు అందించిన పీవీఆర్ చౌదరి సేవలు ఎనలేనివని సీపీఐ నాయకులు అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయలంలో ఒంగోలు సీపీఐ పట్టణ కార్యదర్శి చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అకాల మరణంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, మేడా వెంకటరావు, కోటి దాసు, బాబురావు, సైదయ్య, ప్రకాష్, వీరాంజనేయులు, పున్నారావు, షరీఫ్ పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మృతికి సంతాపం

ఇంకొల్లు, సెప్టెంబరు 15 : మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన సుపరిచితుడైన ముళ్ల నాగేశ్వరరావు(66) మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. నాగేశ్వరరావు యుక్త వయస్సులో కమ్యునిస్టు పార్టీలో చేరి పనిచేశారు. అనంతరం ది విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సెక్రటరీగా ఉన్నారు. గంగవరంలో సొంత స్థలంలో దాతల సహకారంతో వెంకటేశ్వస్వామి దేవాలయాన్ని నిర్మించారు. ఆయన మృతి పట్ల ఆదివారం పలువురు సంతాపం తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు ఎక్స్‌కవేటర్

మార్టూరు, సెప్టెంబరు 15 : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గ్రావెల్ కొండలో అక్రమంగా గ్రావెల్‌ను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను గ్రామ వీఆర్‌వో అదుపులోకి తీసుకున్న సంఘటన ఆదివారం జరిగింది. వీఆర్‌వో స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు గ్రావెల్ కొండ వద్దకు చేరి ఎక్స్‌కవేటర్‌ను స్టేషన్‌కు తరలించారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు

చీరాలటౌన్, సెప్టెంబరు 15 : అక్రమంగా రెండు ఇసుక ట్రాక్టర్‌లు రవాణా సాగిస్తుండడంపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ భూషణం తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం వైపు నుంచి జాతీయ రహదారిలో మన్నం అపార్ట్‌మెంట్ వైపు వస్తున్న ట్రాక్టర్‌లపై దాడులు నిర్వహించారు. అలాగే రెండింటిపై కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

నాయుడమ్మను పరామర్శించిన బలరాం

ఇంకొల్లు, సెప్టెంబరు 15 : ఇంకొల్లుకు చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కొల్లూరి నాయుడమ్మను మాజీ ఎమ్మెల్యే కరణం బలరాంకృష్ణమూర్తి పరామర్శించారు. కొల్లూరి నాయుడమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురికావడంతో ఇంకొల్లులో స్వగృహంలో ఉన్న నాయుడమ్మను బలరాంతో పాటు పలువురు ప్రముఖులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట పున్నయ్యచౌదరి, హనుమయ్య, హరిబాబు ఉన్నారు.

ఔషధ మొక్కల పంపిణీ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 : స్వయం జ్యోతి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కల బోర్డు సహకారంతో ఆదివారం బొమ్మనంపాడు, చెరువుకొమ్ముపాలెం గ్రామాలలోని రైతుల, మహిళలకు ఉచితంగా ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. ఎర్రచందనం, రణపాల, ఉసిరి, తమలపాకు, ఇన్సూలిన్ ప్లాంట్, నల్లేరు, నిమ్మగడ్డి వంటి మొక్కలను రైతులకు అందజేశారు. ఔషధ మొక్కలు ఉపయోగాలను ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి వాటిని పెంచుకోవాలని బి. కీర్తన తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ కిరణ్‌చంద్, శర్మ లు వివిధ రాష్ట్రాలల్లో, ఇతర దేశాలలో ఔషధమొక్కల గిట్టుబాటు ధర, డిమాండ్‌లను, కంపెనీల అడ్రస్‌లను రైతులకు అందజేశారు.

మంత్రి ఆదేశించినా.. కదలని మున్సిపల్ అధికారులు


అద్దంకిలోని ఆయిల్ మిల్ రోడ్డు వద్ద మురుగుతో నిండిన ఎన్నెస్పీ కాలువ

- మురుగు పారుదల పై సారించని దృష్టి
- వ్యాధులు వచ్చే అవకాశం
- ఆందోళనలో ప్రజలు

అద్దంకి, సెప్టెంబరు 15 : సాగు నీరు పారాల్సిన ఎన్ఎస్‌పీ కాలువ కాస్తా అద్దంకి పట్టణం విస్తరించడంతో మురుగు కాలువగా మారింది. అయితే మురుగు నీరు పారుదల లేకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితం ఆయిల్ మిల్ రోడ్డులో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మురుగును చూసి ఒకింత ఆశ్చర్యపోయారు. వెంటనే మురుగు పారుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు మాత్రం మురుగు నీరు పారుదలపై దృష్టి పెట్టకుండా మొక్కుబడి చర్యలు తీసుకున్నారు. దీంతో మరలా యథావిధిగా మురుగు నీరు నిలిచే ఉంది. గతంలో ప్రతి ఏటా ఒక సారి ఆయిల్ మిల్ రోడ్డు వద్ద నుంచి రామ్‌నగర్ గ్యాస్ గోడౌన్ వరకు కాలువ పూడిక తీత చేస్తుండడంతో కొంత మేర మురుగు నీరు పారేవి. అయితే గత రెండు సంవత్సరాలుగా కాలువ పూడిక తీత చేపట్టకపోవటంతో మురుగు నీరు అసలు ముందుకు కదలకుండా నిలిచిపోయాయి. పలు చోట్ల మురుగు నీరు పారుదలకు అవకాశం లేకుండా కాలువను స్థానికులు ఆక్రమించి ఎత్తులేపడంతో మురుగు నీటికు ఆటంకం ఏర్పడింది. దీంతో దుర్వాసన మరింత పెరిగిపోయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఎన్ఎస్‌పీ కాలువ కట్టను మినీ బైపాస్ రోడ్డు గా అభివృద్ధి చేసే ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున ఈ లోపుగా కనీసం తాత్కాలికంగానైనా మురుగు నీరు పారుదల జరిగే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. మంత్రి రవికుమార్ ఆదేశించినా మున్సిపల్ అధికారులు మొక్కుబడి చర్యలతో సరిపెట్టడం పట్ల స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లీజుకు మార్టూరు ఆర్టీసీ బస్టాండ్

మార్టూరు,సెప్టెంబరు 15 : ఎంతో కాలం నుంచి బస్సులు రాక, ప్రయాణికులు వెళ్లకుండా ఖాళీగా ఉన్న మార్టూరు ఆర్‌టీసీ బస్టాండును లీజుకు ఇచ్చేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్నట్లు ఆదివారం అద్దంకి ఆర్‌టీసీ డీఎం రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టీసీ బస్టాండులో ఖాళీగా ఉన్న 3792 చ గజాలు ప్రదేశాన్ని 15 ఏళ్లకు లీజు పద్ధతిలో ఇవ్వడానికి టెండరుదారులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 29వ తేదీ లోపు ఆన్ లైన్‌లో దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30 వతేదీ ఉదయం 10.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు జోన్ 3, ఈడీ ఆఫీస్, నెల్లూరు కార్యాలయంలో టెండరు బాక్సులో వేయాలని రామ్మోహనరావు తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలో టెండర్లును ఓపెన్ చేస్తామన్నారు. అదేవిదంగా స్థలాలు లీజుకు తీసుకునేవారికి అవగాహన కోసం ఈ నెల 21న ఉదయం 11 గంటలకు చీరాల ఆర్‌టీసీ బస్టాండు నందు ఏఎం (టి) ఆఫీసులో అవగాహనా సదస్సును ఏర్పాటు చేశామని తెలిపారు.


విజేతలుగా నిలిచిన మండలానికి చెందిన ఉపాధ్యాయులు

సత్తాచాటిన ఉపాధ్యాయులు

మార్టూరు, సెప్టెంబరు 15 : యూటీఎఫ్ యాభై ఏళ్ల స్వర్ణోత్సవాలు సందర్భంగా శనివారం చీరాలలో ఉపాధ్యాయులకు జరిగిన ఆటల పోటీలలో మార్టూరు డివిజన్‌కు చెందిన ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారు. మార్టూరు మండలానికి చెందిన ఉపాధ్యాయులు పలు పోటీలలో విజేతలుగా నిలిచారు. మండలానికి చెందిన ఉపాధ్యాయుడు కే జాకబ్ వంద మీటర్లు, 200 మీ.ల పరుగు పందెంలో ద్వితీయ స్థానాన్ని, షాట్ పుట్‌లో రెండవ స్థానాన్ని, జావెలిన్‌త్రోలో మొదటి స్థానాన్ని సాధించారు. అదేవిధంగా పీ జానీబాషా షాట్‌పుట్‌లో ప్రథమ స్థానాన్ని, జావెలిన్ త్రోలో రెండవ స్థానాన్ని పొందారు. చెస్ పోటీలలో ప్రథమ స్థానాన్ని జీ రామకోటేశ్వరరావు, క్యారమ్స్ డబుల్స్‌లో జిలాని, ప్రశాంత్ మొదటి స్థానాన్ని, షటిల్ డబుల్స్‌లో జాకబ్, జానీబాషా మొదటి స్థానాన్ని సాధించారు. ఈ పోటీలలో విజేతలైన వారందరూ వచ్చే నెల 4,5,6 తేదీలలో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. ప్రతిభ చూపిన వారిని ఆదివారం మార్టూరులో యూటీఎఫ్ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో సునీల్‌కుమార్, ప్రతాప్, ఆదినారాయణ, రవిబాబు, అన్నపూర్ణాదేవి, మౌలాలి, ఈశ్వరప్రసాద్ పాల్గొన్నారు.


టెన్త్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఇంకొల్లు, సెప్టెంబరు 15 : పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక అందరినీ ఆనందపరశంలో ముంచింది. 44 సంవత్సరాల కిందట 1981వ సంవత్సరంలో ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ప్రస్తుతం వివిధ వృత్తులలో స్థిరపడ్డారు. వారంతా ఒకే వేదికపై కలవడం అభినందనీయమని విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1981లో పదవ తరగతి చదివిన విద్యార్థులందరూ కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వ విదార్థులు కాశీవిశ్వనాథం, సత్యనారాయణ, బ్రహ్మం, వలిని ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి అజయ్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు షేక్ మస్తాన్‌వలి, చుండూరి శివరామకృష్ణ, ప్రవాసాంధ్రుడు కరి సుబ్బారావు, తూమాటి శ్రీనివాసరావు, పొన్నగంటి సుధారాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని తీర్మానం

మార్టూరు, సెప్టెంబరు 15 : మార్టూరు గ్రామంలో పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మార్టూరు కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఆదివారం మార్టూరులో సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం మార్టూరు గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు సీహెచ్, మజుందార్, మండల కమిటీ నాయకులు బత్తుల హనుమంతరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మార్టూరులో డ్రైనేజీ సమస్యలను, తాగునీటిని కుళాయిల ద్వారా ప్రతిరోజు ఇవ్వాలని, జాతీయరహదారి పక్కన సర్వీసు రోడ్లను బాగుచేయాలని, బోర్ల రిపేరు, ఇంకా తదితర సమస్యలను పరిష్కరించాలని తీర్మానం చేశారు. అనంతరం మార్టూరు గ్రామ కార్యదర్శిగా వైరాంబాబును ఏక గ్రీవంగా ఎంపిక చేశారు.

- జలాశయాల్లోకి నీరొచ్చిందని సంతోషం
- సాగునీటి కాలువల్లో పూడికతీయలేదని వేదన
- సోమశిలలో 50 టీఎంసీల నీరు
- పూర్తి ఆయకట్టులో సాగుకు అవకాశం
- ఓఅండ్ఎం పనులకు రాని అనుమతులు
- సీజన్ సమీపిస్తుండడంతో రైతుల ఆందోళన

ఇటు ఆనందం.. అటు ఆవేదన !

నెల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రానున్న సీజన్‌కు సరిపడా నీరు శ్రీశైలం నుంచి సోమశిలకు చేరింది. దీంతో ఓ వైపు రైతుల ముఖాల్లో సంతోషం కనిపిస్తోంది. అదే సమయంలో మరోవైపు కాలువల్లో పూడికతీతకు ఇంకా అనుమతులు రాకపోవడంతో ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. సోమశిలలో నీటి నిల్వ 50 టీఎంసీలకు చేరింది. దీంతో రానున్న సీజన్‌లో పూర్తి ఆయకట్టు 5.50 లక్షల ఎకరాల్లో సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అయితే ఓఅండ్ఎం పనులకు ఇంత వరకు అనుమతులు రాలేదు. అవి వస్తే కానీ కాలువలను బాగుచేయడం సాధ్యపడదు. అక్టోబరు నుంచి కాలువలకు నీరు విడుదల చేయాల్సి ఉంటుంది.

● రైతులపై కక్షకట్టిన వైసీపీ ప్రభుత్వం

రైతులపై కక్షగట్టినట్లుగా వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది. కనీసం కాలువలను కూడా పట్టించుకోకపోవడంతో పూడిక, గుర్రపు డెక్కతో నిండిపోయాయి. గత రెండేళ్లుగా ఓఅండ్ఎం పనులు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు చేసుకున్నారు. ఈ ప్రభావం సాగుపై పడింది. కాలువల్లో స్థాయికి తగ్గట్లు నీటి పారుదల జరగకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందలేదు. ఏటా సీజన్ మొదలై కాలువల్లో నీరు పారుతున్న సమయంలో ఓఅండ్ఎం అనుమతులు ఇవ్వడం, ఆ తర్వాత పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు రికార్డు చేయడం రివాజుగా మారింది. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో ఈ దఫానైనా కాలువలను బాగు చేయా లని రైతులు కోరుతున్నారు. కానీ సీజన్ దగ్గర పడుతున్నా ఇంత వరకూ ఓఅండ్ ఎం పనులకు అనుమతులు రాకపోవడం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. వచ్చే నెల నుంచి సీజన్ మొదలవుతుంటే ఇక అప్రూవల్స్ ఎప్పుడు ఇస్తారు..? టెండర్లు ఎప్పుడు పిలుస్తారు ? పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు..? అంటూ రైతులు మథనపడుతున్నారు.

● ప్రతిపాదనలకు మోక్షమేది ?

జిల్లా నుంచి ప్రతిపాదనలు వెళ్లి దాదాపు రెండు నెలలు కావస్తోంది. కానీ ఇంతవరకు ఫైనాన్స్ అప్రూవల్ రాలేదు. ప్రస్తుతం ఉన్న స్థితిలో కాలువ లను పూర్తిస్థాయిలో బాగు చేయా లంటే సుమారు రూ.110 కోట్లు అవసరమని జిల్లా నుంచి ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రతిపాదించారు. సాధారణంగా ఏటా ఓఅండ్ ఎం పనులకు రూ.30 కోట్లలోపే సరిపోతాయి. కానీ రూ.110 కోట్లు ప్రతిపాదించారంటే వైసీపీ ప్రభుత్వంలో ఏ స్థాయిలో కాలువలను నాశనం చేశారో అర్థం చేసుకోవచ్చు. అయితే శిస్తు వసూలు జరగకుండా అంత పెద్ద మొత్తం ఓఅండ్ఎం కింద ఇవ్వడం సాధ్యపడదని నిర్ధారించిన రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ సీజన్‌కు రూ.40 కోట్లతో ఓఅండ్ఎం ప్రతిపాదనలు పంపా లని, ఆ నిధులతో అత్యవసర పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఆ మేరకు అన్ని డివిజన్ల నుంచి ప్రభుత్వానికి ప్రతిపా దనలు అందాయి. అక్టోబరు నుంచి వ్యవసా య పనులు ప్రారంభం కానున్నాయి. రైతులు దుక్కులు దున్నడం మొదలు పెడతారు. దీంతో కాలువలు, చెరువులకు నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. అప్పుడు పూడికతీత పనులు చేయడం కష్టమవుతుంది. ఈ లోపు పనులు పూర్తి చేస్తేనే చివరి ఆయకట్టు రైతాంగానికి ఇబ్బందులు లేకుండా ఉంటాయి.

● సాగుకు ఢోకా లేదు

రానున్న సీజన్‌పై రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం మారడం, ప్రకృతి సహకరించడంతో ఈ దఫా సాగుకు అవసరమైన నీరు ప్రాజెక్టుల్లోకి చేరింది. గతేడాది ఖరీఫ్‌లో సగం ఆయకట్టు కూడా సాగు కాలేదు. ఈ ఏడాది రబీలో అయితే అసలు పంటే వేయలేదు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టులు ఖాళీ అయ్యాయి. ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉన్నా సాగు లేకపోవడం రైతాంగాన్ని కుంగదీసింది. ధర ఉన్నప్పుడు కూడా పంట వేసుకోలేని దుస్థితి నెలకొంది. సోమశిల, కండలేరు జలాశయాలు డెడ్ స్టోరేజీకు చేరుకోవడంతో ఈ ఏడాది అసలు సాగు జరుగుతుందా..? అన్న అనుమానాలు రైతుల్లో ఉండేవి. కానీ కృష్ణా బేసిన్‌లో భారీ వరదలు రావడం, శ్రీశైలం జలాశయం నిండిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో ఆలోచించింది. పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా జలాలను సోమశిలకు తీసుకొస్తోంది. అక్కడి నుంచి కండలేరుకు తరలిస్తున్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి కృష్ణా జలాల రాక ప్రారంభం కాగా, ఇప్పటి వరకు దాదాపు 50 టీఎంసీల వరకు జిల్లాకు చేరాయి. ప్రస్తుతం సోమశిల నీటి మట్టం 50 టీఎంసీలకు చేరువ కాగా, కండలేరు కూడా 12 టీఎంసీలకు చేరింది. ఇంకా జలాల రాక కొనసాగుతూనే ఉంది. ఇప్పటికున్న నీటితో మొదటి పంట పూర్తి ఆయకట్టులో సాగు చేయవచ్చు. సోమశిల, కండలేరు జలాశయాల కింద పూర్తి ఆయకట్టు 5.50 లక్షల సాగుకు అవకాశం కలగడంతో రైతుల ముఖాల్లో సంతోషం కనిపిస్తోంది. అక్టోబరు, నవంబరు నెలల్లో పెన్నా క్యాచ్‌మెంట్లో స్వల్పంగా వర్షాలు కురిసినా ఆ నీరు వచ్చే ఏడాది రెండో పంటకు ఉపయోగపడుతుంది. దీంతో రానున్న రెండు సీజన్లు రైతులకు దిగులు లేకుండా పోయింది. అయితే సాగులో కీలకమైన పంట కాలువలను బాగు చేయడం మాత్రం అత్యవసరం.

ఇంకా అనుమతులు రాలేదు

ఓఅండ్ఎం పనులకు ప్రతిపాదనలు పంపాం. ఇంకా అనుమతులు రాలేదు. ఇటీవల కూడా అధికారులు వివరాలు తీసుకున్నారు. మరోవారంలో అనుమతులు వస్తాయని ఆశిస్తున్నాం. అనుమతులు రాగానే టెండర్లు పిలిచి, కాలువల్లో పూడిక తీయిస్తాం.

- నాగరాజు, ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ



నీరుపారే అవకాశం లేకుండా పూడిక, గుర్రపు డెక్కతో నిండిన అల్లూరులోని పంట కాలువ

జామాయిల్‌కు రికార్డు ధర

- టన్ను రూ. 7 వేలు ● డిమాండ్‌కు తగ్గట్టుగా లేని సరుకు
- మరింత రేటు పెంచేందుకు పరిశ్రమలు సిద్ధం ● లక్షల ఎకరాల్లో ముమ్మరంగా సాగు

కందుకూరు, సెప్టెంబరు 15: రెండేళ్లక్రితం వరకు మాకు గిట్టుబాటు ధర కల్పించండి మహాప్రభో.. అంటూ పాలకులను వేడుకున్న జామాయిల్ రైతు నేడు ఆనందంతో సరుకు అమ్ముకుంటున్నారు. ఐదు దశాబ్దాల చరిత్రలో ఎన్నడూ లేనంతగా జామాయిల్ కర్రకు నేడు రికార్డు ధర లభించింది. రెండేళ్లక్రితం వరకు టన్ను రూ. 3వేలకు కూడా కొనేస్థితి లేదు. అయితే నేడు టన్ను రూ. 7వేలకు అమ్ముకుంటున్నారు. అంత ధర చెల్లించినా డిమాండ్‌కు తగ్గట్టుగా జామాయిల్ కర్ర లభ్యత లేదు.

● మరింత పెంపు దిశగా..

పేపరు పరిశ్రమలు, ఫ్లైవుడ్ పరిశ్రమల వారు మరింతగా ధరను పెంచేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు తెలిసింది. దీంతో రానున్న రోజుల్లో టన్నుకు మరో రూ. 500 నుంచి రూ. 1000 వరకు ధర పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. గత పదేళ్లలో జామాయిల్ సాగుతో నష్టాలపాలై విసిగి వేసారిన రైతులు , గత మూడేళ్లుగా సాగునుంచి తప్పుకుని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉపక్రమించారు. దీంతో ప్రస్తుతం సరుకు లేని పరిస్థితులు ఏర్పడ్డాయి.

● ఫ్లైవుడ్ పరిశ్రమలవల్లే గిరాకీ

రాష్ట్రంతోపాటు చుట్టుపక్కల రాష్ట్రాల్లో మూతపడి ఉన్న పలు పేపరు పరిశ్రమలు తిరిగి ప్రారంభించారు. దీంతోపాటు ఫ్లైవుడ్ పరిశ్రమలు బాగా విస్తరిస్తుండడంతో జామాయిల్‌కు డిమాండ్ పెరిగిందని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. రాజమండ్రిలో ఉన్న ఏపీ పేపరు మిల్లుతోపాటు భద్రాచలం వద్ద ఉన్న ఐటీసీ పేపరు మిల్లులో ఉత్పాదన పెంచటం, ఎంతోకాలంగా మూతపడి ఉన్న తెలంగాణలోని సిర్పూర్ కాగజ్‌నగర్ పేపరు పరిశ్రమ తిరిగి కార్యకలాపాలు ప్రారంభించటం, కర్నాటక, మహారాష్ట్రలోనూ మూతపడి ఉన్న పేపరు మిల్లులు తెరుచుకోవటం ఇందుకు ఒక కారణమైతే, ప్రధాన కారణం ఫ్లైవుడ్ పరిశ్రమలు పెరగడమని వారు భావిస్తున్నారు. గృహ నిర్మాణంలో నేడు కలప స్థానంలో ఫ్లైవుడ్ వినియోగం విపరీతంగా పెరిగింది. దీనితోపాటు ఇంటీరియల్ డెకరేషన్, కార్పోరేట్ ఆఫీసుల పార్టీషియన్, ఇంటీరియల్స్‌లో ఫ్లైవుడ్ ప్రధాన భూమిక పోషిస్తున్నది. దీంతో ఈ పరిశ్రమలు విస్తారంగా పెరిగాయి. కందుకూరు సమీపంలోని కోవూరు వద్ద ఓ భారీ ఫ్లైవుడ్ పరిశ్రమ గత తొమ్మిదేళ్లుగా ఉత్పత్తి చేస్తుండగా, ప్రకాశం జిల్లా మండల కేంద్రమైన మర్రిపూడి సమీపంలోనూ మరో ఫ్లైవుడ్ పరిశ్రమ రెండేళ్ల నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది. శ్రీకాళహస్తి వద్ద మరో భారీ ఫ్లైవుడ్ పరిశ్రమ ఉండగా, బద్వేలు సమీపంలో సెంచురీ కంపెనీ అతిపెద్ద ఫ్లైవుడ్ పరిశ్రమను నెలకొల్పింది. త్వరలోనే మరికొన్ని ఫ్లైవుడ్ పరిశ్రమలు కూడా ఏర్పాటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫ్లైవుడ్ తయారీకి ప్రధాన ముడిసరుకు జామాయిల్ కాగా, ప్రస్తుతం జామాయిల్ లభ్యత లేక మామిడి, సపోటా, చిల్ల, తుమ్మ లాంటి కర్రను కూడా ఫ్లైవుడ్ పరిశ్రమలో వాడు తున్నారు. అయితే జామాయిల్ ప్రధాన వినియోగం కావటంతో ధర నానాటికీ పెరుగుతోంది.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న జామాయిల్ కర్ర

● ముమ్మరంగా సాగు

ఎకరా విస్తీర్ణంలో జామాయిల్ కర్ర అమ్మితే రూ.2 నుంచి రూ. 3 లక్షల వరకు రాబడి వస్తున్నది. దీంతో ప్రస్తుతం రైతులు విస్తారంగా జామాయిల్ సాగు చేస్తున్నారు. గత ఏడాది కందుకూరు డివిజన్‌లో వేలాది ఎకరాలలో జామాయిల్ సాగు జరగ్గా ఈ ఏడాది విస్తారంగా జామాయిల్ నాట్లు వేస్తున్నారు. కందుకూరు డివిజన్‌లో ప్రతిరోజు కనీసం వెయ్యి ఎకరాలకుపైగా విస్తీర్ణంలో నాట్లు పడుతు న్నట్లు అంచనా. కేవలం కందుకూరు డివిజన్‌లోనేకాక ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వర్షాధార పంటల సాగు చేసే ప్రాంతాలలో ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. నీటి లభ్యత గ్యారంటీ లేని మాగాణి భూములోనూ విస్తారంగా జామాయిల్ నాట్లు వేస్తున్నారు. దీంతో జామాయిల్ నారుకు ఒక్కసారిగా గిరాకీ పెరిగిపోయింది. నెలరోజులక్రితం వరకు మొక్క రూ. 3కు లభించిన క్లోనింగ్ జామాయిల్, నేడు ఐదున్నర, ఆరు రూపాయల పలుకుతోంది. అయినా వెనుకాడ కుండా రైతులు జామాయిల్ సాగు చేసేం దుకు పోటీ పడు తున్నారు.



నెల్లూరు కోటమిట్ట అమీనియా మసీద్‌కు విద్యుత్ దీపాలంకరణ

నేడు మిలాద్ ఉన్ నబి

- నెల్లూరులో భారీ ప్రదర్శన


నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 15: అల్లాహ్ చివరిదూత మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భం గా ముస్లింలు ఈద్ మిలాద్ ఉన్ నబిని భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ పం డుగ ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నందు న సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటిం చింది. ఇస్లామిక్ క్యాలెండర్‌లో మూడవ నెల రబి అల్ అవ్వల్ సందర్భంగా ప్రతి ఏటా ఈ రోజున పండుగను భక్తి,విశ్వాసాలతో జరుపు కుం టారు. సెప్టెంబరు 15 (ఆదివారం) సాయం త్రం నుంచి 16 (సోమవారం) సాయంత్రం వరకు నెల వంక దర్శనం ఉంటుంది. ఈ పండుగ సందర్భంగా పలువురు ముస్లింలు నూతన వస్త్రాలు ధరిస్తారు. పం డుగ విందులతోపాటు మసీదులు, ఇతర దర్శనీయస్థలా లను సందర్శించి ప్రార్థనలు చేస్తారు. ఈ సందర్భంగా మహ్మద్ ప్రవక్తకు కృతజ్ఞతలు తెలిపేందుకు ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు చేస్తారు. అల్లాహ్ జీవితంపై, ఆయన చెప్పిన ధర్మాలపై సత్సంగాలు నిర్వహిస్తారు. రాత్రిపూట ఖురాన్‌ను పఠనం చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ర్యాలీలు నిర్వహించనున్నారు. ఇస్లాం జెండాల(ఆకుపచ్చ జెండా)తో ఈ ర్యాలీ (జులూస్) నిర్వహిస్తారు. నెల్లూరు నగరంలో మిలాద్ ఉన్ నబి సందర్భంగా సోమవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రధాన ర్యాలీ కోటమిట్ట నుంచి బయలు దేరుతుంది. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

'రివర్స్' రద్దు

- టెండరింగ్ విధానంపై ప్రభుత్వం కీలక నిర్ణయం
- పాత పద్ధతిలోనే టెండర్లు పిలిచేలా ఉత్తర్వులు
- వివాదాస్పద పద్ధతికి చెల్లుచీటి

నెల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో ప్రధాన ఘట్టమైన టెండరింగ్ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని తాజాగా రద్దు చేసింది. ఇకపై పాత పద్ధతి(2019కు ముందు ఉన్న విధానం)లోనే టెండర్లు పూర్తి చేయాలని జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంపై కాంట్రాక్టర్ల వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రివర్స్ టెండరింగ్ విధానం మూలంగా పనులు చేయాలంటే రాజకీయ నాయకుల సిఫార్సు సంపాదించుకోవాల్సి వచ్చేదని, ఇకపై స్వేచ్ఛగా టెండర్లు వేసుకోవచ్చునని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అంతకుముందు సాఫీగా జరుగుతున్న టెండర్ల ప్రక్రియను వివాదాస్పదం చేసింది. టెండరింగ్ ప్రక్రియ అంటేనే గోప్యంగా జరగాల్సి ఉండగా, దాన్ని బహిర్గతం చేసింది. రివర్స్ టెండరింగ్ విధానం మూలంగా ఏయే కాంట్రాక్టర్ టెండర్లు వేస్తున్నారన్నది తెలిసిపోయేది. ఏ కాంట్రాక్టర్ ఎంతకు కోట్ చేశారన్న విషయాన్ని ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతలు వెంటనే తెలుసుకునేవారు. ఆ తర్వాత బేరసారాలు మాట్లాడడమో లేక తన అనుమాయులకు వర్కును కట్టబెట్టేందుకు ఇతర కాంట్రాక్టర్లు రివర్స్ టెండర్లో పాల్గొనకుండా చేయడమో చేసేవారు. ఇలా కాంట్రాక్టర్లందరినీ బెదిరిస్తూ వర్కులు లాక్కొనేవారు. నిబంధనల ప్రకారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేసిన తర్వాత వారంలోపు రివర్స్ టెండరింగ్ నిర్వహించాలి. కానీ అలా జరిగేది కాదు. కాంట్రాక్టర్లందరినీ రింగ్ చేయడమో లేక ఒత్తిడి చేయడమో జరిగాకనే రివర్స్ టెండరింగ్ నిర్వహించే వారు. ఎవరైనా వీరిని లెక్క చేయకుండా రివర్స్ టెండరింగ్‌లో పాల్గొనేందుకు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చేందుకు కార్యాలయాలకు వెళితే వారిని దౌర్జన్యంగా అడ్డుకునేవారు. దీని మూలంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడింది. కావలి ప్రధాన రహదారి టెండర్, మలిదేవి డ్రెయిన్ టెండర్, సర్వేపల్లి కాలువ టెండర్, పెన్నా ప్రొటెక్షన్ వాల్స్ టెండర్, చాబోలు రిజర్వాయర్ టెండర్.. ఇలా అనేక రూ.వందల కోట్ల విలువైన వర్కులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో వివాదాలు తలెత్తాయి. దీనంతటికీ కారణం.. ఎవరెవరు ఎంత మొత్తానికి టెండర్లు వేశారన్న విషయం బహిర్గతమైపోవడమే..! ఈ రివర్స్ టెండరింగ్ పద్ధతి మూలంగా చాలా మంది కాంట్రాక్టర్లకు పనులు దక్కేవి కావు. తద్వారా టెండర్ల విధానంలో పారదర్శకత లోపించింది. ఈ విధానంలోని లోపాలను, అప్పటి అధికార పార్టీ నేతల దౌర్జన్యాలను 'ఆంధ్రజ్యోతి' అనేక కథనాల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చింది. కాగా ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇకపై రివర్స్ టెండరింగ్ ఉండదు. ఒకసారి టెండర్ వేస్తే అదే ఫైనల్ అయిపోతుంది. ఏ కాంట్రాక్టర్ టెండర్ వేస్తున్నారన్నది ఇతరులకు తెలిసే అవకాశం లేదు. కాబట్టి పాదర్శకత ఉంటుందని అధికారులు చెబుతున్నారు.





మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న పీఆర్ ఎస్ఈ అశోక్‌కుమార్, తదితరులు

'మోక్షగుండం' సేవలు ఘనం

- ఇంజనీర్స్ డే సందర్భంగా పీఆర్ ఎస్ఈ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 15 : భారతరత్న, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు ఘనమైనవని పీఆర్ సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ) అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి సందర్భంగా ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని నెల్లూరు పీఆర్ ఎస్ఈ కార్యాలయం ఆవ రణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణసాగర్ డ్యామ్, తిరుపతి-తిరుమల ఘాట్ రోడ్డు, హైదరాబాద్ వరద ముప్పు నివారణకు మూసీ నదిపై రిజర్వాయర్ నిర్మాణం, మైసూర్ బృందావన్ గార్డెన్స్, బిహార్ వద్ద గంగానదిపై రైలు వంతెన వంటి అద్భుత కట్టడాలను చేపట్టి, భారతదేశ ఇంజనీర్ల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. మోక్షగుండం ఇంజనీర్లకు మార్గదర్శకుడని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఈఈలు బీ. సుబ్బరాజు, రవీంద్ర బాబు, ఈ. వేణుగోపాల్, పీఆర్ డిప్లమో ఇంజ నీర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్య క్షుడు షేక్ రియాజ్ అహ్మద్, పీఆర్ జేఏసీ చైర్మన్ ఎం.బాబురావు, జేవీ శ్రీధర్, టీ పరమే శలింగం, కే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు చెరువులో ఆక్రమణలు తొలగించండి

నెల్లూరు(వైద్యం) : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని ఏపీ లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ఆర్కిటెక్ట్ సివిల్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వెల్‌ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లలితారామ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఆమని గార్డెన్స్‌లో జరిగిన ఇంజనీర్ల దినోత్సవంలో ముందుగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు చెరువులో 100 ఎకరాలు ఆక్రమణకు గురయ్యా యన్నారు. అలాగే నీటి పారుదల కాలువలపై ఉన్న ఆక్రమ ణలను తొలగిస్తే భారీ వర్షాలకు నెల్లూరుకు ముప్పు తొలగు తుందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి గిరీష్, కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర గౌరవ సలహాదారు శేషారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లలితారామ్

గర్భకోశ వ్యాధులకు ఆధునిక వైద్యంపై సదస్సు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 15 : గర్భకోశ వ్యాధుల చికిత్సకు సంబంధించిన ఆధునిక వైద్య విధానాలను ఎప్పటికప్పుడు వైద్యులు తెలుసుకోవాలని గైనకాలజీ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో గైనకాలజి సొసైటీ మేధోసదస్సు నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ యశోధర మాట్లాడుతూ గర్భిణులకు మూడో నెల దాటిన తర్వాత అబార్షన్ చేస్తే తల్లికి కూడా ప్రమాదం కలిగే అవకాశం లేకపోలేదన్నారు. వయసు మీరిన గర్భవతులకు ఏసీయూలో చికిత్స 30 శాతం ఎక్కువగా ఉంటుందని తెలియచేశారు. గర్భిణులు, కాన్పులకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఈ సదస్సుకు ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాలకు చెందిన వైద్య నిపుణులు కూడా హాజరయ్యారు. ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అశోక్, సదస్సు నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ సుప్రజ, కార్యదర్శి డాక్టర్ లలితా శిరీష, కోశాధికారి డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ పెంచలయ్య

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మాజీ ఎంపీపీ నర్రా కాంతమ్మ మృతి

కొండాపురం, సెప్టెంబరు 15: మండల మాజీ అధ్యక్షురాలు నర్రా కాంతమ్మ (70) శనివారం మృతి చెందారు. తెలుగుదేశంలో ముఖ్య నాయకుడిగా ఉన్న స్వర్గీయ పోలినేని పెదమాల కొండయ్య సోదరి ఈమె. 2001-2005 మధ్య కాలంలో ఎంపీపీగా పనిచేశారు. అప్పటి ఎమ్మెల్యే వంటేరు వేణుగాపాలరెడ్డి సహకారంతో మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నాయకులు ఆదివారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎమ్.ఓంకారం, నాయకులు పోలినేని రమేష్, పోలినేని చంద్రబాబునాయుడు, యారవ క్రిష్ణయ్య, బొట్లగుంట హరిబాబు, మక్కెన అంకయ్య చౌదరి, తల్లపనేని లక్ష్మీనారయణ, వల్లూరు వెంకటేశ్వర్లు, మామిళ్లపల్లి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

ఈగ శ్రీనివాసులురెడ్డి వర్ధంతి


అన్నదానం చేస్తున్న ఐక్య ఫౌండేషన్ నిర్వాహకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 15: అప్పారావుపాళెం గిరిజనకాలనీలో ఐక్య ఫౌండేషన్ సభ్యులు ఆదివారం కడప జిల్లా ఉడుమువారిపల్లికి చెందిన ఈగ శ్రీనివాసులురెడ్డి మొదటి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐక్య ఫౌండేషన్ ఛైర్మన్ పయ్యావుల రామకృష్ణ, డైరెక్టర్ మరుతీనాయుడు, ఈగ పృధ్వీందర్‌రెడ్డి, ఈగ ప్రభుదర్‌రెడ్డి, ప్రభావతమ్మ, కామాక్షయ్య, పావని పాల్గొన్నారు.

ఏచూరి సీతారాంకి నివాళి


నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

జలదంకి, సెప్టెంబర్ 15: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా ఆదివారం వామపక్ష నాయకులు, ఎమ్మార్పీఎస్ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి, దమ్ము దర్గాబాబు, మేలంగి ఆంథోనీబాబు, గోచిపాతల వెంకటేశ్వర్లుమాదిగ పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు, సెప్టెంబరు 15: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ, క్రిమిలేయర్ తీర్పును పునఃపరిశీలించి రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 22న ఒంగోలులోని అంబేద్కర్ భవన్ ఓపెన్ ఆడి టోరియంలో జరుగుతున్న సభను జయప్రదం చేయాలని దళితసంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు కోరారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో ఆది వారం సాయంత్రం నిర్వహించిన మాలల చైతన్య కార్యక్ర మంలో ఆయన పాల్గొని గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్యాంప్రసాద్, వెంకటేశ్వర్లు, కోటి పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణం
అర్ధంతరంగా ఆగిపోయె!

- విడుదల కాని రెండోవిడత నాడు-నేడు నిధులు
- మండలంలోని 19 పాఠశాలల్లో ఇదీ పరిస్థితి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

లింగసముద్రం, సెప్టెంబరు 15: గత వైసీపీ ప్రభుత్వం 2021లో మండలం లో నాడు-నేడు రెండోవిడత కింద ప్రారంభించిన పనులు అర్థాంతరంగా నిలిచిపో యాయి. ఆ నిధులు ఇప్పటికీ విడుదల కాకపోవడంతో సరిపడా తరగతిగదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 17పా ఠశాలలు, 2అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించేందుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద రూ.6.74కోట్లు మంజూరు చేసి వాటిలో రూ.2.87 కోట్లు వి డుదల చేసింది. ఈ నిధులతో అధికారులు లింగసముద్రంలోని కేజీబీవి, వీఆర్.కోట, మొగిలిచెర్ల హైస్కూళ్లతో పాటు మరో 12ప్రాథమిక, 2యూపీ పాఠశాలలు, 2అంగ న్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు ప్రారంభించారు. ఈ పాఠశాలల్లో అదనపు తర గతి గదులు, బాతురూంలు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణ పనులు, టైల్స్, తలుపులు, గదుల మరమ్మతులు పనులు చేపట్టారు. అయితే విడుదలైన నిధుల లో రూ.2.75కోట్లతో పనులు చేశారు. మిగిలిన రూ.12 లక్షలతో ముక్తేశ్వరం, అన్నెబో యినపల్లి పాఠశాలల్లో పనులు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మిగిలిన నిధులు రూ.3.87కోట్లు విడుదల చేయక పోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పనులు నిలిచిపోయాయి. కేజీబీవీలోనూ అదే పరిస్థితి నెలకొంది.


లింగసముద్రం కేజీబీవీలో నిలిచిన తరగతి గదుల నిర్మాణం

దగదర్తి-బుచ్చిరెడ్డిపాలెం
రోడ్డు నిర్మాణ పనుల పునఃప్రారంభం


- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి


రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 15: మండలంలోని దగదర్తి-బుచ్చిరెడ్డిపాలెం మధ్య ఉన్న ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పునఃప్రారంభించారు. దగదర్తికి చేరుకున్న ఆయనకు టీడీపీ రాష్ట్రకార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో పూజస్థలం వరకు స్వాగతం పలికారు. భూమి పూజ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ రోడ్డు పనులు నిలిచిపోయినట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణానికి కొంత రైతుల భూమి కావాల్సి ఉంటుందని వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం చెల్లించైనా పనులు చేపడతాం అన్నారు. రాజకీయ విభేదాలు విడిచి గ్రామాల అభివృద్ధికి కృషి చేదాం అని పిలుపునిచ్చారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజులకే తుమ్మలపెంట, దగదర్తి బుచ్చిరెడ్డిపాలెం రోడ్డు పనులు ప్రారంభించామని.. త్వరలో అల్లూరు రాజుపాలెం రోడ్డు పనులు ప్రారంభిస్తాం అన్నారు. గ్రామాలను అనుసంధానం చేస్తున్న లింకు రోడ్లను గుర్తించి ఉపాధి హామీ పనుల కింద పనులు జరిగేలా చూస్తామన్నారు. డీఎం, డీఆర్ చానల్ పనులు త్వరలో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దగదర్తిలో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నాడని వీలైనంత తొందర్లో ఆయన పర్యటించనున్నట్లు చెప్పారు. రామయ్యపట్నం పోర్టుకు అనుసంధానంగా పరిశ్రమ ఏర్పాటు చేస్తే 40వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కావలి డీఎస్పీ వెంకటరమణ, సీఐ పాపారావు, బీజేపీ రాష్ట్ర నాయకులు భరత్‌కుమార్ యాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు అల్లం హనుమంతరావు, నేతలు చేజర్ల ఇబ్రీన్, జలదంకి శ్రీహరినాయుడు, చెన్నూరు సర్పంచు నాయక్, రెడ్డిమాచి రవీంద్ర, శేషారెడ్డి, పులి శీనయ్య, మల్లికార్జునరెడ్డి, ప్రతాప్, జనసేన నేత వెంకట్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహాలు

లింగసముద్రం, సెప్టెంబరు 15: మొగిలిచెర్ల, లింగసముద్రంలో గణేష్ విగ్రహాల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మొగిలిచెర్లలో టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. విగ్రహాల ఊరేగింపులో యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. అనంతరం గణేష్ విగ్రహాలను రాళ్లపాడు మన్నేరులో నిమజ్జనం చేశారు. మొగిలిచెర్లలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ షేక్ మహబూబ్ సుబానీ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


మర్రిచెట్టు గిరిజనకాలనీలో వినాయకుడి గ్రామోత్సవం

కావలి టౌన్: పట్టణంలోని ముసునూరు గిరిజనకాలనీతో పాటు పలు కాలనీల్లోని వినాయక విగ్రహాలను ఆదివారం భక్తులు నిమజ్జనానికి తరలించారు. మేళతాళాలు, డీజే, భాణాచంచా కాల్చుకుంటూ రంగులు చల్లుకుంటూ యువత చిందులు వేసుకుంటూ గణేష్ మహరాజ్‌కే జై అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగిన గ్రామోత్సవాలు కనువిందు చేశాయి. కలుగోళశాంభవి ఆలయ ప్రాంగణంలో విగ్రహ నిమజ్జనోత్సవం సోమవారానికి వాయిదా పడింది. ముసునూరు గిరిజన కాలనీ వినాయక విగ్రహం మందాటి చెరువులో నిమజ్జనం చేశారు. గిరిజనుల పిల్లలు, పెద్దలు వేడుకలో పాల్గొన్నారు.

పూజల్లో ఎమ్మెల్యే ఇంటూరి..

కందుకూరు, గోకరాజుపాలెం, తానికొండ వినాయకుడికి నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాదాలను భక్తులకు స్వయంగా వడ్డించారు బంగారమ్మ గుడి వద్ద ఆదివారం వివిధరకాల పోటీలు, ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్టి కొట్టిన గుండవరపు సాత్విక్‌ను స్థానికులు అభినందించి రూ. 1,116లను అందజేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 15: మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీ వాసులు ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పొంగించారు. ఈ సందర్భంగా పొంగళ్ల సామగ్రిని నూతన బుట్టల్లో ఉంచుకొని కాలనీ పురువీధుల్లో మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొన్నారు. అనంతరం ఆలయ అవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యంతో పాటు కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొన్నారు.


ఆలయ అవరణలో పొంగళ్లు నిర్వహిస్తున్న భక్తులు

యువ ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం


నివాళులర్పిస్తున్న సుధీర్‌నాయుడు, విద్యార్థులు

కావలి టౌన్, సెప్టెంబరు 15: యువ ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు తెలిపారు. ఆదివారం మద్దూరుపాడు డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఇంజనీర్స్ డే వేడుకలో మోక్షగుండం విశ్వే శ్వరయ్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో రమేష్, హరనాథ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సొసైటీ మహా జనసభ

కలువాయి, సెప్టెంబరు 15: స్థానిక మత్స్యకారుల సహకార సంఘం మహా జనసభ గురువారం ఉదయం 11గంటలకు అంకమ్మ రచ్చ వద్ద నిర్వహించనున్నట్లు కావలి మత్స్యశాఖ సహాయ సంచాలకులు, ఎక్స్ అఫీషియో డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ యస్.శ్రీనివాసులు తెలిపారు. సొసైటీ పరిధిలోని కలువాయి, రామన్నగారిపల్లె, బ్రాహ్మణపల్లి, బద్వేలు, సీతారాంపల్లి గ్రామాల సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

నేత్రదానానికి 25మంది రిజిస్ట్రేషన్


నేత్రదాన శిబిరంలో పాల్గొన్న రెడ్‌క్రాస్ సభ్యులు

కలువాయి, సెప్టెంబరు 15: రెడ్‌క్రాస్ సొసైటీ కలువాయి బ్రాంచ్ ఛైర్మన్ పెంచలపుల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నేత్రదాన శిబిరంలో 25 మంది యువత తమ నేత్రాలను దానం చేసేందుకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నేత్రదానానికి ముందుకు వచ్చిన వారికి రెడ్‌క్రాస్ తరుపున అభి నందనలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కంటి వైద్యనిపుణులు పి.శైలజ పాల్గొని వారికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కలువాయి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కామిశెట్టి వెంకటేశ్వర్లు, రాంబాబు, మల్లికార్జునయ్య, చిన్నయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు


ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 15: దుత్తలూరు మండలం నర్రవాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. సభ్యత్వాల నమోదులో జిల్లాను మొదటిస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, సభ్యత్వ ప్రముఖ్ అందే రామయ్య, నాయకులు లెక్కల వెంకటరెడ్డి, కృష్ణయ్య, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి జట్టుకు అభినందన


క్రికెట్‌లో విజయం సాధించిన ఉదయగిరి యూటీఎఫ్ జట్టు

ఉదయగిరిరూరల్, సెప్టెంబరు 15: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఉపాధ్యాయులకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో ఉదయగిరి యూటీఎఫ్ జట్టు క్రికెట్, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాస్థాయిలో విజయం సాధించింది. క్రికెట్, వాలీబాల్ పోటీల్లో పది జట్లతో తలపడి ప్రథమస్థానంలో నిలిచిన జట్టుకు మండల యూటీఎఫ్ శాఖ శుభాకాంక్షలు తెయచేశారు.

ప్రమాదకరంగా చప్టాలు

కలిగిరి, సెప్టెంబరు 15: కలిగిరి-సంగం మార్గంలో కమ్మవారిపాలెం, పాతనాపురం, అక్బరాబాదు, కలిగిరి-కొండాపురం మార్గంలో కలిగిరి శివారు ప్రాంతం, కుడుమలదిన్నెపాడు, చినఅన్నలూరు, సిద్దనకొండూరు మార్గంలో పరికోట, సిద్దనకొండూరు, కుమ్మరకొండూరు, గంగిరె డ్డిపాలెం, తెల్లపాడు గ్రామాలవద్ద ఉన్న చప్టాల వద్ద రక్షణ గోడలు లేవు. దీంతో వర్షపునీరు ప్రవహించే సమయంలో ఈ మార్గంలో ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. చప్టాల అంచున వరద ప్రవాహాన్ని అంచనా వేసేందుకు కనీసం ఇనుప కడ్డీలు కూడా లేవు. భారీ వర్షాల సమయంలో సిద్దనకొండూరు-14వ మైలు మార్గంలో పరికోట సమీపంలో వాగు ప్రవాహంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపో తున్నాయి. రెండేళ్ల క్రితం సిద్దనకొండూరు, అనంతపురం గ్రామాల నుంచి ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కావలికి బయలుదేరి ఈ వాగు వద్ద నిలిచిపోయారు. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దారుకు సమాచారం అందించగా ఆయన ఈ విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఆ సమయంలో ప్రత్యేక రక్షణ చర్యలు ఏర్పాటు చేసి విద్యార్థులను సురక్షితంగా వాగు దాటించారు. కాగా తక్కువ ఎత్తు ఉన్న వంతెనల వద్ద చప్టాలను నిర్మించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు రూ.1.25 లక్షల విరాళం

హెల్పింగ్ హ్యాండ్స్

కందుకూరు, సెప్టెంబరు 15: నియోజకవర్గ సీనియర్ టీడీపీ నాయకులు వరద బాధితుల సహాయార్థం రూ.1.25 లక్షలు విరాళం అందజేశారు. పార్టీ ముఖ్య నాయకులు కలిసి ఈ మొత్తాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అందజేశారు. విరాళం అందజేసిన వారిలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల అధ్యక్షుడు నార్నె రోశయ్య, గుడ్లూరు మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, లింగసముద్రం మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, వివిపాలెం మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, ఉలవపాడు మండల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, కృష్ణాపురం టీడీపీ అధ్యక్షుడు చక్రవర్తుల విజయ్‌కుమార్, పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు వడ్డెళ్ల రవిచంద్ర ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు నియోజకవర్గ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు అందజేస్తుండటం అభినందనీయమన్నారు.


కొండాపురం: కాకర్లకు చెక్కును అందచేస్తున్న జాగర్లమూడి శ్రీనివాసరావు


కందుకూరు: ఎమ్మెల్యే ఇంటూరికి విరాళం అందజేస్తున్న టీడీపీ నాయకులు


కొండాపురం: వాహనంలో ఉంచిన సరుకులతో యువత

కొండాపురం: తెలుగుయువత మండల మాజీ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసరావు రూ.20వేల చెక్కును ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఉదయగిరి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

సాయపేటలో యువత ఆధ్వర్యంలో..

కొత్తపాలెం, మక్కెనవారిపాలెం, వెల్లటూరివారిపాలెం, ఇస్కపాలెం గ్రామాల్లో విరాళాలు సేకరించారు. వస్తువులు, బియ్యం, నిత్యావసరాలు ధనరూపంలో విరాళాలు సేకరించినట్లు సామాజిక కార్యకర్త భీమిరెడ్డి అరుణ తెలిపారు. 250మంది కుటంబాలకు సరుకులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గంటా శ్రీనివాసులు, షేక్ మహబూబ్ బాషా, వల్లూరు వెంకటేశ్వర్లు, తాటికొండ ప్రవీణ్, పొడపాటి కొండయ్య, మందా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జలదంకి : విజయవాడ వరదబాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు మండలం ఐటీడీపీ అధ్యక్షుడు ఏగూరి రఘు రూ.20వేల చెక్కును ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు అందజేశారు.

సమస్యల పరిష్కారానికే పంచాయతీ ప్రజాదర్బార్

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, సెప్టెంబర్ 15: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం జమ్మలపాలెం గ్రామ సచివాలయంలో పంచాయతీ ప్రజాదర్బార్ నిర్వహించారు. 500మందికిపైగా స్థానికులు కార్యక్రమంలో పాల్గొని వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. వీటిపై అక్కడే ఉన్న మండల అధికారులతో చర్చించడంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. జలదంకిలో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు, తాగు, సాగునీటి సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు.

- పేదల నుంచి నుడా ఎంబజీ లేఅవుట్లకు సేకరించిన భూమికి సంబంధించి 26మందికి నష్టపరిహారం నేటికీ అందలేదని మాజీసర్పంచ్ నక్కా మాదవరావు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు హేమంత్‌కుమార్‌ను పిలిచి వెంటనే వీరికి నష్టపరిహారం అందజేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.
- తన కుమారుడు విద్యుత్‌షాక్‌తో మరణిస్తే ప్రభుత్వ నష్టపరిహారం అందలేదని బాధిత మహిళ ఎమ్మెల్యే ఎదుట తన గోడు వెళ్లబోసుకుంది. అక్కడే ఉన్న సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌ను పిలిచి వివరాలు అడిగారు. ఎన్నికల కోడ్ ఉన్నందున రూ.5లక్షల పరిహారం చెక్కు ఆగిం దన్నారు. పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.
- ఉదయం 9గంటలకు ప్రారంభమైన ప్రజాదర్బార్ సాయంత్రం 4గంటలు కొనసాగింది. ప్రజాదర్బార్‌కు వచ్చిన ఎమ్మెల్యేను సర్పంచ్ బుర్రి శ్రీవేణి సన్మానించారు.
- అనంతరం ఎమ్మెల్యే కాకర్ల విలేకరులతో మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పంచాయతీ ప్రజాదర్బార్ కార్యక్రమంను మొదటగా జమ్మలపాలెంలో చేపట్టామన్నారు. తాగునీటి సమస్యపై అధిక వినతులు వచ్చాయన్నారు. సోమశిల జలాలు చెరువుకు వచ్చేందుకు కాలువ నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర్రి శ్రీవేణి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, తహసీల్దారు హేమంత్‌కుమార్, ఎంపీడీఓ, టీడీపీ మండలాధ్యక్షుడు మధుమోహన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి భాస్కర్‌రెడ్డి, మాల్యాద్రియాదవ్, తల్లపనేని మధుసూదనరావు, నక్కా మాధవరావు పాల్గొన్నారు.


అర్జీదారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

పనిచేసిన వారిని
విస్మరించడం విచారకరం: మాలేపాటి

కావలి, సెప్టెంబరు 15: పట్టణంలో కష్టకాలంలో టీడీపీ కోసం పనిచేసిన వారిని విస్మరించడం విచారకరం అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. ఆదివారం కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసిన వారికి కావలిలో తగిన గుర్తింపు ఇవ్వటం లేదని వైసీపీ వారిని చేర్చుకుని వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతామన్నారు. కావలిలో పార్టీ పటిష్టతకు ఎన్నో పోరాటాలు చేశామని ఆ సమయంలో 16కేసులు పెట్టినా ఎక్కడా వెనక్కు తగ్గలేదన్నారు. చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్న సమయంలో దగదర్తిలో కొందరు వైసీపీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్న వారికి ఇప్పుడు టీడీపీ దగ్గరకు చేర్చుకుని వారికి ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో టీడీపీ అభ్యర్థి క్రిష్ణారెడ్డి దగదర్తిలో మాలేపాటి బ్రదర్స్‌కు తెలియకుండా ఏ కార్యక్రమం చేపట్టమని చెప్పి ఇప్పుడు విస్మరించారన్నారు. నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల సమయంలో పార్టీ నుంచి సస్పెండ్ చేసిన పమిడి రవికుమార్ చౌదరి దగదర్తిలో పెత్తనం చెలాయించటం ఏమిటన్ని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో తాము పార్టీకోసం సక్రమంగా పనిచేయలేదని చేస్తున్న ఆరోపణలను ఒక్కటి రుజువు చేయాలని సవాల్ విసిరారు. ఈ విషయంపై త్వరలో చంద్రబాబు నాయుడిని కలిసి ఇక్కడ పరిస్థితులు వివరించి ఆయన ఆదేశాల మేరకు నడుచుకుంటామన్నారు.